మహాభారతం

# మహాభారతము వచనము - సౌప్తిక పర్వము



ఉచిత గురుకుల విద్య ఫౌండేషన్

www.freegurukul.org


సదాశివ సమారంభాం
గురు దక్షిణామూర్తి
గురు వేదవ్యాస మహర్షి
గురు శుక మహర్షి
గురు నారద మహర్షి
గురు వాల్మీకి మహర్షి
గురు శ్రీకృష్ణ
శంకరాచార్య మధ్యమాం
గురు దత్తాత్రేయ
గురు బాబాజి
గురు గౌతమ బుద్ధ
గురు ఆదిశంకరాచార్య
గురు రామానుజాచార్యులు
గురు జ్ఞానేశ్వర్
గురు రవిదాస్
గురు కబీర్ దాస్
గురు చైతన్య మహా ప్రభువు
గురు నానక్
గురు రాఘవేంద్ర స్వామి
గురు వీరబ్రహ్మేంద్ర స్వామి
యోగి వేమన
అస్మదాచార్య పర్యంతాం
గురు త్రైలింగ స్వామి
గురు లాహిరి మహాశయ
గురు రామకృష్ణ పరమహంస
అమ్మ శారదా దేవి
గురు వివేకానంద
గురు సాయిబాబా
గురు అరబిందో
గురు రమణ మహర్షి
గురు యోగానంద
గురు భక్తివేదాంత ప్రభుపాద
గురు మళయాళ స్వామి
గురు విద్యాప్రకాశానందగిరి
గురు చంద్రశేఖర పరమాచార్య
వందే గురుపరంపరాం..

Free Gurukul

"ఉచిత గురుకుల విద్య ఫౌండేషన్" ద్వారా విలువలు, నైపుణ్యాలతో కూడిన విద్య ఉచితంగా + సులభంగా + ఆకర్షణీయంగా + నాణ్యతతో కూడి అందించే సేవా కార్యక్రమంలో బాగంగా ఈ పుస్తకాన్ని భారత ప్రభుత్వపు వెబ్ సైట్( డిజిటల్ లైబ్రరీ అఫ్ ఇండియా) నుంచి సేకరించి అందిస్తున్నాము. ఇందుకు మేము వారికి కృతజ్ఞత తెలియచేసుకుంటున్నాము.

సాయి రామ్ వారి సేవల విస్తరణలో బాగంగా ఈ ఫౌండేషన్ స్థాపించబడినది. ఈ స్వచ్ఛంద సంస్థ ద్వారానే అన్ని సేవలు అందించబడును. ఇటువంటి పుస్తకాలు మీరు వ్రాసినట్లయితే (లేక) సేకరిస్తే మాకు తెలియచేయండి. మేము ప్రతి విద్యార్థికి ఉచితంగా అందేలా చేస్తాము, తద్వారా ఉన్నత విలువలు, నైపుణ్యాలు కలిగిన విద్యార్థులను మన దేశానికి అందించవచ్చు. మాతో కలిసి నవ భారత నిర్మాణ కార్యక్రమంలో పనిచేయుటకు, భాగస్వామ్యం అగుటకు ఆసక్తి ఉంటే సంప్రదించగలరు.

ఈ గ్రంధాలను ఉచితంగా ఆన్ లైన్ లో చదువుటకు, దిగుమతి(డౌన్లోడ్) చేసుకొనుటకు గల మార్గాలు:

1) భారత ప్రభుత్వపు వెబ్ సైట్: http://www.new.dli.ernet.in
2) ఉచిత గురుకుల విద్య ఫౌండేషన్ వెబ్ సైట్ : www.freegurukul.org
3) సాయి రామ్ వెబ్ సైట్ : https://sites.google.com/site/sairealattitudemanagement
4) మొబైల్ ఆప్: Free Gurukul

గమనిక: భక్తి,జ్ఞాన,ధర్మ ప్రచారార్ధం ఉచితంగా eBook రూపంలో భారత ప్రభుత్వపు డిజిటల్ లైబ్రరీ సహాయంతో ఇవ్వడం జరిగింది. ఇది లాభార్జన దృష్టిలేని ఉచిత సేవ. ఈ సేవలో అంతర్జాలంలోని(ఇంటర్నెట్) లైసెన్సు / కాపీరైటు అభ్యంతరాలు లేనివి అనుకొన్న పుస్తకాలను గ్రహించటం జరిగినది. అనుకోకుండా ఏవైనా అభ్యంతరకరమైనవి ఉన్నచో మాకు తెలుప మనవి, వాటిని తొలగించగలము అని మనవి చేసుకొంటున్నాము.

Website: www.freegurukul.org Mobile App: Free Gurukul email: support@freegurukul.org
Facebook: www.facebook.com/freegurukul Help Line / WhatsApp: 904 202 0123


" మన లక్ష్యం: విలువలు, నైపుణ్యాలతో కూడిన విద్య అనేది ఉచితంగా + సులభంగా + ఆకర్షణీయంగా + నాణ్యతతో కూడి అందరికి అందించబడాలి "

ఉచిత గురుకుల విద్య ఫౌండేషన్ – Free Gurukul Education Foundation

సర్వం పరమాత్మ పాద సమర్పణమస్తు

భారత ప్రభుత్వపు వెబ్ సైట్ - డిజిటల్ లైబ్రరీ అఫ్ ఇండియా

http://www.new.dli.ernet.in



# అతి విశిష్టం ఈ దానం!

స్వామి వివేకానంద

"దానాలలోకెల్లా ఆధ్యాత్మిక విద్యాదానం చాలా శ్రేష్ఠమైంది! దాని తరువాతిది లౌకిక జ్ఞానదానం, ప్రాణదానం, అన్నదానం" అని వ్యాసమహర్షి చెప్పారు.

మన ఆధ్యాత్మిక జ్ఞానం భారతదేశ హద్దులలో నిలిచి పోకూడదు. లోకమంతటినీ ఆవరించాలి! ఇలా లోకవ్యాప్తమైన ధర్మప్రచారాన్ని మన పూర్వులు చేశారు. హైందవ వేదాంతం ఎన్నడూ ఈ దేశం దాటి పోలేదని చెప్పేవారూ, మతప్రచారార్థం తొలిసారిగా, పరదేశాలకు వెళ్ళిన సన్న్యాసిని నేనే అని చెప్పేవారూ, తమ జాతిచరిత్ర నెరుగని వారే! ఇలాంటి సంఘటనలు ఎన్నోసార్లు జరిగాయి. అవసరమైనప్పుడల్లా, భారతీయ ఆధ్యాత్మిక జ్ఞానప్రవాహం వెల్లువలా లోకాన్ని ముంచెత్తుతూ వచ్చింది.

రాజకీయ ప్రచారాన్ని రణగొణధ్వనులతో, యోధులతో సాగించవచ్చు. అగ్నిని కురిపించి, కత్తిని ఝళిపించి, లౌకిక జ్ఞానాన్నీ, సంఘనిర్మాణ విజ్ఞానాన్నీ విరివిగా ప్రచారం చేయవచ్చు. కానీ ఆధ్యాత్మిక జ్ఞానదానం కళ్ళకు కనిపించకుండా, చెవులకు వినిపించకుండా కురుస్తూ, రోజా పువ్వుల రాసుల్ని వికసింపజేసే మంచులాగా నిశ్శబ్దంగా జరగవలసి ఉంది. భారతదేశం నిరాడంబరంగా, లోకానికి మళ్ళీ మళ్ళీ చేస్తూ వచ్చిన దానమిదే!

మిత్రులారా! నేను అవలంబించే విధానాన్ని తెలియజేస్తాను వినండి. భారతదేశంలోనూ, ఇతర దేశాల్లోనూ మన పారమార్థిక ధర్మాలను బోధించడానికి తగినవారుగా మన యువకుల్ని తయారు చేయడానికై భారతదేశంలో కొన్ని సంస్థలను నెలకొల్పాలి! ఇప్పుడు మనకు కావలసింది బలిష్ఠులు, జవసంపన్నులు, ఋజువర్తనులు, ఆత్మ విశ్వాసపరులు అయిన యువకులు. అలాంటి వారు నూరుమంది దొరికినా, ప్రపంచం పూర్తిగా పరివర్తన చెందగలుగుతుంది!!

ఇచ్ఛాశక్తి తక్కిన శక్తులన్నిటి కన్నా బలవత్తరమైంది. అది సాక్షాత్తూ భగవంతుని దగ్గరి నుండి వచ్చేదే కాబట్టి దాని ముందు తక్కినదంతా లొంగిపోవలసిందే. నిర్మలం, బలిష్ఠం అయిన 'ఇచ్ఛ' (సంకల్పం) సర్వశక్తిమంతమైంది. దానిలో మీకు విశ్వాసం లేదా? ఉంటే మీ మతంలోని మహోన్నత ధర్మాలను ప్రపంచానికి బోధించడానికై కంకణం కట్టుకోండి. ప్రపంచం ఆ ధర్మాల కోసమై ఎదురుచూస్తోంది. అనేక శతాబ్దాలుగా ప్రజలకు క్షుద్రసిద్ధాంతాలు నేర్పడం జరిగింది. వారు వ్యర్థులని ప్రపంచమంతటా బోధలు జరిగాయి. ఎన్నో శతాబ్దాల నుండి వారు ఈ బోధనల వల్ల భయభ్రాంతులై, పశుప్రాయులైపోతున్నారు. తాము ఆత్మస్వరూపులమనే మాటను వినడానికైనా వారెన్నడూ నోచుకోలేదు. "నీచాతినీచుడిలో కూడా ఆత్మ ఉంది. అది అమృతం, పరమ పవిత్రం, సర్వశక్తిమంతం, సర్వవ్యాపకమైనది" అని వారికి ఆత్మను గురించి చెప్పండి. వారికి ఆత్మవిశ్వాసాన్ని ప్రసాదించండి. ❖



మూలం: శ్రీ రామకృష్ణ ప్రభ - ఫిబ్రవరి 2014

శ్రీ

# మహాభారతము

## వచనము

## సౌప్తికపర్వము

*
**

ఇది

శ్రీ మంత్రి లక్ష్మీనారాయణశాస్త్రిగారిచే

వ్రాయబడి

శ్రీ జయంతి జగన్నాథశాస్త్రిగారిచే

సంస్కరింపఁబడినది

*
**

ప్రకాశకులు:

కొండపల్లి వీరవెంకయ్య అండ్ సన్సు

శ్రీ సత్యనారాయణ బుక్ డిపో,

రాజమండ్రి.

1956

# విషయసూచిక

1 సౌప్తికపర్వ ప్రారంభము
2 గుడ్లగూబ కాకులను చంపుటను అశ్వత్థామ చూచుట
3 కృపాచార్యుడు అశ్వత్థామకు నీతిని వుపదేశించుట
4 అశ్వత్థామ తనకార్యమును స్థిరీకరించుట
5 నిద్రాసక్తులం జంపదగదని కృపాచార్యుడు చెప్పుట
6 శివుడు భూతాకృతి యగుట
7 అశ్వత్థామ శివునకు ఆత్మోపహార మిచ్చుట
8 శివుడు అశ్వత్థామకు ఖడ్గమిచ్చుట
9 అశ్వత్థామ నిద్రబోవుచుండు ధృష్టద్యుమ్నుని చంపుట
10 అశ్వత్థామ ఏనుగులను గుఱ్ఱములను జంపుట
11 అశ్వత్థామ శిఖండిని చంపుట
12 అశ్వత్థామ కృప కృతవర్మల గూడికొనుట
13 అశ్వత్థామాదులు దుర్యోధనుని జూచుట

## ద్వితీయాశ్వాసము

14 ధర్మరాజు తనపుత్రులు చచ్చుటవిని దుఃఖించుట
15 ద్రౌపది అశ్వత్థామను పరిభవించుటకు భీమునిబంపుట
16 కృష్ణార్జున ధర్మరాజులు అశ్వత్థామ మీదికిపోవుట
17 బ్రహ్మశిరోనామ కాస్త్రముల యుద్ధము
18 శ్రీకృష్ణుడు ఉత్తర గర్భము దగ్ధముఁగాకుండ జేయుట
19 భీముడు అశ్వత్థామ శిరోరత్నమును దెచ్చి ద్రౌపదికిచ్చుట
20 ధర్మరాజునకు కృష్ణుడు శివప్రభావమును చెప్పుట
21 రుద్రుడు దేవతలుజేయు యజ్ఞముచేయుట

శ్రీ

# మ హా భా ర త ము

## వ చ న ము

## సౌ ప్తి క ప ర్వ ము

దేవా! హరిహరనాథా! వైశంపాయన మునీంద్రుడు జనమేజయునిజూచి యిట్లనెను. జనమేజయ మహారాజా! సంజయునివలన అశ్వత్థామయొక్క ఉత్సాహ విశేషమునువిని ధృతరాష్ట్రుడు సంజయునితో యిట్లనెను. సంజయా అశ్వత్థామ యుద్ధవీరులలో శ్రేష్ఠుడని చెప్పదగును. అశ్వత్థామయు, అతనికి సహాయులగు కృపాచార్య కృతవర్మలును పిమ్మట యేప్రకారముగా పరాక్రమించిరో చెప్పుము. అని యిట్లు ధృతరాష్ట్రుడడుగగా సంజయు డిట్లనెను.

ధృతరాష్ట్ర మహారాజా! ఇట్లు దుర్యోధనుడు అశ్వత్థామకు అభిషేకము చేయుచుండెను. ఆ అశ్వత్థామయొక్క ఉత్సాహమునకు ఉపోద్బలముగా కృపాచార్య కృతవర్మలును మిక్కిలి ఉత్సాహముతో కూడిన యుద్ధప్రయత్నములను గలిగి ప్రకాశింపుచుండిరి. ఆ ముగ్గురిని పాండవులను చంపుటకు దుర్యోధనుడు పంపించెను. దుర్యోధనుడు పడియున్న స్థలమునకు పాండవశిబిరము దక్షిణ దిక్కుకువ్యాపించి పడమరముఖము కలిగియుండెను. ఆపాండవ శిబిరమునకు యెదురుగా అశ్వత్థామాదులు ముగ్గురును వెళ్ళిరి. వారుముగ్గురును పాండవశిబిరము దగ్గరకు పోయిరి.

అప్పుడు పాండవ సిబిరములోనుండు సైనికులును, రథికులును తమకు విజయము కలిగెనని పొంగుచు పెద్దకంఠ ధ్వానులచేత అర

చుచు పెద్దగా సింహనాదములను చేయుచు మత్తిలి నవ్వుచుండిరి. ఆధ్వనులన్నియుచేరి ఆకాశమందు వ్యాపించి మిక్కిలి మ్రోతగలిగి యుండెను. ఆమ్రోతను కృపాచార్యాదులు ముగ్గురునువిని పాండవ బలములు తమమీదకు వచ్చుచున్నవని తలచిరి. కృపాచార్య కృత వర్మ అశ్వత్థామలు ముగ్గురును భయపడి పాండవశిబిరమువైపుపోక యెక్కడికైనను పోదలచిరి. అట్లు యోచించి తూర్పుదిక్కుకు కొంత దూరము పోయిరి. అని సంజయుడు చెప్పుచుండగా ఆ మాటలను ధృతరాష్ట్రుడువినుచు చిత్తవశము లేనివాడై తనకు కలిగిన దురవ స్థను చింతించుచు సంజయునితో యిట్లనెను.

సంజయా! భీమునిచేత యీప్రకారముగా దుర్యోధనుడు చచ్చెనుగదా! దుర్యోధనుడు అధికబలశౌర్యము గలవాడనియు, అత నిని శత్రువులు గెలువజాలరనియు నమ్మియుంటిని. నానూరుగురు కొడుకులును చచ్చిరని వినియు, నామనస్సు అనేక ఖండములుగా పగులుటలేదు. నామనస్సు రాతిచేత నిర్మింపబడినట్లు తోచుచున్నది ఇకనేను దీనుడనై పాండవులను ఆశ్రయింపజాలను. నే నెక్కడి కైనను వెళ్ళెదను. అట్టిదుర్యోధన మహారాజునకు తండ్రినై మిక్కిలి గౌరవముగా బ్రతికితిని. అంత గొప్పగా బ్రతికి యికమిక్కిలి హీన స్థితినిపొంది బ్రతుకరాదు. భీముడు నన్నుగురించి మాటలాడుమాట లను నేను వినజాలను. అశ్వత్థామ కృపాచార్య కృతవర్మలు ముగ్గు రును పిమ్మట యేమిచేసిరో చెప్పుము అని ధృతరాష్ట్రుడడుగగా సంజయు డిట్లనెను.

ధృతరాష్ట్ర మహారాజా! యీప్రకారము అశ్వత్థామ కృపా చార్య కృతవర్మలు ముగ్గురును అట్లు తూర్పుదిక్కుకువెళ్ళి అడవిలో ప్రవేశించిరి. ఆ యడవిలో ఒకనీటి మడుగుండెను. ఆ మడుగునందు నీళ్ళుత్రాగుటకు వారి సారథులు రథములను నిల్పిరి. అట్లు నిల్పి సార

ధులు నీళ్ళుత్రాగి గుర్రములకు నీళ్లుపట్టిరి. కృపాచార్య కృతవర్మ అశ్వత్థామలు ముగ్గురును, రథము లుడిగి నీళ్లుత్రాగి ముందుపాండవ శిబిరమందు వినిన మ్రోతను ఆలకింపుచుండిరి. అసమయమందు సూర్యుడు అస్తమించెను. కృపాచార్య కృతవర్మ అశ్వత్థామలు ముగ్గురును సంధ్యాకాలమందు చేయదగిన కార్యములను చేసిరి. వారుముగ్గురును ఆయడవిలో ఒక మర్రిచెట్టుయొక్క సమీపమందు కూర్చుండిరి. సూర్యుడు అస్తమించి నప్పుడు తామర మొగ్గలు ముకుళించినట్లు కృపాచార్యాదుల ముఖములు కాంతిహీనము లయ్యెను. చీకట్లు కలిగినట్లు ఆ కృపాచార్యాదులకు దుఃఖము సంప్రాప్తమాయెను. భూతభేతాళ గణములు వచ్చినట్లు ఆకృపాచార్యాదుల మనస్సులకు చింతలు కలిగెను. అశ్వత్థామకలహము కలుగుననియు ఆ కలహమును చూడవలెననియు వేడుకచేత దేవతలు ఆకాశమునకువచ్చి నిలిచి యున్నట్లుగా చుక్కలు కనబడెను. ఇట్లు రాత్రికాలమాయెను. పగటియందు సంచరించు జంతువులు సంచారమును విడచి శాంతములై యుండెను. రాత్రికాలమందు సంచరించు జంతువులు సంచరించుటకు ప్రారంభించెను. అంతట కృపాచార్యాదులు ముగ్గురును దుఃఖమనస్సులతో కౌరవబలములు నిష్కారణముగా చచ్చెనని చెప్పుకొని, అసంబంధములైన మాటలను మాటలాడుచుండిరి. మాటలాడుచు శ్రమజెంది కొంతసేపునకు క్రిందపడుకొని దుఃఖింపుచుండిరి. అట్లు దుఃఖించుచు కృపాచార్య కృతవర్మ లిద్దరును నిద్రించిరి. అశ్వత్థామ మాత్రము పాండవులయందుగల క్రోధాతిశయము చేత నిద్రింపక అక్కడుండు మర్రిచెట్టును కలియజూచుచుండెను, ఆమర్రిచెట్టుయొక్క పెద్దకొమ్మలందును, పెద్దకొమ్మలకుగల చిన్న కొమ్మలయందును అనేక కాకులుఅణగి నిద్రింపుచుండెను. ఆ నిద్రించు కాకులను అశ్వత్థామ చూచెను.

## అశ్వత్థామ ఉలూకము కాకముల జంపుట జూచుట

ఆసమయమున ఒకపెద్దగుడ్లగూబ ఆ మఱ్ఱిచెట్టు మీాదకు వచ్చెను. ఆగుడ్లగూబయొక్క నేత్రములు అగ్నికణములవలె యెఱ్ఱగా నుండెను. నేత్రకాంతులు నిప్పులు క్రమ్మినట్లు అంతటను వ్యాపించు చుండెను. గుడ్లగూబయొక్క రెక్కలు కెంపులవలె యెఱ్ఱగా నుండెను. ఆరెక్కలతో గుడ్లగూబ వచ్చుచుండగా పెద్దమ్రోతకలిగెను. ఇట్లాగుడ్లగూబ మిక్కిలి భయంకరముగా నుండెను. ఆగుడ్లగూబ యీా విధముగా తనభయంకరమైన ముఖమును యిరుప్రక్కలయందుంచి చూచుచు మాంసమును పెదకు చుండెను. అక్కడుండు బయలంతయు తానేయై ఆశ్చర్యవిధముగా నుండెను. గుడ్లగూబ వచ్చునప్పుడు ఘోరమైన శబ్దముగలిగి క్రూరగతి కలిగియుండెను. గుడ్లగూబపక్షి సర్వభూతము లకును భయమును కలిగింపుచుండెను. గుడ్లగూబపక్షి మఱ్ఱిచెట్టునందు వ్రాలెను. గుడ్లగూబ తనదేహ అవయవముల ఆధిక్యతను అణచుకొని తిన్నగా నడచుచు మఱ్ఱిచెట్టుమీాద కొమ్మలయందు ప్రవేశించి అందుండు కాకులను ఆక్రమించెను. గుడ్లగూబ నిద్రించు కొన్ని కాకుల కంఠములను నరికెను-కొన్ని కాకుల యొక్క కాళ్ళను విరిచెను. కొన్ని కాకుల వెన్నులు చీల్చెను, కొన్ని కాకుల పొట్టలు మట్టెను. మరికొన్ని కాకులను పూర్తిగా [illegible]గెను. ఇట్లాగుడ్లగూబపక్షి ఆ కాకుల నన్నిటిని శీఘ్రముగా చంపివేసెను.

ధృతరాష్ట్రమహారాజా! ఆ నిద్రించు కాకులన్నిటిని అనేక విధములుగా గుడ్లగూబ చంపెను. తన శత్రువులగు కాకులను చంపి మొనగానివలె ఆగుడ్లగూబ సంతోషింపు చుండెను. ఆవిధమంతయు అశ్వత్థామ చూచి అట్లేతానును పాండవులను చంపుటకు ఉత్సాహము కలవాడై తన మనస్సులో యిట్లని యోచించెను. ఈ గుడ్ల

గూబపక్షి నా కుపదేశము చేసినట్లున్నది. పాండవ పాంచాలాదులు నిద్రించునప్పుడు వారిని చంపెదను. ఈ గుడ్లగూబపక్షి చెప్పిచూపిన కార్యము మిక్కిలి మంచిది. అట్లే నేను చేసెదను. నేను పూనిన కార్యమునకు ఇంతమాత్రపు వుపాయము యిదివరకు నాకు తెలియలేదు. ఆ పాండవులను వారి బంధుపుత్ర మిత్రులను వారి బలములను నేను అవశ్యముగా చంపి వేసెదనని దుర్యోధనుడు వినుచుండగా చెప్పితిని.

ఆ మహాత్ములైన పాండవులు మిక్కిలి పరాక్రమ వంతులు. వారిని చక్కగా యెదిరించి గెలుచుటకు సాధ్యముగాదు. పాండవులను యెదిరించి యుద్ధముచేయుటచూడగా అగ్నిమీదకు పోవు మిడుత చందమగును. ఆ పాండవులను యీ దినమందు చంపక మరి యొకనాడు చంపిన యెడల దుర్యోధనుడు ప్రాణములను విడిచిన పిమ్మట నేను చేసిన పనికి సంతోషించువాడు లేకపోవును. చక్కని యుద్ధమందు పాండవులను గెలుచుటకు సాధ్యముగాదని నేను చింతించుచుంటిని. ఇంతలో గుడ్లగూబ కాకులను చంపిన విధము నాకు తోచెను. శత్రువులను చంపువిషయమై అన్యాయమని తలచక యేయుపాయము చేతనైనను శత్రువులను చంపుటకు ఉత్సహింప వలెనని శాస్త్రము చెప్పుచున్నది. అదియెట్లనగా తనమీదకు శత్రువులు వచ్చినప్పుడును దిగియుండు నప్పుడును. నడచివచ్చు సంకట మార్గమందును శత్రువులు చెడి తిరుగునప్పుడును శత్రువులు నిద్ర బోవు సమయమందును శత్రువులమీదపడి చంపవలయునని నీతి వాక్యములను వినియున్నాను. క్షత్రియ ధర్మమగు యుద్ధమును అంగీకరించిన వానికి యిట్లు శత్రువులను చంపుట తగియుండును. పాండవులు భీష్మ ద్రోణులను చంపునప్పుడు ధర్మమార్గముగా యుద్ధము చేయలేదు. పాండవులు కర్ణ దుర్యోధనులను పడగొట్టిన పద్ధతులు అధర్మములే యగును. గనుక కపటోపాయములు గల పాండవులను

నిద్రాసమయమందు చంపుట నీతిమార్గమే యగును. కాని దోషము కాదు. అని అశ్వత్థామ తన మనస్సులో యోచించి క్రూరకర్మను జేయుటకు నిశ్చయించెను. అశ్వత్థామ తన మేనమామయగు కృపాచార్యుని కృతవర్మను లేపెను. ఆ కృపాచార్య కృతవర్మ లిద్దరును మేలుకొని యిట్టి సమయమందు నిద్రించితిమేయని సిగ్గుగలిగియుండగా వారితో అశ్వత్థామ యిట్లనెను.

కృపాచార్య కృతవర్మలారా! అయ్యో! మన ముగ్గురము యీ దినమందు కౌరవ సేనలోనుంచి తప్పి తొలగిపోతిమి. అంతట పాండవులును, పాంచాలురును అనేకులు దుర్యోధనుని చుట్టు ముట్టుకొనిరి. దుర్యోధన మహారాజు పదియొకండు అక్షౌహిణుల సైన్యములకు ప్రభువులై యుండి తుదకు వొంటరిగా శత్రువుల నడుమ చిక్కుపడెను. అట్లు చిక్కుపడియు దుర్యోధనుడు తప్పక భీమునితో గదా యుద్ధము జేయుచుండెను. అప్పుడు పాపాత్ముడైన భీముడు అధర్మముగా గదచేత దుర్యోధనుని తొడలు విరుగగొట్టి కూల్చెను. కురుదేశమునకు రాజ్యాభిషేకము చేయబడిన దుర్యోధనుని శిరస్సును యెడమ కాలిచేత దన్నెను. అవమాన బాధ మరణబాధకంటెదుర్యోధనునికు అధికమైయుండెను. మహాబలపరాక్రమ వంతులగువీరులు దుర్యోధనునిని మిత్రులై యిన్ని దినములవరకు యుద్ధముచేసిరి. ఏవిధము చేతను జయమును పొందక వీరలందరును తుదకు చచ్చిపోయిరి. ఇక నేమని చెప్పవచ్చును. అని అశ్వత్థామ అనేకవిధములైన వాక్యములను చెప్పి ఆ కృపాచార్య కృతవర్మలతో యిట్లనెను.

కృపాచార్య కృతవర్మలారా! మీ మనస్సు కలతజెందియుండలేదుగదా! నా మనస్సునకు మహాదుఃఖము గలిగియున్నది. ఈ దుఃఖమునకు యేమిచేయవలయునో మీరు చెప్పవలయును అని అశ్వత్థామ కృపాచార్య కృతవర్మలతో చెప్పి అడిగెను. ఆ మాటల

పద్ధతిని కృపాచార్యుడు తెలిసికొని అశ్వత్థామ యొక్క ముఖము చూచి యిట్లనెను.

## కృపాచార్యుడు అశ్వత్థామకు నీతి విశేషము లెరింగించుట

అశ్వత్థామా ! నీకు చెప్పవలసిన విషయమంతియు జెప్పి చేయదగినదానిని అడిగితివేని నాకు తోచినదానిని చెప్పెదనువినుము. సకల కర్మములకును ఫలవిషయమై పురుష ప్రయత్న దైవములు రెండును సాధనములగును. ఆ రెంటిలో ఒకటివుండి మరియొకటి లేనియెడల కర్మఫల సిద్ధి కలుగజాలదు. అది యెట్లనగా జెప్పెద వినుము. చక్కగా వర్షము కురిసినను మన్నవి చవిటిభూమి యందు ధాన్యముఫలింపదు. తగినట్లు మంచి భూమినిదున్ని విత్తనములు చల్లినను వర్షముకురియని యెడల ధాన్యములు ఫలింపజాలవు. సేద్యపు కాపులు చక్కగా భూమిదున్ని విత్తనములు చల్లినను తగిన వర్షము కురిసినయెడల ఆ భూమి ఫలించును. ఆ ప్రకారమే సకల కర్మలను చేయునప్పుడు పురుషప్రయత్నమునకు దైవము సహాయ మున్నయెడల కర్మఫలసిద్ధి కలుగును. అదిగాక మరియొక విశేష మును చెప్పెదను వినుము.

అశ్వత్థామా ! తగిన కార్యములను జేయుటకు ప్రయత్నించుచు ధర్మవేత్తలగు పెద్దలకు సమ్మతముగా కార్యములను చేసిన యెడల అట్టివానికి దైవసహాయము కలుగును. ధర్మమార్గమును తప్పక న్యాయముగా ప్రవర్తించుచు కర్మములను చేసినయెడల ఫల సిద్ధి కలుగును. అందువలన నిర్మలమైన కీర్తికలుగును. ఆ కర్మములు ఫలింపక పోయినను కీర్తి చెడదు. నిందయు కలుగజాలదు. గనుక పురుషుడగువాడు యేవిధముచేతనైనను కష్టపడి ధర్మము తప్పక న్యాయముగా ప్రవర్తించుచు కార్యములను చేయవలయును. అశ్వ

త్థామా ! అధర్మముగా కోపముచేత కార్యములను చేసి సంతోషముగా ఫలసిద్ధిని పొందినను అందువలన భయము జుగుప్సయు కలుగ గలవు. అట్టి అన్యాయ కర్మములను చేసినవారిని, జనులందరును నిందింతురు. అధర్మకార్యములు ఫలింపనియెడల అప్పుడేఅనేక ఆపదలు కలుగగలవు. క్రోధలోభ భయములు గలవాడై దుర్మార్గుడై పెద్దలుచెప్పినను వినక చెడుకార్యములను చేయకమానడు. ఆ చెడుకార్యములను చేయుటవలన వానికి బాధలుకలుగక మానవు. ఆ చెడుకార్యములను చేయుటవలన వానిలక్ష్మి నశింపక మానదు. ఆ దుర్మార్గునకు గొప్ప ఆపదవలన మిక్కిలి దుఃఖము కలుగక మానదు. అట్టి దుర్మార్గుడు శాశ్వత దుఃఖమును పొందును. అశ్వత్థామా ! నేను చెప్పుమాటలను వినుము. దుర్యోధనుడు మిక్కిలి అవివేకియై అధికక్రోధ లోభములను కలిగి దురహంకారములచేత ఎంతమంది చెప్పినను వినలేదు. దుర్యోధనుడు నిందకు సహించి పుణ్యాత్ములగు పాండవులను అనేకవిధములుగా అవమానించెను. అట్టి దుర్మార్గుడగు దుర్యోధనునకు చేటుతప్పదుగదా ! అని కృపాచార్యుడు అశ్వత్థామతో చెప్పెను. అశ్వత్థామా ! నీ మనస్సుకలత చెందియుండ లేదుకదా యనియు నీ మనోదుఃఖమునకు ఏమిచేయవలెనో యనియు మమ్ము నీవడిగితివి. అందుకు చెప్పెదను వినుము. దుర్యోధనుడు లోకప్రసిద్ధమైన దుర్మార్గుడు. అతడు పోయిన చెడ్డ మార్గమందే నీవును ప్రవర్తించి పాండవులతో మిక్కిలి విరోధమును కలిగింపకుము. పాండవులకు అపాయము కలిగింపదలచి దుర్యోధనుని వలె ప్రవర్తించితివేని నీవులోకమందు నిందింపబడి చేటును పొందుదువని నా మనస్సు కలత జెందుచున్నది. ఆ విషయము నట్లుండనిమ్ము. మనమిట్లు చేయవలెనని నిశ్చయించుటకు సమర్థులముకాము. కావున కర్తవ్యమును చెప్పెదను వినుము.

మనము ముగ్గురము యిప్పుడు ధృతరాష్ట్రుని దగ్గరకుపోయి ధృతరాష్ట్రుడు చెప్పిన ప్రకారము ప్రవర్తింతము. ధృతరాష్ట్రుడు చెప్పిన ప్రకారము మనము చేయవలయును. ధృతరాష్ట్ర గాంధారు లిద్దరును చెప్పినట్లు చేయుదము. అట్లు ప్రవర్తించెదమేని మనకు కీర్తి కలుగును. వారిరువురి దగ్గర విదురుడుకూడ కలడు. వారుముగ్గురును యోచించి చెప్పినట్లు మనము ప్రవర్తించినయెడల మనకు నిందకలుగనే కలుగదు. ఎట్లున్నను దైవమునకు యిష్టములేని చెడుకార్యములు సిద్ధిని పొందజాలవు. గనుక మిడిసిపడ కూడదు. చేయదగిన కార్యము నెమ్మదిగా యోచించుకొని ధృతరాష్ట్రుని యిష్టప్రకారము ప్రవర్తింతము. అని కృపాచార్యుడు అశ్వత్థామతో చెప్పెను. ఆమాటలను అశ్వత్థామవిని విచారముచేత దహింపబడిన మనస్సు కలవాడై కృపాచార్య కృతవర్మలను చూచి యిట్లనెను.

## అశ్వత్థామ, కృపాచార్య, కృతవర్మలతో దనపూనిక స్థిరీకరించుట

కృపాచార్య కృతవర్మలారా! లోకమందు ప్రతిమనుష్యుడును యిది మంచిమార్గమనియు, యిది చెడుమార్గమనియు తెలిసికొని తాను ఎరిగిన మార్గమునుబట్టి తనకార్యమును చేయబూనును. ప్రతిమనుష్యుడును యితరులు చెప్పు నేర్పుమాటలను వినుటకు సమ్మతింపరు. తనబుద్ధియే మంచిదని తలచును. ఇతరుల చిత్తవృత్తులను నిందింతురు. నానావిధములుగా ప్రవర్తించు తనచిత్తమును విచారింపడు. బాల్యమందు తానుచేసిన పనులు మంచివిగావని తలచును. యౌవనదశయందు మరికొన్ని తలంపులను తలచుచు అందుకు తగినట్లు ప్రవర్తించుచుండును. ముసలితనము వచ్చినప్పుడు యౌవనదశయందుగల తలంపులనువిడిచి యితర సంకల్పములచేత ప్రవర్తించు

చుండును. అదిగాక ఆపదకలిగి నప్పుడు ఒకానొక కార్యము మంచి దని తలచి ఆకార్యమును చేయును. ఆకార్యము వలన తనకు ఐశ్వర్యము లభించినయెడల మరియొక విధముగా ప్రవర్తించును. అదియే పరిశుద్ధ మార్గమని తలచుచుండును. మనుష్యుడు మరణాది కార్యములయందు తెంపుచేసినప్పుడు దృఢనిశ్చయము గలవాడై తన తెంపుయే పరమహితమని తలచి పనిచేయును. ఆ తెంపును వదలక యితరులు మాటలను వినక తానుచేయదలచిన మరణాది కార్యములను తప్పక చేయును. అని అశ్వత్థామ కృపాచార్య కృతవర్మలతో చెప్పి మరల కృపాచార్యునితో యిట్లనెను.

మామా! కృపాచార్యా! నీవు ఎరుగని విషయములేదు. నాకుతోచిన కార్యమును చెప్పెదను వినుము. ఆకార్యమును చేసిన యెడల మనకందరికి దుఃఖము నివర్తించును. బ్రహ్మదేవుడు ప్రజలను సృష్టించినప్పుడు బ్రాహ్మణునకు తపస్సును, రాజునకు తేజస్సును, వైశ్యునకు ధనసమృద్ధియు, శూద్రులకు, పైమూడు జాతులకు అనుకూలముగా నుండుటయు యీ గుణములను ఏర్పరచెను. గనుక శాంతగుణములేని బ్రాహ్మణుడును, తేజస్సులేని రాజును, ధన సమృద్ధి రూపమైన సమర్థత్వములేని వైశ్యుడును మూడువర్ణములవారికి అనుకూలుడుగాని శూద్రుడును నిందింపబడుదురు. ఆవిషయమటుండనిమ్ము. నేను బ్రాహ్మణకులమందు జనులచేత పూజింపబడు గొప్పవంశమందు పుట్టితిని. నా దౌర్భాగ్యమువలన అట్లు పుట్టియు కూడ రాజధర్మమైన యుద్ధకార్యమును చేయుచుంటిని. మధ్యకాలమందు యిప్పుడు యీరాజ ధర్మమైనయుద్ధమును చాలించి బ్రాహ్మణధర్మము గొప్పదనితలచి ఆ బ్రాహ్మణధర్మమైన తపస్సు చేయుట నాబుద్ధికి మంచిదిగా కనబడలేదు. అదిగాక గొప్పధనస్సును ధరించి అనేకమైన దివ్యాస్త్రములను ఎరిగి సమర్థుడనై యుండి యుద్ధమందు

నాతండ్రియైన ద్రోణుని నీచుడైన ధృష్టద్యుమ్నుడు చంపెను. ఆధృష్ట ద్యుమ్నుడు బ్రతికియుండగా నేను తలయెత్తి జనులను చూచుచు ప్రవర్తింపజాలను. గనుక ధృష్టద్యుమ్నుడు మొదలగు శత్రువుల నందరిని నా తీక్ష్ణ బాణముల చేత యీదినమందే చంపివేసెదను. నామనస్సు నందుగల దుఃఖపరితాపమును నేను సహింపజాలను. ఆశత్రువుల నందరిని చంపుటకు ఒక ఉపాయమును వెదకితిని. ఆవుపాయమును చెప్పెదను వినుము. అని అశ్వత్థామ కృపాచార్యునితో చెప్పి మరల కృపాచార్య కృతవర్మలతో యిట్లనెను.

కృపాచార్య కృతవర్మలారా! యీదినమందు యికశత్రువులు లేరనియు. పగలేదనియు తలంచి మనశత్రువులగు ధృష్టద్యుమ్న పాండవులు మొదలగు వారందరును సుఖముగా ఒళ్లుమరచినిద్రింపు చుందురు. వారందరు ధనస్సు మొదలగు యుద్ధసాధనములయందువాహనములయందు ఆదరణలేక యీరాత్రియందు ఆదమరచి నిద్రింపుచుండిరి. ఆ నిద్రకాలమందు ధృష్టద్యుమ్న పాండవాది శత్రువులను చంపుటకు మంచి సమయము. మనము ఓడిపోయి శ్రమజెంది గట్టుల యందును చెట్లక్రిందను వొదిగి యున్నట్లుగా తలచుచు శత్రువులు వొళ్లుమరచి నిద్రింపుచుందురు. నాసంకల్పము నిస్సంశయముగా ఫలింపగలదు. గొప్పసంతోషము మనకు కలుగగలదు. కృపాచార్య కృతవర్మలారా ! శత్రువులు మదించి నేమరి నిద్రపోవుచుందురు. నేను భయంకరముగ వెడలి క్రూరముగా శత్రువులను ఆక్రమించెదను. మరియు నా క్రూర బాణములచేత వారిని చంపెదను. మరికొందరి శత్రువులను నాపాదములచేతత్రొక్కి చంపివేసెదను. పరిఘాయుధముచేత శత్రువుల కంఠములను నరికెదను. కత్తిచేత మరికొందరిని నరికి పాండవ శిబిరమును రక్తమయము జేసెదను. శత్రువులు తమకు విజయము కలిగినందుకు పరమసంతోషముగలవారై గాఢనిద్రను

పొంది పీనుగులవలె పండుకొని నిద్రింపుచుందురు. ఆమొనగాండ్ర నందరిని నేనుచంపి పాండవశిబిరమును పీనుగు పెంటలగునట్లు చేసెదను. భూతభేతాళములు పాండవశిబిరమందు రక్తమాంసములలో నోలలాడునట్లు చేసెదను. పాండవశిబిరమందుండు ఏనుగులను. గుర్రములను రథికజనులనుచంపి, పీనుగులుగా చేసెదను. రథికులను నరికివేసి ధృష్టద్యుమ్నుని చంపి పీనుగుయగునట్లు చేసెదను. ఇట్లు చేసిన యెడల నా మనస్సునందు గల అవమానదుఃఖపరితాపములు నశించును. అట్లు చేయని యెడల నశింపజాలవు. ఈ రాత్రియందు నేను పాండవశిబిరములలో ప్రవేశించి ధృష్టద్యుమ్నుని మొట్టమొదట ఆక్రమించెదను. వాని మదగర్వములను అణగించెదను. గొప్ప బాణములచేత ధృష్టద్యుమ్నుని చంపక పశువును చంపినట్లుగా ధృష్టద్యుమ్నుని చంపెదను. ఇట్లుచేసితి నేని నాకు మిక్కిలి సంతోషము కలుగును. ఇదియే నా యిష్టము. ధృష్టద్యుమ్నుని చంపిన పిమ్మట ధర్మరాజాది పాండవులకు క్రూరముగా కష్ట మరణములను కలిగించి చంపివేసెదను. నేను కోపించుకొని రుద్రునివలె పాండవ శిబిరములోనికి ప్రవేశించి శత్రువులనందఱను. చంపివేసెను. శత్రువుల నందరినిచంపి నా తండ్రియగు ద్రోణుని ఋణముదీర్చుకొని పరిశుద్ధుడ నయ్యెను. ఈ రాత్రియందు నిద్రింపుచుండు పాండవులను పాంచాలురను, నాభుజముబలమువలన చంపివేసి కృతార్థుడనై ప్రకాశించు చుండెదను. ఇట్లు చేయుట మానిన యెడల వేరొకవిధముగా శత్రువులను చంపజాలను. అని అశ్వత్థామ కృపాచార్య కృతవర్మలతో చెప్పెను. ఆ మాటలనువిని కృపాచార్యుడు అశ్వత్థామతో యిట్లనెను.

అశ్వత్థామా! మనలను గెలిచిన శత్రువులను మరల మనము గెలుచుట మంచికార్యమేగదా! దైవయోగమువలన శత్రువులను

గెలువవలెనను ప్రయత్నము నీ మనస్సున కలిగెను. నీవు శత్రువు లను గెలువవలెనను నీపూనిక మాకు సమ్మతమే. మేమును నీవెంటనే వచ్చి నీకు సహాయులమై శత్రువులను గెలిచెదము. నీవు డస్సి యున్నావు. నీకు నిద్రలేక యున్నది. తొందరపడకుము. మనము నిద్రించి శ్రమదీర్చుకొని తెల్లవారినపిమ్మట మిక్కిలి భయంకర మగునట్లు శత్రువులమీఁదికి వెళ్ళుదము. మేమిద్దరము నీకు సహా యులమైన యెడల నీశత్రువులను నీవు గెలువగలవు. నీవు శ్రేష్ఠము లైన దివ్యాస్త్రములను యెరిగినవాడవు. మహాభుజబల పరాక్రమ వంతుడవు. నేను కృతవర్మ్మడును నీకు సహాయులమైవచ్చి మాబల పరాక్రమములను. చూపెదము మనము ముగ్గురము తెంపుచేసి యుద్ధమునకు వెళ్ళినప్పుడు దేవతలనైనను గెలువగలము. పాండవ పాంచాలురగు మనుష్యులు మనకు యెంతమాత్రపువారు కాగలరు? ఆ మనుష్యులను మన మవలీలగా గెలువగలము. అని కృపాచార్యుడు అశ్వత్థామతో చెప్పెను.

ద్రోణపుత్రా! అశ్వత్థామా! దివ్యాస్త్రములను యెరిగిన వాడవు. మహాబలపరాక్రమ శౌర్యవంతుడవు. నేను యుద్ధముచేయు పద్ధతిని నీవు యెరిగియున్నావు. నన్ను నేను మెంచుకొనరాదు. నా శక్తి యంతయు నీవు యెరిగియున్నావు. నీవు ద్రోణునితో సమాను డవు. మనము ముగ్గురము శత్రువులను యెదిరించిన యెడల ఆ శత్రువులను యేమిచేయ వచ్చునో అట్లు చేయవచ్చును. గనుక యెక్కుపెట్టిన ధనుస్సును క్రిందనుంచి కవచమునువిప్పి నిద్రిం పుము. మేమును నిద్రవచ్చుటచేత మంచిబుద్ధిగలగియున్నాము. తెల్ల వారిన పిమ్మట మన ముగ్గురికిని మనస్సు తెలివిగలిగియుండును. అప్పుడు మనముగ్గురము వెళ్ళి మన శత్రువులనందరిని యెదిరించి చంపుదము. తెల్లవారిన పిమ్మట మనమువెళ్ళి పాండవ సహితముగా

పాంచాలుర నందరిని చంపుదము. లేనియెడల వారిచేత మనము వ్యర్థముగా మరలిరావద్దు. అని కృపాచార్యుడు అశ్వత్థామతో చెప్పెను. ఆ మాటలను అశ్వత్థామ విని కృపాచార్యునితో యిట్లనెను.

మామా! కృపాచార్యా! కోపము గలిగియున్నవానికి ధనమును గురించి చింతించు వానికిని, రోగపీడితునికిని, కామము గలవానికిని, నిద్రపట్టదు. ఇది నీ వెరిగియుండియు, మాటలచేత నన్ను బాధింపుచున్నావు. ఈ పైన వివరించిన నాల్గు విధములలో వేరొక్కటి యున్నను నిద్రరాదని లోకప్రసిద్ధము. ఆ నాల్గువిధముల బాధలును నామనస్సును పట్టియున్నవి. అందువలన నాకు నిద్ర పూర్తిగా రానేరదు. నామనస్సునందుగల నాలుగు బాధలను చెప్పెదను వినుము నా తండ్రియగు ద్రోణుని విషయమై దుఃఖమును పొంది పరితపించుచున్నాను. నా శత్రువగు ధృష్టద్యుమ్నుని విషయమై మిక్కిలి రోషావేశములను కలిగియున్నాను. పాండవులుచేసిన అధర్మ యుద్ధమును, నేనుచేయబోవు యుద్ధమును గురించి చింతాక్రాంతుడనై యున్నాను. దుర్యోధనునకు ప్రీతిని కలిగింప గోరి చింతా మగ్నుడనై యున్నాను. ఈ నాలుగు విధములగు మనోబాధలును నాకు కలిగియున్నవి. అందువలన నాకు నిద్రపట్టలేదు. మహాత్ముడైన ద్రోణాచార్యుడు ధృష్టద్యుమ్నునిచేత నరుకబడు చుండగా నీవు కండ్లారా చూచితివి. ఆ ద్రోణునకు కలిగిన అవమాన మట్లుండెను.

దుర్యోధన మహారాజు తొడలువిరిగి క్రిందపడియుండి దైన్యము చేత చెప్పినమాటలను నీవు చెవులారా వింటివి. ఆ మాటలను నేను విని ఈ రాత్రియందు నేను నిద్రింపను. నిద్రపొమ్మని నీ వెందుకు

చెప్పితివో తెలియలేదు. మనము వినుచుండగా దుర్యోధన మహా రాజు దుఃఖించి యేడ్చుటకు క్రూరచిత్తుడైనను దుఃఖింపకమానడు. దుర్యోధనుని దురవస్థనుచూచిన యెడల కఠిన చిత్తునకైనను కరుణ కలుగక మానదు. కన్నీరు కారుటమానదు. దుర్యోధనుడు నాకు మిక్కిలి స్నేహితుడు అయ్యో! అ దుర్యోధనుని చూడగా నా మనస్సు దుఃఖాగ్నిచేత అవమానింపబడెను. దుర్యోధనుని అవ మానమును నేను చూచితిని. అంతకుముందు జనులందరును దుర్యో ధనునకు కలిగిన చేటును, పాండవులకు కలిగిన ఆధిక్యతను చెప్పు కొనుచుండగా వింటిని. ఆ మాటలన్నియు నా మనస్సును బాధింపు చున్నవి. నాకునిద్రరానేరదు. కృష్ణార్జును లిద్దరును పాండవ శిబిరము నకు కావలియున్న యెడల వారినిగెలుచుటకు యెవ్వరికిని సాధ్యము గాదు. ఏవిధముచేతనైనను శత్రువులనుచంపుట పౌరుష లక్షణము. ఈ రాత్రియందు పోయితినేని నేను నొచ్చకుండా నిద్రించు శత్రువుల నందరిని చంపి గెలువగలను. ఇట్టినిశ్చయము గలవాడనై అధికమైన ఉత్సాహము గలిగియున్నాను. ఇట్టి ఉత్సాహము గల నన్ను నీవు మాన్పరాదు. దుర్యోధన మహారాజు యిదివరకు మనలను పోషించి గౌరవించెను. ఆ వుపకారమును మరచి మనము వూరకుండరాదు. కనుక అందరు నిద్రించునపుడు నేనువెళ్ళి చతురంగ బలములతో కూడిన పాండవులను పాంచాలురను చంపివేసెదను. అట్లు శత్రువుల నందరిని చంపినపిమ్మట నేను విశ్రమించి నిద్రించెదను. వెనుక నేను సుఖించెదను. నీవు నిద్రపేరుచెప్పి నా ప్రయత్నమును మాన్పుటకు చూచుచున్నావు. ఇట్లుచేయుట నీకు తగదు. అని యిట్లు అశ్వత్థామ కృపాచార్యునితో చెప్పెను. ఆ మాటలను కృపాచార్యుడు విని అశ్వత్థామతో యిట్లనెను.

## కృపాచార్యుడు నిద్రాసక్తుల జంపదగదని అశ్వత్థామకు హి త వు చె ప్పు ట

అశ్వత్థామా! కోపము కలవాడు కార్యతంత్రముల నెరుగడు. ఇతరులుచెప్పినను వినడు. గొప్పబుద్ధి గలవానికైనను, స్నేహితులు బంధువులు కార్యతంత్రములను బోధింపవలయును. మహాబుద్ధిగల వారికైనను, నిర్మలమైన కార్యతంత్రము స్థిరముగా బుద్ధియందు నిలిచి యుండదు. సర్వదా ధర్మమార్గమునందు బుద్ధినిలిపి విహితులు చెప్పు హితప్రకారము కార్య తంత్రములను నడుపుచు ఆగ్రహామును విడిచి యింద్రియములను, జయించిన వాడికి శుభముకలుగును.విహితులగు వారు తమవశమందుండు వారిని చెడుమార్గములయందు పోనివ్వక తొలగింతురు. కొందరు పుణ్యము లేనివారు విహితులు చెప్పు మాటలను విని చెడుమార్గమునుండి తొలగుదురు. భాగ్యము లేని వాడు చెడు మార్గమును విడునజాలడు. విహితులు చెప్పుమాటలను విననివారికి యిహపరలోకములయందు సుఖముకలుగదు. బుద్ధిమంతులగు వారికి కార్యతంత్రములను విహితులు తెలుపుదురు. బుద్ధిహీనులకు కార్యతంత్రములు ఎంతదూరము బోధించినను తెలియవు. అట్టి బుద్ధిహీనులు విహితులమాటలు వినక చెడుమార్గమందు ప్రవర్తించి తుదకు చెడిపోవుదురు.

అశ్వత్థామా! నామాటలను విని నీవు ఆగ్రహామును విడువుము. మీ మనస్సునకు శాంతమును కలిగించుము. మాత్సర్యక్రోధ కౄరగుణములను విడువుము. అట్లు విడిచినయెడల పశ్చాత్తాపము వలన దుఃఖమును పొందవు. నిద్రించెడి వానిని, ఆయుధములను విడిచిన వారిని, వాహనవైకల్యము పొందినవారిని, శరణు చొచ్చిన వారిని చంపుట ధర్మముకాదు. సకలసైన్యములును, పాండవులును,

పాంచాలురను యీ రాత్రియందు నిద్రింపుచుందురు. నిద్ర చావు వంటిదే. పీనుగులవలెపడి నిద్రించుచుండు వారిని కొట్టి చంపి పాపము మూటగట్టుకొని నరకమందు పడుట మంచిదికాదు. మహాస్త్రవేత్త లలో నీవు శ్రేష్ఠుడవని కీర్తిపొంది యున్నావు. ఇదివరకు నీవు కొంచె మైనను పాపమును చేయలేదు. నీయంతవాడు పాపకర్మమును చేయ రాదు. ఇట్లు చేసితివేని మడి వస్త్రమునందు మసితాకిన చందమ గును. సూర్యునితో సమానమైన తేజోవంతుడవై యున్నావు. సూర్యోదయమైన పిమ్మట నీవు వెళ్ళి పాండవ పాంచాలురతో యుద్ధముచేసి నీ ప్రతాపము చూపుము. అని కృపాచార్యుడు అశ్వత్థా మతో చెప్పెను. ఆ మాటలను అశ్వత్థామ విని కృపాచార్యునితో యిట్లనెను.

కృపాచార్యా! నీవు చెప్పినదంతయు నిశ్చయమగును. నన్ను శిక్షించుటకు తగినవాడవై హితమార్గమును నాకు తెలిపితివి. నీకు నేను స్పష్టముగా జెప్పెదవినుము. సకల రాజులును జూచుచుండగా బాణములను విడచిన నాతండ్రియగు ద్రోణుని తలపట్టుకొని ధృష్ట ద్యుమ్నుడు చంపెను. అది పాపమని తలచక ధృష్టద్యుమ్నుడు ద్రోణుని అవమానించి చంపెను. శిఖండిని నెపము చేసికొని అర్జు నుడు బాణములువేసి బాణమువేయని భీష్ముని పడగొట్టెను. రథము భూమిలోనికి క్రుంగినప్పుడు రథమును కర్ణుడు యెత్తుచుండగా కర్ణుని మీద బాణములువేసి ఆకర్ణుని అర్జునుడు చంపెను. అర్జునుడు భూరి శ్రవుని చేతిని నరికివేయగా ఆతడు ప్రాయోపవేశము జేయవలెనని సమాధినిష్ఠుడై యుండెను. అట్టి భూరిశ్రవుని ఆగ్రహముచేత సాత్యకి చంపివేసెను. అనేకులు దుర్యోధనుని చుట్టు ముట్టుకొని దుర్యో ధనుని మీదికి భీముని పంపించి గదాయుద్ధమును చేసిరి. కొంచె మైనను పాపమునకు శంకింపక గదచేత దుర్యోధనుని తొడలను

నుగ్గు నుగ్గుగా గొట్టిరి. ఇట్లు పాండవులు ధర్మమార్గమును చెరచి యుద్ధమునుచేసిరి. ఆ పాండవులను నిందింపకుండుటకు కారణమేమి ? మమ్ములను నివారింపు చున్నావు. నేను చెప్పుమాటలను వినుము. తొడలు విరిగి పడియున్న దుర్యోధనుడు నన్నుజూచి దీనుడై కొన్ని మాటలను చెప్పెను. ఆ మాటలు నా మనస్సునందు ప్రవేశించి నాకు కోపముకలిగించుచున్నవి. ఆకోపమును నేను పోగొట్టుకొనవలయును. నాతండ్రియగు ద్రోణుని చంపిన ధృష్టద్యుమ్నుడు మొదలగు పాపాత్ములను పాపమార్గములద్వారా యీ రాత్రియందు చంపివేసెదను. ఇట్లు పాండవ పాంచాలురను చంపుటవలన నాకు పురుగు మొదలగు నీచజన్మములు కలిగినను మేలేయగును. ఈ పూనికను మానను. నన్ను నివారించుటకు యెవ్వరికిని సాధ్యముగాడు. అని అశ్వత్థామ కృపాచార్యునితో చెప్పుచు దిగ్గనలేచి రథమెక్కెను. రథమెక్కిన అశ్వత్థామనుజూచి కృపాచార్య కృతవర్మ లిద్దరును అశ్వత్థామతో యిట్లనిరి

అశ్వత్థామా ! మనము ముగ్గురము ఒక్క నిశ్చయము గల వారమై యిక్కడికివచ్చితిమి. మనము ముగ్గురము దుర్యోధనుని కొరకు యిక్కడికి వచ్చియుండగా మాయిద్దరిని యిక్కడవిడిచి నీవు వొక్కడవే వెళ్ళరాదు. అని యిట్లు కృపాచార్య కృతవర్మలు చెప్పగా వారితో మరల అశ్వత్థామ యిట్లనెను. కృపాచార్య కృతవర్మలారా ! నే నిప్పుడు అవశ్యముగా వెళ్ళి దుర్గతిని పొందునట్లుగా ధృష్టద్యుమ్నుని చంపెదను. మీరును శౌర్య ధైర్యములచేత నావెంబడివచ్చిన యెడల నేను సకలవిధములచేతను పాండవ పాంచాలాదులను చంపి ప్రకాశించెదను. కనుక మీరు యితర తలంపులను విడువుడు. అని అశ్వత్థామ కృపాచార్య కృతవర్మలతో చెప్పుచు రథము తోలించుకొని వెళ్ళెను. కృపాచార్య కృతవర్మలును తమ రథముల

మీద నెక్కి అశ్వత్థామతో కలిసికొని వెళ్ళిరి. కృపాచార్య కృత వర్మ అశ్వత్థామలు ముగ్గురును, అగ్నిత్రయమువలె ప్రకాశించు చుండిరి. వారు పాండవ శిబిరమునకు సమీపముగావెళ్ళిరి. పాండవ శిబిరములోనుండు జనులును, రథికులును, గుఱ్ఱములును, యేనుగు లును, అందరును గాఢనిద్రను పొందియుండిరి. అని సంజయుడు ధృత రాష్ట్రునితో యిట్లనెను. సంజయా! శత్రువులు దుర్యోధన రాజును గెలిచి అధికమైన విజయ తేజస్సులచేత ప్రకాశించుచు తమ శిబిర మందుండిరి. అట్టిశిబిరమును ఆక్రమించుటకు కృపాచార్యాదులు ముగ్గురును యేమిచేసిరో చెప్పుము. అని ధృతరాష్ట్రుడు అడుగగా సంజయు డిట్లనెను.

## అశ్వత్థామకు శివుడు భూతాకృతియై తోచుట

ధృతరాష్ట్రమహారాజా! అశ్వత్థామ కృపాచార్య కృత వర్మలు ముగ్గురును వెళ్ళి పాండవశిబిరముయొక్క ద్వారముదగ్గరకు పోయిరి. అప్పుడు అశ్వత్థామ కృపాచార్య కృతవర్మలకు ముందు మిగిలి అతిశీఘ్రముగా లోపలికి వెళ్లుటకు ప్రయత్నించెను. అప్పుడు శివుడు ఒక భూతరూపమును దాల్చి వచ్చి అశ్వత్థామయెదుట నిలి చెను. ఆ భూతము రక్తమయమయిన యెఱ్ఱని పులిచర్మమును వస్త్రముగా ధరించి యుండెను. ఆ భూతమునకు అనేక సర్పములు జందెములుగాను, హారములుగాను భుజకీర్తులుగాను యేర్పడి యుం డెను. ఆ భూతము పెద్ద నోరుకలిగి భయంకరములైన కోరలు గలిగి యుండెను. ఆ భూతమునకు అనేక సహస్రముల నేత్రములు గలవు. ఆ నేత్రములు విశేషమైన కాంతులు గలిగియుండెను. ఇట్లాభూతము మిక్కిలి క్రూరముగాను, సుందరముగాను, కాంతివంతముగాను, గొప్ప ఆకారము గలదిగాను, ఆశ్చర్యము కలిగింపుచుండెను. ఆ

భూతము యిటువంటిదని వాస్తవరూపమును నిశ్చయించి చెప్పుటకు దేవతలైనను సమర్థులుకారు. ఆ భూతముయొక్క ఆకారమును చూచినయెడల పర్వతమైనను పగిలిపోగలదు. ఇట్టి గొప్పభూతము అశ్వత్థామయెదుట పుట్టి నిలిచియుండెను. ఆ భూతముయొక్క పెద్ద నోటియందు ముక్కురంధ్రముల యందు చెవులయందు, కన్నుల యందు అవయవములయందు మంటలు లేచెను. ఆ మంటలు ఆకాశమందు వ్యాపించుచుండెను. ఆ భూతముయొక్క కాంతి విశేషములయందు శంఖచక్రగదాయుధములను ధరించిన అనేక విష్ణుస్వరూపులు బయలువెడలిరి. ఇట్లు ఆభూతము సకల ప్రాణులకును భయంకరముగా నుండెను. ఆ మహాభూతమును అశ్వత్థామచూచి కొంచెమైనను భయపడక భల్లములు మొదలగు అనేక క్రూరబాణ సమూహములను ఆభూతముమీద వేసెను. బడబాగ్ని సముద్ర జలములను త్రాగినట్లుగా భూతము తననోరుతెరచి అశ్వత్థామవేసిన బాణముల నన్నిటిని మ్రింగివేసెను. అట్లు గొప్పబాణము లన్నియు వ్యర్థములైనతోడనే అశ్వత్థామ గొప్ప శక్త్యాయుధమును ప్రయోగించెను. ఆ శక్త్యాయుధము ఆభూతమునుతాకి చిన్నచిన్న తునుకలుగా విరిగి పోయెను.

అట్లు తనశక్త్యాయుధము వ్యర్థమై పోయినందున అశ్వత్థామ దుఃఖించెను. అశ్వత్థామ అధికమైన ధైర్యముగలవాడై పుట్టలో నుండి క్రూరసర్పమును లాగినట్లు కత్తినితీసికొని గాఢముగాలాగి భూతముమీద వేసెను. ఆకత్తి ఆభూతమునుతాకి దూదిచందముగా వ్యర్థమాయెను. అశ్వత్థామ అనేక తోమరాయుధములను అనేక చక్రాయుధములను భూతముమీద ప్రయోగించెను. ఆమహాభూతము తిన్నగా నవ్వుచు ఆ తోమరాయుధ చక్రాయుధములను మ్రింగి వేసెను. అందుకు అశ్వత్థామ కోపించుకొని ఒక గొప్ప గదాయుధ

మును ఆ భూతముమీద వేసెను, జలజంతువు మాంసమును మ్రింగి నట్లుగ గదాయుధమును భూతము మ్రింగెను. ఇట్లు అశ్వత్థామ యొక్క సకల ఆయుధములును చెడిపోయెను. అశ్వత్థామ మిక్కిలి బుద్ధిగలవాడై దుఃఖించుచు యిటుటు చూచుచుండెను. అప్పుడనేక కృష్ణరూపము లా అశ్వత్థామకు ఆకాశమందు కనపడెను. భయంక రములైన అనేక విష్ణురూపములు ఆకాశమం దంతటను కనబడగా అశ్వత్థామ మిక్కిలి విచారముతో పరితపించుచు తనమనస్సులో యిట్లని తలచెను.

అయ్యో! దైవమా! కృపాచార్యుడు చెప్పిన సత్యములైన హితవాక్యములను దురహంకారముచేత వినకవచ్చితిని. ఇట్లువచ్చుట వలన నేను అధికుడనుగాను. ఎవ్వడైనను గొప్పశాస్త్రము మార్గమును విడిచి తనయిష్టప్రకారము ప్రవర్తించి శత్రువులను గెలువవలెనని తలచునో అట్టి వానిని తనఅధర్మమే ఏ విధముచేతనైనను చెరుప గలదు. ఇది నిజమగును. గోవును, బ్రాహ్మణుని బాలకుని, ముసలి వానిని, గ్రుడ్డివానిని, స్నేహితుని, సహోదరుని, జడబుద్ధి గలవానిని ప్రమత్తుని, మత్తుని, ఉన్మత్తుని, ఆచార్యుని, నిద్రించెడి వానిని. స్త్రీని, భయపడిన వానిని, వీరలను శస్త్రాస్త్రములచేత నొప్పింప రాదని పెద్దలు చెప్పుదురు. అటువంటి ధర్మమార్గమును నేను విడిచి అధర్మ మార్గమువలన శత్రువులను చంపబూనితిని. ఇట్టి అధర్మ మార్గమువలన నాకుచేటు కలుగునేకాని కార్యసిద్ధికాదు. ఇప్పుడు అధిక భయమునుబొంది వెనుకకు మరలిపోవుట కష్టమార్గమగును, ఇంక దైవముతోటి పోరాడరాదు. ఇకనేమి చేయవలయునో తెలి యుట లేదు. నేను చేయబూనిన అక్రమకార్యమువలన నాకు కీడు కలుగక మానదు. ద్రోణుని పుత్రుడనగు నేను భుజాబలములో నిం ధకు గురికాగాదు, ఈ భూత మహాత్మ్యమును జూచి నామనస్సు

ఆశ్చర్యమందు మునిగియున్నదేకాని, భూతముయొక్క క్రమము యెరుగకున్నది. ఈ మహాభూతము పుట్టుటకు మూలకారణమెద్దియో తెలియకున్నది. నేను పాపాత్ముఁడను. అందుచేత నాకు నీతిమార్గము తెలియజాలదు. అని యిట్లు అశ్వత్థామ అనేకవిధములుగా తనమనస్సులో దుఃఖించి, తల్లడిల్లుచున్న చిత్తమునకు మరల ధైర్యము తెచ్చుకొని యిట్లని తనమనస్సులో నిశ్చయించెను. పరమేశ్వరుడగు శివుడు భక్తుల ఆపదలను చీకట్లను పోగొట్టుటకు సూర్యునివంటివాడు. మహాదేవుడు పార్వతికి భర్త. పరమదయ గలవాడు. సకలలోకములను సృష్టించెడి, రక్షించెడి ప్రభువు. సకలలోకములను సంహరించువాడు. అట్టి శివుని దేవేంద్రుడు మొదలగు దేవతలందరు పూజింతురు. ఆపరమశివుని నేను అధికభక్తిచేత నామనస్సును ఏకాగ్రమగునట్లు చేసి ప్రార్థించెదను. శివుడు సకల దేవస్వరూపుడు. సకల దేవతల ఆపదలను శివుడు పోగొట్టుచుండును. ఇప్పుడే నేను పరమేశ్వరుడైన శివుని గొలిచి నాకీడును బోగొట్టుకొనెదను.

## అశ్వత్థామ శివునకు ఆత్మోపహారము యివ్వ నిశ్చయించుట.

అని యిట్లు ఆశ్వత్థామ తనమనస్సులో నిశ్చయించి, నియతుడై రథముమీదనుంచి క్రిందకిదిగి కూర్చుండెను. అట్లు కూర్చున్న అశ్వత్థామ తనమనస్సులో శివుని ధ్యానింపుచు యిట్లనితలచెను. పరమేశ్వరుడగు శివుడు భక్తులకు శుభములిచ్చువాడు. ఎప్పటికిని నాశము లేనివాడు. పరమేశ్వరుడు. త్రిపురములను సంహరించినవాడు. పుట్టుక లేనివాడు, మూడునేత్రములు గలవాడు. బహురూపుడు. విశ్వరూపముచేత వ్యాపకుడు. శూలఖట్వాంగములను ధరించినవాడు. జటామండలములచేత అలంకరింపబడిన శిరస్సుగలవాడు. అటువంటి మహా

త్ముడైన శివునకు నాప్రాణముల నర్పించెదను. అధికచింతలను విడిచె దను. నా ప్రాణములను శివునకు సమర్పించగా శివుడు నాకు యేగతి కలిగించినను, ఆగతి నాకు సుఖమేయగును. అని యిట్లు అశ్వత్థామ తన మనస్సులోతలచి తనయెదుటనున్న మహాభూతమువలన తన పరాక్రమము చెడిపోయెనని తలచి శివునుద్దేశించి యిట్లనెను. పర మేశ్వరా! రుద్రమూర్తీ! నాపరాక్రమమును యీమహాభూతముఅడ్డ గించి యున్నది. ఇదినాకు గొప్ప ఆపద. ఈ ఆపదను నేనుగడచిన యెడల అనేకప్రాణములనుచంపి, ఆప్రాణులమనస్సులచేత నీకుక్రొత్త పూజచేసెదను. అనేక ప్రాణులను నీకు సమర్పించి, నిన్నుసంతోష పరచి ప్రమథగణములచేత స్తుతింప బడెదను. అనియిట్లు అశ్వత్థామ శివునుద్దేశించి తనమనస్సులో పలికెను. అంత నాయశ్వత్థామ ముం దర బంగారు మయమైన అరుగుకనబడెను ఆయరుగునందు జాజ్వల్య మానముగా అగ్నిహోత్రము మండుచుండెను. ఆ యగ్నిహోత్రము నందు అశ్వత్థామ ప్రవేశింపదలచి తనమనస్సును శివునకు సమర్పిం చెదనని నిశ్చయించి అధికసంతోషమును బొందెను. ఆ సమయ మందు శివుని సేవించెడి అనేక ప్రమథగణములు అశ్వత్థామ యెదు టకువచ్చి నిలిచి యుండిరి. ప్రమథగణములలో కొందరు ప్రమథులు మిక్కిలి ప్రకాశరూపములైన ముఖములనుకలిగి యుండిరి. మరికొం దరు తేజోరూపములైన నేత్రములను గలిగియుండిరి. మరికొందరు ప్రమథులు ఏకపాదములను గలిగియుండిరి. మరికొందరు, ఏనుగుల వంటి ముఖములను, గుర్రములవంటి ముఖములను, సింహములవంటి ముఖములను, పందులవంటి ముఖములను గలిగి యుండిరి. కొందరు క్రూరములైన కోరలుగల నోరులు గలిగియుండిరి. కొందరు ప్రమ థులు అనేకవిధములైన నోరులచేత ప్రకాశింపుచుండిరి. మరికొం దరు వంకర దేహములను గలిగియుండిరి. మరికొందరు ప్రమథులు

పొట్టిశరీరములను గలిగియుండిరి. కొందరు స్థూలదేహములను గలిగియుండిరి. మరికొందరు శుష్కించిన దేహములను గలిగియుండిరి. కొందరు గోరోచనమువంటి కపిలవర్ణముగల దేహములను గలిగియుండిరి. మరికొందరు నల్లని దేహములను గలిగియుండిరి. మరియనేక ప్రమథులు నానావిధవర్ణములు గల దేహములను గలిగియుండిరి. కొందరు ప్రమథులు శిరస్సులయందు అయిదువిధములైన జుట్లులను గలిగియుండిరి. మరికొందరు జడలను ధరించి యుండిరి. మరి యనేక ప్రమథులు నానావిధ విశేష వికార స్వరూపములను గలిగియుండిరి. మరియనేక ప్రమథులు అనేకవిధములైన శిఖలచేత ప్రకాశించెడి శిరస్సులను గలిగియుండిరి. ఈ ప్రకారముగా వికార స్వరూపములుగల ప్రమథగణములు లెక్కకు అతిక్రమించి యుండిరి. ప్రమథగణములన్నియు, విచిత్రములైన వస్త్రములచేతను. ఎఱ్ఱని గంధములను పూసికొని యుండుటచేతను, రత్నమయములైనట్టియు, బంగారు మయములైనట్టియు. సర్పములచేతను, ఎముకల దండలచేతను, భూషణములచేతను అలంకరింపబడి ప్రకాశించుచుండిరి. ప్రమథులందరును, ధనస్సులనుధరించియుండిరి. అంబులపొదులు గలిగియుండిరి.కత్తులను,ముసలాయుధములను,ముద్గరాయుధములను, గండ్రగొడ్డండ్రను,భిండివాలములనెడి ఆయుధములను,శూలములు మొదలగు అనేకవిధ ఆయుధములను ధరించియుండిరి. ఆ ప్రమథగణములలో కొందరు మృదంగములను, పణవములను, డమరుకములను, ఘంటలను గోముఖము మొదలగు వాద్యములను మ్రోయించుచుండిరి. ప్రమథులందరును బిరుదుగల టెక్కెములును గలిగి ప్రకాశించుచుండిరి. వారందరును ఆడుచు, పాడుచు, సింహనాదములు చేయుచు, అరచుచు పొరలుచు, త్రుళ్ళిపడుచు గంతులు వేయుచుండిరి. ప్రమథగణములయొక్క అరపులు గుఱ్ఱముల సకిలింతల

వలెను, ఏనుగుల ఘీంకారముల వలెను, శంఖములను పూరించిన ధ్వనులవలెనుఁ భేరీధ్వనులవలెను, తోచుచుండెను.

ఆ ప్రమథులయొక్క కేకలు అనేక విధములుగా తోచుచు భయంకరములై యుండెను. బ్రహ్మద్వేషులగు జనులయొక్క రక్త మాంసములను తలపుర్రెలయం దుంచుకొని ప్రమథులు భయంకరముగా భక్షింపుచు త్రాగుచుండిరి ప్రమథగణములలో కొందరు శ్రేష్ఠులు సోమపానము జేయుచు మనోనిగ్రహ ఇంద్రియ నిగ్రహము లను గలిగి బ్రహ్మచర్య తపస్సులు మొదలగు శ్రేష్ఠకర్మములను గలిగి యుండిరి. అట్టి ప్రమథులను జూచి శివుడాశ్చర్యమును బొందు చుండిరి. ప్రమథగణములలో కొందరు మహానుభావులు అణిమాది అష్టైశ్వర్యములను బొందియు, ఆశ్చర్యములను పొందకుండిరి. అటు వంటి మహానుభావులు పార్వతీ పరమేశ్వరులను వినాయక కుమార స్వాములకంటె అధికప్రీతిని గలిగింపుచుండిరి. ఆ మహానుభావులగు ప్రమథులు దేవతలచేత స్తుతింపబడుచుందురు. ఈ ప్రకారముగా ప్రకాశించు ప్రమథులందరును అక్కడికివచ్చి అశ్వత్థామకు కనపడిరి. (అశ్వత్థామయొక్క తెంపును తెలుసుకొనుటకును, నిద్రించెడి జను లను అశ్వత్థామ యెట్లు చంపునో ఆ ఘోరతత్వమును జూచి వినో దించుటకును ప్రమథగణములు అక్కడికివచ్చిరని తెలియవలెను.) ఆ ప్రమథులందరును అశ్వత్థామయొక్క చిత్తమునకు బెదురు పుట్టిం చుటకై భయంకరాకారములను ధరించి వచ్చిరి అట్లు వచ్చిన ప్రమథగణముల నందరిని అశ్వత్థామజూచి ఆవగింజంత యైనను భయముబొందక వారినందరిని కలియజూచెను. అట్లు చూచి అశ్వ త్థామ చిరునవ్వుగలవాడై అధికమైన ధైర్యసాహసములచేత మిక్కి లిగా ప్రకాశించుచుండెను. ఆ ప్రమథులందరును అశ్వత్థామను పొగ

డిరి. అశ్వత్థామ తన రథమువిూద నుండు ధనుస్సు తెచ్చితనయెదుట నుండు అగ్నిలో ప్రవేశించుటకు ప్రయత్నించి ఒక్క ఆహుతిగా తన శరీరమును యివ్వదలచెను. అందుల కాయగ్నిహోత్రము కొంచెమై కనుపించెను.

అంతట అశ్వత్థామ తన రథమువిూదనుండు ధనుస్సమూహములును బాణసమూహములును తెచ్చి అగ్నిహోత్రములో వేసి అగ్నిని బలముచేసెను. అశ్వత్థామ మిక్కిలి సాహసముకలవాడై పరమేశ్వరుడగు శివునుద్దేశించి యిట్లనెను. పరమేశ్వరుడగు రుద్రుడా! నామనస్సుయొక్క పద్ధతియెటువంటిదో నాకు తెలియదు. నామనస్సును, నీకుసమర్పించెదను. నాశత్రువులను నేను చంపునట్లు వరమిమ్ము నాకు వారిని చంపుటకు తగిన బలమును శక్తినియిమ్ము అని అశ్వత్థామ శివునుద్దేశించి ప్రార్థించి మరల శివునితో యిట్లనెను.

పరమేశ్వరుడా! రుద్రమూర్తీ! నాయీదేహ మాంగిరస వంశమందు జనించినది. నీ యందుగల భక్తిచేత నాదేహమును అగ్నికి ఆహుతిచేసి నీకు సమర్పించెదను. నేను కృతార్థుడనయ్యెదను. అని అశ్వత్థామ శివునుద్దేశించి చెప్పుచు శివునిమనస్సునందు ధ్యానించుచు రెండుచేతులను పైకెత్తి సమాధిరూప చిత్తముగలవాడై అగ్నిలోనికి దూకెను. ఇట్లు బంగారు మయముగానుండు వేదికమిూదగల అగ్నిహోత్రములోని కశ్వత్థామ దూకగా అతనిచిత్తమునకు తెలివి తప్పలేదు. అశ్వత్థామయొక్క శరీరము కొంచమైనను కందలేదు. అగ్నిలో ప్రవేశించిన అశ్వత్థామ దేదీప్యమానముగా ప్రకాశించుచుండెను అట్టి ధైర్యముగల అశ్వత్థామకు శివుడు ప్రత్యక్షమాయెను.

## అశ్వత్థామకు శివుడు ప్రత్యక్షమై ఖడ్గమునిచ్చుట

ధృతరాష్ట్రమహారాజా! ఇట్లు భక్తవత్సలుడగు శివుడు దయ గలవాడై అశ్వత్థామకు ప్రత్యక్షమై యెదుట కనబడెను. అశ్వత్థామ అగ్నిలోనున్నను తామరసరస్సులోనుండు పురుషునివలె పరమ సంతోషము కలిగియుండెను. శివుడు నవ్వుచు తనదివ్య నేత్రముల చేత అశ్వత్థామను జూచుచు యిట్లనెను. అశ్వత్థామా! నీ విపుడు చేసిన సాహసకర్మమునకు నామనస్సు మిక్కిలి సంతోషించెను. నీకు వరమిచ్చుటకు యిక్కడకు వచ్చినాను. అని శివుడు చెప్పగా ఆమా టలకు అశ్వత్థామ పులకాంకురిత దేహుడై గాఢమైన ఆనందమన స్కుడాయెను. అశ్వత్థామ అరుగుమీాదనుంచి వెలుపలికివచ్చి శివుడు కౌగిలించిన, నమస్కరించెను. అంతట అశ్వత్థామ లేచి రెండుచేతులు శిరస్సున నుంచుకొని నిలిచి యుండెను. అశ్వత్థామయొక్క ముఖ మును శివుడును చూచుచు మృదువుగా యిట్లనెను.

అశ్వత్థామా! గొప్ప తపస్సత్యధైర్య శౌచములను కలిగి మిక్కిలి భక్తిచేత కృష్ణుడు నన్ను పూజింపుచుండును. అతడు నాకు అనురక్తుడై పరమస్నేహితుడగును. నే నా కృష్ణునకు అనురక్తుడనై పరమహితుడ నగుదును. ఆ కృష్ణుని మనస్సునకు సంతోషము కలి గించుటకై భూతరూపమును ధరించివచ్చి నీకు అడ్డపడితిని. పాండవుల మీాదకి నిన్ను పోనివ్వక నిన్ను అడ్డగించితిని. నీ చిత్తమును స్పష్ట ముగా పరిశీలింపదలచి అనేక మాయలచేత నీ శస్త్రాస్త్రముల నన్ని టిని, మింగి వేసితిని. ఇకను వేయిమాటలను చెప్పుటవలన ప్రయో జనములేదు. కృష్ణునకు సంతోషము కలిగించుటకై భూతాకారము పొందివచ్చి నీకు అడ్డపడితిని. అందుకు కృష్ణుడును సంతోషించును. పాంచాలురగు ధృష్టద్యుమ్నాదులకు ఆయుష్కాలము సమీపించి యున్నది. ఈ దినమందు నీవు నా అనుగ్రహామునుపొంది ధృష్టద్యు

మ్నాది పాంచాలుర నందరిని చంపగలవు. అని శివుడు అశ్వత్థామతో చెప్పి తనకత్తిని అశ్వత్థామ కిచ్చెను. కత్తిని యిచ్చుచు అశ్వత్థామకు తెలియకుండునట్లు తేజోరూపముగా ఆ శివుడు అశ్వత్థామ యొక్క దేహములో ప్రవేశించెను.

అశ్వత్థామ మిక్కిలి తేజస్సుచేత ప్రకాశించుచు పరమ సంతోషమును పొందెను. అదివరకు భూతము మ్రింగిన శస్త్రాస్త్రములును పిమ్మట అగ్నియందు వేసి మండించిన ఆయుధములును యెప్పటి వలె అశ్వత్థామయొక్క రథముమీద నుండెను. ప్రమథగణము లన్నియు శివునిగొలిచినట్లే అశ్వత్థామను గొలుచుచు అశ్వత్థామకు కనబడక అతనిచుట్టును నిలిచియుండిరి. అశ్వత్థామ తనరథము నెక్కి పాండవ శిబిరములోనికి వెళ్ళెను. అశ్వత్థామ వెంటనే కృపాచార్య కృతవర్మలును వెళ్ళిరి. అని సంజయుడు ధృతరాష్ట్రునితో చెప్పగా ధృతరాష్ట్రుడు సంజయునితో యిట్లనెను.

సంజయా! అశ్వత్థామ, మదగర్వముచేత పాండవశిబిరము లోనికి వెళ్ళునపుడు కృపాచార్య కృతవర్మ లిద్దరును భయపడి వెనుకకు పోలేదు గదా! అశ్వత్థామవలెనే, ధైర్యసాహసములను గలిగి, వారిద్దరును అశ్వత్థామ వెంబడి వెళ్ళిరిగదా! అట్లు వెళ్ళిన అశ్వత్థామ పాండవశిబిరములోనుండు ధృష్టద్యుమ్నాది పాంచాలురను తక్కిన రాజులును, ద్రౌపదీపుత్రులను, చంపెనో లేదో చెప్పుము. యుద్ధపద్ధతినంతయు, చక్కగా తెలుపుము. అనిని ధృతరాష్ట్రమహారాజా! ఇట్లు అశ్వత్థామ. అధికోత్సాహము గలవాడై పాండవ శిబిరములోనికి ప్రవేశించెను. అతని రెండుప్రక్కలయందు నిస్సంశయముగా కృపాచార్య కృతవర్మ లిద్దరును నడిచిరి. తన యిరుప్రక్కల యందుండి నడిచివచ్చెడి, కృపాచార్య కృతవర్మల నిద్దరిని చూచి అశ్వత్థామ సంతోషించి యిట్లనెను.

కృపాచార్య కృతవర్మలారా ! మీరును తెంపుగలిగి మీబల పరాక్రమములనుచూపి శత్రువులమీద దూకుటకు సిద్ధపడి యుండుడు. నేనొక్కడనే, పాండవ శిబిరములోనికి వెళ్ళి మీఅండవలన సకలశత్రువులను, చంపివేసెదను. అని యిట్లు అశ్వత్థామ కృపాచార్య కృతవర్మలతో చెప్పి వారిద్దరిని. వాకిటయందు నిలిపెను. అశ్వత్థామ పాండవశిబిరములోని ఫలానవాని గృహము ఫలాన స్థలమున నున్నదని జనులువలన విని యుండెను. ఆకారణమువలన ఆ శిబిరములోనుండు గృహములను తానే తెలిసికొని వెళ్ళదలచిన అశ్వత్థామ మొట్టమొదట ధృష్టద్యుమ్నుని గృహమునకు వెళ్ళెను. అశ్వత్థామ ధనుర్బాణ సహితముగానున్న తనరథముదిగి రుద్రునుద్దేశించి తనమనస్సులో యిట్లని తలంచెను.

పరమేశ్వరా! రుద్రమూర్తీ! అనేక ప్రాణుల మనస్సులను నీకు సమర్పించునట్లుగ నిష్టను పూనియున్నాను. అనేక ప్రాణులనుచంపి ఆ ప్రాణుల మనస్సులను నీకు సమర్పించి పూజించెదను. నాపూజను అనుగ్రహించుము. నాయందు అనుగ్రహము జూపుము. అని అశ్వత్థామ రుద్రుని ప్రార్థించుచు ధృష్టద్యుమ్నుని గృహములోనికి వెళ్ళెను. పాండవ శిబిరమందుండు జనులందరును. దినముయొక్క పగటికాలమందు జరిగిన యుద్ధముచేత శ్రమజెంది శత్రువులందరును నశించుటచేత గాఢనిద్రను పొందియుండిరి. ఆ సమయమందు అశ్వత్థామ తిన్నగా ధృష్టద్యుమ్నుని గృహములోనికి ప్రవేసించి ధృష్టద్యుమ్నుని వెదకెను. ఆ గృహమందు ఒకచోట ఒకగొప్ప పందిరియందుగల మెత్త పాన్పునందు ధృష్టద్యుమ్నుడు పండుకొని గాఢనిద్రను పొందియుండెను. ఆచప్పరమునకు తెరయును, మేలుకట్లును గలవు. అక్కడ అనేక దీపములుగలవు. అట్టి ధృష్టద్యుమ్నుని అశ్వత్థామచూచి మిక్కిలి కోపము సంతోషముకూడ పొందెను

అశ్వత్థామ తనకాలితోతన్ని ధృష్టద్యుమ్నుని నిద్రలేపెను. అప్పుడు ధృష్టద్యుమ్నుడు కండ్లుతెరచి అశ్వత్థామనుజూచి భయపడక యుద్ధముచేయుటకు ప్రయత్నించెను. ఆ ధృష్టద్యుమ్నుడు దిగ్గనిలేచి అశ్వత్థామయొక్క ఘనస్సునులాగి, అతనిని తలపట్టుకొని వంచెను. అశ్వత్థామ ఆధృష్టద్యుమ్నుని క్రిందపడవేసి తనమోకాళ్ళచేత ధృష్ట ద్యుమ్నుని ముఖముమీద పెద్దగా గ్రుద్దెను. ధృష్టద్యుమ్నుడు నిద్రా శ్రమచేత అవయవ బలములు లేనివాడై బుద్ధినేర్పులేనివాడై యుం డెను. అతనిని నొచ్చగొట్టి బుద్ధివశము లేనివానినిగా జేసెను. అట్లు అశ్వత్థామచేత ధృష్టద్యుమ్నుడు బుద్ధివశము దప్పినవాడై యింద్రియ జ్ఞానము లేకుండనుండెను. ధృష్టద్యుమ్నుడు అశ్వత్థామను జూచెను. వెంటనే అశ్వత్థామ తనధనుస్సుకు కట్టిన నారిని విప్పి ఆనారి ధృష్ట ద్యుమ్నుని కంఠమునకు వురిపోసెను. అశ్వత్థామ ధృష్టద్యుమ్నుని పశువును చంపినట్లు చంపుటకు ప్రయత్నించెను. అశ్వత్థామ రెండు కాళ్ళచేతను ధృష్టద్యుమ్నునియొక్క రొమ్ము మొనలను త్రొక్కి పట్టెను. ధృష్టద్యుమ్నుడు భయపడునట్లు అశ్వత్థామ తనగోళ్ళచేత ధృష్టద్యుమ్నుని దేహమును గీరెను. ధృష్టద్యుమ్నుడు కంఠధ్వని లేనివాడై మిక్కిలి ప్రయత్నముచేత కంఠధ్వని తెచ్చుకొని అశ్వత్థా మకు తెలియునట్లుగా యిట్లనెను.

ఓరీ! అశ్వత్థామా! ఆయుధముచేత నన్ను చంపివేయుము. ఆలస్యము చేయవద్దు. ఆయుధముచేత చంపినయెడల శీఘ్రముగా పుణ్యగతికి పోయెదను. శత్రువులకైనను పుణ్యగతిని కలిగించుట మంచిదే యగును. అని ధృష్టద్యుమ్నుడు అశ్వత్థామతో చెప్పెను. ఆమాటలను అశ్వత్థామవిని ధృష్టద్యుమ్నునిజూచి యిట్లనెను. ధృష్ట ద్యుమ్నా! నీవు నీగురువగు ద్రోణుని కుత్సితమార్గముగా చంపితివి. నీకు పుణ్యగతి కల్గుగదు. నేను ఆ ప్రకారమే నీకుదుర్మరణము కలి

గించెదను. అని అశ్వత్థామ ధృష్టద్యుమ్నునితో చెప్పుచు, ధృష్టద్యుమ్నుని అధికముగా నొప్పించెను. ఆ చప్పుడును, అక్కడుండుజనులు విని, మేలుకొని, చూచి భయపడి, ఒక పెనుభూతమని తలచి పొదిగి యుండిరి.

## అశ్వత్థామ నిద్రాపరవశుడగు ధృష్టద్యుమ్నుని జంపుట

అప్పుడు యేనుగును సింహము చంపినట్టు అశ్వత్థామ కాళ్ళచేతను చేతులచేతను పొడిచి ధృష్టద్యుమ్నుని చంపెను. అశ్వత్థామ బాధించు నప్పుడు ధృష్టద్యుమ్నుడు పెద్దధ్వని కలుగునట్లుగా యేడ్చుచు మూలుగుచు రోజుచు మాటిమాటికి పొర్లబడి, చొంగ నీరు క్రక్కుచు, ప్రాణములను విడచెను. ఇట్లు అశ్వత్థామ ధృష్టద్యుమ్నునకు అధిక కష్టపు మరణమును కలిగించి గొప్ప అవష్టంభముచేత విజృభించి సంతోషించుచు నవ్వుచు అదివరకు ధృష్టద్యుమ్నుని మెడకువురిపోసిన నారిని తీసి తన ధనస్సునకు సంధించెను. ఇట్లు అశ్వత్థామ యెప్పటివలె ధనుర్ధరుడై అక్కడనుండిలేచి నవ్వుముఖముగలవాడై తనరథము మీదకు పోయెను. అప్పుడశ్వత్థామ తన రథమునెక్కి సంతోషముతో ఆరాత్రియందే పాండవశిబిరమును నిశ్శేషముగా నశింపజేయదలచి వుత్సాహముతో వెళ్ళెను. అప్పుడతని రథము భయంకరముగా ధ్వనిచేయుచు నడచెను. ఆ ధ్వనికి అశ్వత్థామ సంతోషించెను. అశ్వత్థామ తాను రాక్షస భూత భేతాళములకు సంతసము కలిగింపవలెకని దేవతలకు కన్నుల పండువు కలుగజేయవలెనని తాను పొగడ్తల నందవలెనని తలచుచు వెళ్ళెను. ధృష్టద్యుమ్నుని గృహమును విడచి అశ్వత్థామ వెళ్ళినవెంటనే ధృష్టద్యుమ్నుని గృహరక్షక జనులును అతని స్త్రీలును పీనుగైయున్న ధృష్టద్యుమ్నునిజూచి మిక్కిలి దుఃఖముచేత యేడ్చిరి. ఆ కలకల

ధ్వనివలన ఆ ప్రక్కయిండ్లయందుగల రాజులు నిద్రను మేలుకొని ఆధ్వని యేమిటని యనుచుండిరి. అశ్వత్థామ రథముమీఁద యెక్కి శీఘ్రముగా వచ్చుచుండెను. అశ్వత్థామ రథమును ఆరాజులుచూచి వ్యాకులత జెంది యిట్లనిరి.

జనులారా! యీరథము మీఁదనుండు పాపాత్ముఁడు రాక్షసుడో మనుష్యుఁడో తెలియకున్నది. వీఁడెవడో వచ్చి ధృష్టద్యుమ్నుని చంపి వెళ్ళుచున్నాఁడు. ఈ నరాధముని పోనివ్వక యెదిరింపుడు అని ఆ చుట్టుప్రక్కల యిండ్లలో నుండు రాజులొకరికొకరు చెప్పుకొనిరి. ఆ మాటలను ఆరాజులువిని తలలెత్తిచూచి చుట్టుకొనుడనుచు పరిజన సమేతముగా నడచి అశ్వత్థామయొక్క రథమును చుట్టుకొనిరి. అశ్వత్థామ అతిభయంకరముగా ధనస్సును సవరించుకొని అనేక నారాచములను క్రూరబాణ సమూహములను భల్లాయుధ సమూహములను క్రూరముగా ప్రయోగించెను. ఆ క్రూరబాణములన్నియు పిడుగులగుంపులవలె తగులుటచేత రాజులందరును తమతమ బలసమేతముగా చచ్చిపడిరి.

అప్పుడశ్వత్థామ ఆటలాడిన చందముగా తన భుజాబలసామర్థ్యమువలన ఆ రాజులను వారి బలములను చంపెను. అతని భుజబలమునుచూచి భూతమని అశ్వత్థామను పొగడిరి. పిమ్మట అశ్వత్థామ వుత్తమోజుని గృహములోనికి బోయి కత్తి తీసుకుని ఆ వుత్తమోజుని పడకటెంటికి పోయెను. అశ్వత్థామ వానిని మేలుకొనునట్లుచేసి తలపట్టుకొని క్రిందపడగొట్టెను. ధృష్టద్యుమ్నుని చంపినట్లే వుత్తమోజునిగూడ పశు మరణముగా చంపివేసెను. అచ్చట సమీపమందు ఒకచప్పరములో యుధామన్యుడు నిద్రింపుచు వుత్తమోజుడు చచ్చుట యెరిగి వచ్చెను.

ఆయుధామన్యుడు అశ్వత్థామను రాక్షసునిగా తలచి భయ పడక పెద్దగదాయుధమును వేసెను. ఆగదదెబ్బ అశ్వత్థామకు తగిలి నను అశ్వత్థామ చలింపక వుత్తమోజుని వలెనే యుధామన్యునకు పశుమరణమును కలిగించెను. ఇట్లు ధృష్టద్యుమ్నుని తమ్ములగు వుత్తమోజ యుధామన్యు లిద్దరిని పశువులను చంపినట్లు అశ్వత్థామ చంపెనేగాని కత్తిచేత చంపలేదు. ధృతరాష్ట్రమహారాజా! అశ్వత్థామ యమధర్మరాజువలె ప్రకాశించుచు శివుడు యిచ్చినకత్తిని తీసికొని పాండవశిబిరములోని గృహములలో ప్రవేశించెను. అశ్వత్థామ చేతిలో నుండు కత్తి దేదీప్యమానముగా కాంతులచేత ప్రకాశించుచుండెను. అశ్వత్థామఅట్లు తిన్నగానడచుచు పాంచాలవంశస్థుల నందరిని నరికివేసెను. పాండవ శిబిరమంతయు రక్తమాంసమయమై యుండెను. రాక్షసుల గుంపులు చేరి ఆమాంసమును భక్షించుచు రక్తములను త్రాగుచు. మదముచేత నిక్కుచుండెను. అశ్వత్థామ గాఢముగా నిద్రింపుచున్న వారిని చంపెను. గొంత మేల్కొనిన వారిని చంపివేసెను. మేలుకొని తమ భుజబలమును చూపదలచిన వారిని నరికివేసెను. తనను యెదిరించి యుద్ధమునకు వచ్చు వారిని రినకి చంపెను. నిద్రాసక్తులగు వారినవలీలగా నరికెను. ఇట్లందరి పాంచాలురను ఒకే రీతిగా అశ్వత్థామ కత్తిచేత నరికెను.

## అశ్వత్థామ యేనుగుల గుర్రములపై కురికి నరుకుట

ఇట్లు అశ్వత్థామ పాంచాలకులస్థుల నందరిని నరికివేసి పాంచాలుర యేనుగులుండు శాలలకు వెళ్లెను. తన కత్తిచేత యేనుగుల తొండములను నుగ్గునుగ్గగునట్లు నరికివేసెను. ఏనుగుల కుంభస్థలములను నరికివేసెను. అట్లు నరుకగా ఆయేనుగుల ప్రేగులు కుప్పలు కుప్పలుగా పడియుండి ముత్యపుదండల రాసులవలె ప్రకాశించుచుం

డెను. ఏనుగుల రక్తములు భూమియందు ప్రవాహములుగా ప్రవహించుచుండెను. అశ్వత్థామ ఏనుగులగుంపులను చంపి గుర్రముల శాలలకు పోయెను. అశ్వత్థామ కొన్ని గుర్రములయొక్క పాదములను నరికెను. కొన్ని గుర్రములయొక్క ముఖములను చెక్కెను కొన్ని గుర్రములయొక్క సకల అవయవములను నరికివేసెను. ఇట్లు పాంచాలుర విడిది గృహములలో అశ్వత్థామ తిరిగి ఆగృహములను పీనుగుపెంటలగునట్లు చేసెను. అశ్వత్థామ పాంచాలుర గృహముల నుండి బయలుదేరి జయముచేత ప్రకాశించుచు, యుద్ధపు దుస్తులు, పరికరములుగల గృహములకు వెళ్ళెను. ఆగృహములకు కావలి యుండు వారలను మొదట బరిమార్చెను.

పరిజనుల మంటపములను యేనుగుల గుర్రముల మంటపములను తాకి నరుకుచు కేళి సలుపుచుండెను. ఒక్కొక్కచోట శత్రువులు మేల్కొని అశ్వత్థామను యెదిరించిరి. మారి మసగినట్లు, మృత్యు దేవత కోపించినట్లు, యమ ధర్మరాజు చెలరేగినట్లు కోపమునుబూని అశ్వత్థామ శత్రువులను బలసహితముగా నరికివేసెను. అశ్వత్థామ చేత జచ్చిన జనులు పీనుగుల పెంటలై కాలు కాలు పెనవేసికొని యుండిరి. బంగారు రత్నమయములైన మురుగులుగల శత్రువుల చేతులు ప్రకాశించుచు తెగి పడియుండెను. శత్రువుల కాళ్ళు తెగి పడియుండి యేనుగుల తొండములవలె ప్రకాశించుచు కదలుచుండెను. తలలు ఆవహించుచుండెను. యేనుగులు దంతములు ఖండములై పడియుండెను. అశ్వత్థామచేత నరుకబడిన గుర్రముల కళేబరములు కుప్పలు కుప్పలుగా పడియుండెను. రథముల అవయవములు తునకను తులకలుగా పడియుండెను.

రక్తములు పల్లపుభూములయందు ప్రవహించి సరస్సులవలె నుండెను. కండలు కుప్పలుగా పడియుండెను. ప్రేగులు, తుట్టగట్టి

యుండెను. ఎముకలు పెద్ద కుప్పలు కుప్పలుగా పడియుండెను. ఇట్లు అశ్వత్థామ పాండవ శిబిరములోని చతురంగ బలములను నరికి పీనుగుపెంటలగునట్లు చేసెను. ఆపద్ధతి చూడగా అద్భుత, భయానక, భీభత్సరసములు మూడును రూపములను ధరించి వచ్చినట్లుండెను. ఇట్లు అశ్వత్థామ చెలరేగి తన కత్తిని త్రిప్పుచు భూత భేతాళములకు మిక్కిలి ప్రీతిని కలిగింపు చుండెను. అశ్వత్థామ ఆ పాండవుల చతురంగ బలములను చంపుచుండ కొన్ని బలములు పారిపోయినను, కొంచెముభంగపడినను, తొలగిపోయినను, బెదరినను, భయపడినను, ఆబలములను పోనివ్వక అశ్వత్థామ చంపుచుండెను. దేహబలము, వుత్సాహము, నేర్పరితనము, క్రూరభావము యీనాలుగు ఒకే విధముగా ప్రకాశించుచున్నట్లు అశ్వత్థామ విజృంభించి పాండవ బలములను చంపుచుండెను. ఇట్లీ నాలుగును తగ్గకుండునట్లు అశ్వత్థామ కోపాటోపము లంతకంత కతిశయింప, చేతిలోని కత్తి, ఒక రాక్షసి శత్రువులను చంపుట కాతనికి సహాయకారిగావచ్చినదోయనునట్లు రక్తముచేత, తడిసి ఘోరాకారము గలిగి భయంకరముగా ప్రకాశించుచుండెను. ఆ కత్తికి తగులుకొనిన యెముకల తునుకలు కోరదవుడలవలె నుండెను. అశ్వత్థామ అట్లున్న కత్తిని ధరించి ప్రకాశింపుచు చేది దేశము మొదలగు సైన్యములుండు అనేక ప్రదేశములకు వెళ్ళెను. ఆ బలముల నన్నిటిని నరికివేసెను.

తామర కొలనులో ప్రవేశించిన పెద్ద దున్నపోతువలె, ఉద్యానవనమందు ప్రవేశించిన మదపుఏనుగువలె అడవిని దహించు కార్చిచ్చువలెను, అశ్వత్థామ పాండవబలములలో విహరించుచు కావలసినప్పుడు రథమెక్కుచు పాదచారియై పరాక్రమింపుచు తగు సమయమందు రథము దిగుచుండెను. ఇట్లశ్వత్థామ ప్రళయకాల రుద్రునివలె పాండవ శిబిరములో విహరింపుచు పాండవబలములను నరికి

వేయుచుండెను. శత్రువులను నరుకునపుడు రక్తము మొగసి రక్తము చేత అశ్వత్థామయొక్క దేహము తడుపబడి భయంకరముగా ప్రకాశింపుచుండెను. జనులందరును అశ్వత్థామను చూచి అశ్వత్థామను యెరుగక రాక్షసుడని తలచిరి. అశ్వత్థామ మిక్కిలి భయంకర పరాక్రమముచేత ప్రకాశింపుచు క్రీడించినట్లు చతురంగ బలములను చంపుచు ధర్మరాజుయొక్క గృహములోనికి ప్రవేశించుటకు ప్రయత్నించి వాని గృహద్వారమునకు యెదురుగా వెళ్ళెను.

ధృతరాష్ట్రమహారాజా! అశ్వత్థామ పాండవశిబిరములో ప్రవేశించి మొదట ధృష్టద్యుమ్నుని బంధు సంతతిని చంపెను. ధృష్టద్యుమ్నుని యోధులను గుర్రపు దండులను యేనుగుల గుంపులను యివియన్నియు మొదటనేచంపెను గదా! అట్లు అశ్వత్థామ చంపి తక్కిన గృహములలో ప్రవేశించి సకలరాజులను వారి వారి బలములను చంపి వచ్చుచుండెను. ఆ ధ్వనిని విని పాండవ శిబిరమందు గల జనులందరును మేల్కొనిరి. శిఖండియు ద్రౌపదీ పుత్రులును యుద్ధసన్నద్ధులై అశ్వత్థామను వెదకుచు యెక్కడెక్కడని యడుగుచు వచ్చిరి. వారి వెంటనే చావగా మిగిలిన పాంచాలబలములును ప్రభద్రక బలములును వచ్చెను. ఆ వచ్చిన బలములు శిఖండి మొదలగువారును అశ్వత్థామమీద అనేకశస్త్రాస్త్రములనుగుప్పిరి. శిఖండి మొదలగువారిని, అశ్వత్థామ స్పష్టముగా చూచి తెలిసికొనెను. జింకల గుంపులను జూచి పర్వత శిఖరముమీద నుంచి దిగుసింహము వలె రథముమీద నుంచి క్రిందకు దిగెను. అశ్వత్థామ కత్తితీసికొని అక్కడకు వచ్చిన చతురంగ బలములను నరికివేయుచుండెను. అట్లనేక గతులచేత సంచరింపుచుండగా అందరును అశ్వత్థామను రాక్షసుడని తలచిరి. అశ్వత్థామ ధర్మరాజుయొక్క కుమారుడగు ప్రతివింధ్యునియొక్క సేనను జంపి అతడు వేయు శస్త్రాస్త్రములను నరికి

వేసెను. వెంటనే అశ్వత్థామ తన కత్తిచేత ప్రతివింద్యుని రెండు తుండ్లుగా నరికి వేసెను. ఇట్లు అశ్వత్థామ ధర్మరాజుయొక్క కుమారుడగు ప్రతివింద్యుని నడుము రెండుముక్కలుగా నరికి సింహనాదము చేసెను.

భీముని కుమారుడగు శ్రుతసోముడు దుఃఖ క్రోధవేగముగల వాడై గొప్ప క్రూరాయుధమును అశ్వత్థామమీద వేసెను. అశ్వత్థామ కోపించుకొని క్రూరాయుధమును నుగ్గుగా నరికివేసి కత్తిని తీసికొనెను. అశ్వత్థామ తన కత్తిచేత శ్రుతసోమునియొక్క గుఱ్ఱములను నరికి శ్రుతసోముని శిరస్సును నరికెను. చచ్చి పడిన శ్రుతసోముని జూచి శతానీకుడు నీతో పోరను వచ్చుచున్నాడని చెప్పుచు ఒక చక్రాయుధమును అశ్వత్థామ యొక్క రొమ్ముమీద వేసెను. ఆచక్రాయుధము తగులుటచేత అశ్వత్థామ రొమ్మునందు రక్తము కారెను. ఆదెబ్బకు అశ్వత్థామ జంకక శతానీకునియొక్క శిరస్సును నరికివేసెను. ఇట్లు అశ్వత్థామ నకులుని కుమారుడగు శతానీకుని చంపివేసెను.

సహదేవుని కుమారుడగు శ్రుతసేనుడు కోపముచేత యెఱ్ఱని నేత్రములుగలవాడై ఒక గదను అశ్వత్థామ మీదవేసెను. అప్పుడశ్వత్థామ కత్తిచేత శ్రుతసేనుని యొక్క శిరస్సును నరికివేసెను. సహదేవునియొక్క కొడుకగు శ్రుతసేనుని జూచి శ్రుతకీర్తి రోషము గలవాడాయెను. పిమ్మట తన ధనుస్సును ధ్వనింపజేయుచు వాడియైన బాణముల వర్షముచేత అశ్వత్థామను మునుగునట్లు చేసెను. అందుల కాతడు కోపించుకొని తనకత్తిచేత శ్రుతకీర్తి కంఠమును నరికివేసెను. ఇట్లు ద్రౌపదీ పుత్రులగు ప్రతివింద్యుడు, శ్రుతసోముడు శ్రుతకీర్తి శతానీకుడు శ్రుతసేనుడు యీ అయిదుగురును అశ్వత్థామచే చచ్చిరి. ప్రభద్రక రథికులును, శిఖండియు మిక్కిలికోపముగల

వారై అశ్వత్థామను చుట్టుముట్టుకొనిరి. అంతట శిఖండి మొదలగు వారందరును బాణములు, తోమరాయుధములు, చక్రాయుధముల చేతను, ముద్గరము, కత్తులు, కుంతలములు మొదలగు అనేక క్రూరాయుధములచేత నొప్పించిరి. అప్పుడశ్వత్థామ ప్రభద్రక రథికులను చంపుచు క్రీడింపుచుండెను, శిఖండి ప్రకాశబాణములచేత అశ్వత్థామయొక్క కనుబొమల నడిమి ప్రదేశమును నొప్పించెను.

## అశ్వత్థామ శిఖండిని బొదివి చంపుట

అందుకు అశ్వత్థామ, అధికకోపముగలవాడై తనకత్తిచేత శిఖండియొక్క శిరస్సును నరికి, దేహమును రెండు తుండ్లుగా నరికి వేసెను. ఈ ప్రకారము శిఖండి మొదలగు రథికులందరు అశ్వత్థామ చేత చచ్చినను పాంచాల ప్రభద్రక మత్స్యదేశముల బలములు అశ్వత్థామతో పోరాడుచుండెను. అశ్వత్థామ సింహమువంటి పరాక్రమము కలవాడై ఏనుగులను నరుకుచు, గుఱ్ఱములను తుండ్లు తుండ్లుగా జేయుచు, సైనికుల ప్రాణములను తీసికొనుచు విహరించెను. ఆ బలములను నరుకుచు అశ్వత్థామ సింహనాదముచేసెను. ఆ చతురంగ బలములయందు ధర్మరాజాది పాండవులైదుగురును, కృష్ణ సాత్యకు లిద్దరును లేనందున. వారు ఏడుగురును లేరని అశ్వత్థామ తెలుసుకొనెను. పాండవశిబిరములోని చతురంగ బలములను అశ్వత్థామ చంపుచుండగా, చూచెడి జనులు వీడు అశ్వత్థామయని యూహించి తెలిసికొనిరి. అది యెట్లనగా చెప్పెదను వినుము.

ధృతరాష్ట్ర మహారాజా! కౌరవ పాండవులుయుద్ధము చేయుటకు ప్రారంభించిన దినము మొదలుకొని అక్కడుండెడి జనులకు ప్రతినిత్యము రాత్రులందు ఒక స్వప్నముకలుగును. ఆ స్వప్నమందు ఒకస్త్రీ కనబడును. ఆస్త్రీ నల్లనిదేహము కలిగి ఎర్రని ముఖనేత్ర

ము లు కలదై ఎఱ్ఱని పుష్పమాల గంధములచేత నలంకరింపబడి యుండును. అటువంటిస్త్రీ, జనులస్వప్నమందు కనబడును. ఆస్త్రీ పాండవశిబిరమందు నిద్రించెడి జనులను, ఏనుగులను, గుఱ్ఱములను త్రాళ్ళచేత బంధించి తెచ్చి అశ్వత్థామయెదుట బెట్టును. శిబిరమందు నిద్రించెడి జనులందరును తలవెంట్రుకలను విరబోసికొని వికారదేహ వంతులై వ్రేలాడుచుండురు. అట్టిజనులను, ఏనుగులను, గుఱ్ఱము లను త్రాళ్ళచేత బంధించి ఆస్త్రీ తెచ్చి అశ్వత్థామ ముందరనుంచగా వారినందరను నతడు చంపి సింహనాదము చేయుచుండును. ఈ ప్రకారముగా పాండవ శిబిరములోని జనులు ప్రతినిత్యము స్వప్నము లను గనుచుండిరి.

అశ్వత్థామ నిద్రించెడివారిని చంపి సింహనాదము చేయుచుం డగా అట్టి స్వప్నములను గనిన జనులందరును వీడు అశ్వత్థామయై యుండవచ్చునని నిశ్చయించి భయపడక ఆ జనులందరును రాత్రి కాలమందు నతనితో యుద్ధముచేసిరి. అశ్వత్థామ మెరపు మెరిసినట్లు నానాప్రకారములచేత సంచరింపుచు పాండవబలములను నరికి చీల్చి చెండాడుచుండెను. పాండవ బలములు చెదిరిపోక అశ్వ త్థామ అధికబల శౌర్యముకలవాడై పాండవసైనికులయొక్క శిరస్సు లను నరుకుచు చేతులను కాళ్ళను, నడుములను, మోకాళ్ళను, పాదములను, కత్తిచేతను, బాణములచేతను నరికివేసెను.

ద్రోణాత్మజుడా యేనుగులను, గుఱ్ఱములను నరికివేసెను. అట్లు నరుకుటచేత రక్తము నెత్తుటి వరదలు ప్రవహింపుచుండెను. ఆ బలము లను చంపుటచేత మాంసములును, మెదడులును, కుప్పలుకుప్పలుగా పడియుండెను. ఆ మాంసాదులను రాక్షసభూత భేతాళాదులన్నియు భక్షించి సంతోషింపుచుండెను. ఆతండు సంతోషముచేత చాల రేగి పాడుచు, విలాసముగానవ్వుచు; జయముచేత అహంకార మద

ములు కలవాడై పాండవబలములను పడగొట్టుచుండెను. అతడు పాండవ శిబిరములో విహరింపుచు పాండవబలముల నన్నిటిని చంపి వేసెను. చావగామిగిలిన సైనికులు పారిపోయిరి. అప్పుడు ఆవీరుడు రథమెక్కి అతి శీఘ్రముగా తఱుముకొనివెళ్ళి ప్రకాశ తీక్ష్ణబాణ సమూహములచేత పారిపోయెడి సైనికులనందరిని చంపివేసెను. ఈ ప్రకారముగా పాండవబలములన్నిటిని చంపివేసి అశ్వత్థామ మిక్కిలి భయవ్యాకులములు పొందియున్న జనులున్న స్థలమునకు వెళ్ళెను. అట్లు వెళ్ళి, యతండా జనులమీదను, కట్టివేసియున్న యేనుగుల మీదను, గుఱ్ఱములమీదను క్రూరబాణములను గుప్పెను. అప్పుడధిక కోలాహలధ్వని కలిగెను. ఆ ధ్వనికి, అశ్వత్థామవేసెడి బాణము లకును బెదరి భయపడి ఆ యేనుగులగుంపులును గుఱ్ఱపుసమూహము లును తమ కట్లు త్రెంచుకొని పరుగెత్తిపోవుచుండెను. అట్లు పరు గెత్తెడి యేనుగులును, గుఱ్ఱములును. అనేకవిధములుగా కలహిం చుచు కోపించుకొని ఒకటితో నొకటి పోరాడుచుండెను. ఆయేనుగుల కలహ సమ్మర్దములచేత పాండవ శిబిరములోని జనసమూహములకు కాళ్ళు విరుగుచుండెను; చేతులు నలుగుచుండెను. రొమ్ములు పగులు చుండెను. వీపుయెముకలు విరుగుచుండెను. ప్రక్కలునలుగుచుండెను. శిరస్సులు తునుకలుగా పగులుచుండెను. చేపలకట్టవలె శిబిరము లోని జనులందరును యిరుకుగల స్థలయులయందు పీనుగుపెంటలై చచ్చిపడియుండిరి.

ఆ సమయమందు ద్రౌణి కత్తిని డాలును తీసికొని వేడుక కొరకు రథముదిగి ఆకలహించుచున్న యేనుగుల గుంపులను గుర్ర ముల సమూహములను నరికివేసెను. కొందరుజనులు చక్కగా నిద్ర తెలియని భ్రమచేతను భయముచేతను పాదములు గుదియపడు చుండగా పారిపోజాలక కోపముచేత వ్యత్యాసపు మాటలను చెప్పు

చుండిరి. కొందరుజనులు నిద్రతెలిసి తమ తండ్రులను అన్నదమ్ములు మొదలగు బంధువులను ప్రత్యేకముగా పిలుచుచు తిరిగి వెదకుచుండిరి. తమ వారు కానివారిని తమవారని తలచి చేతులతో ఒకరొకరు పట్టుకొని వెళ్ళుచుండిరి కొందరుజనులు ఆయుధములను తీసికొని తమ బంధుమిత్రులు నిద్రకండ్లచేత తమమీదకు వచ్చుచుండగా అట్టివారిని శత్రువులని తలంచి చంపుచుండిరి. కొందరు యెదురుగా వచ్చి యిదియేమని మరికొందరిని అడుగగా వారితో యిట్లని చెప్పిరి.

జనులారా! అశ్వత్థామ మన గృహములోనికి ప్రవేశించి చంపుచున్నాడు. అని చెప్పగా ఆమాటను జనులు విని వారితో యిట్లనుచుండిరి. జనులారా! కృష్ణార్జునులు యీ శిబిరమందు యిప్పుడు లేనందున పాపాత్ముడైన అశ్వత్థామ యిట్లు చంపుటకు వచ్చెను. కృష్ణార్జునులు యిక్కడున్న యెడల అశ్వత్థామను బాధింతురు అని మరికొందరు జనులు వేరొక కొందరితో చెప్పుచుండిరి. ఈ అశ్వత్థామ యిట్టి కుత్సిత పరాక్రమమును చూపగా అర్జునుడు చూచి కోపించక మానడు. ఆపుణ్యాత్ముడగు అర్జునుడు, యెన్నడైనను వాహనము లేని వానిని జంపలేదు. నిరాయుధులను జంపలేదు. భయపడిన వారిని చంపలేదు. నిద్రించు వారినిచంపలేదు. అని జనులు చెప్పుకొనుచు అర్జునుని పొగడుచుండిరి. అశ్వత్థామ భీముడు దుర్యోధనునకు కలిగించిన గొప్ప అవమానమును మాటిమాటికి తలచుచు క్రూరస్వభావముగలవాడై కొంచెమైనను సంశయింపక మరల ఆజనులను చంపుచు నరుకుచు చీల్చి చెండాడు చుండెను. తామరకొలనునందు ప్రవేశించిన మదపుటేనుగువలె అశ్వత్థామ పాండవ శిబిరములోని జనులందరను చంపివేసెను. కొందరురాజులును సైనికులును అశ్వత్థామ యెదుట పడక భయముచేత దూరదూరముగా వెళ్ళిరి. వారందరును తలగుడ్డలు లేక పాదములచేత

త్రొక్కుపడుచు శిబిరద్వారములో ప్రవేశించి వెళ్ళుచుండిరి. రాజులును సైనికులును ద్వారమార్గమందున్న కృపాచార్య కృతవర్మలనుచూచి యెండిన తమ పెదవులను నాలుకచేత తడుపుచు వారితో యిట్లనిరి.

కృపాచార్య కృతవర్మలారా! అశ్వత్థామ యెదుట పడక ప్రాణభయముచేత మేము వెళ్ళు చున్నాము. మీరు కృపచేత మమ్ములను రక్షింపవలయును. మీకునమస్కరింపుచున్నాము. అని రాజులును సైనికులును కృపాచార్య కృతవర్మలను ప్రార్థించి మ్రొక్కిరి. ఆకృపాచార్య కృతవర్మ లిద్దరును రాక్షసావేశ క్రూర స్వభావులయి చిత్త స్వాధీనములేని వారగుటవలన తమకు అపకీర్తి కలుగునని తిలచలేమ క్రూరస్వభావులగు కృపాచార్య కృతవర్మలిద్దరును. ఆరాజులను సైనికులను పోనివ్వక అందరిని భల్లాయుధముచేత చంపివేసిరి.

ఇట్లు పాండవ శిబిరమందుగల సకలరాజులును, పరిజనులును రధికులును, సైనికులును, యేనుగులును, గుర్రములును, నిశ్శేషముగా అశ్వత్థామచేత చచ్చిపడియుండెను. ఆ పాండవ శిబిరమందు జనులు లేనందున మన కౌరవ శిబిరమువలెనే వుండెను. అప్పుడు రాక్షస భూతభేతాళములును, వాని భార్యలును. వాని పుత్రమిత్రులును పాండవ శిబిరమునకువచ్చి భయంకరములైన తమ కోరలను తెరచి అరచుచుండెను. ఆరాక్షస కుటుంబముల ధ్వనులన్నియు జేరి ఆకాశమందు వ్యాపించి యుండెను. ఆరాక్షస కుటుంబములు నవ్వుచు సల్లాపములు చేయుచు, హుంకృతులు, చేయుచు, ఒకటిమీద ఒకటి పైపైకి వచ్చుచుండెను. ఆ రాక్షస భూతభేతాళాదుల కుటుంబములకు నానావిధ వికారములగు అనేకమగు చేతులును, కాళ్ళును కలిగి యుండెను. ఆరాక్షసుల కుటుంబసంఖ్యను లెక్కింప శక్యముకాదు.

ఆరాక్షసాదులందరు పాండవశిబిరములోని పీనుగులమాంసములును, మెదడులును, క్రొవ్వులను తినుచు రక్తములను త్రాగుచుండిరి. ఆ మాంసాదులలో రుచిగలవి తమ పుత్రమిత్ర భార్యాదులకు యిచ్చుచుండిరి.

ఆరాక్షసాదులు యితర రాక్షస కుటుంబములను రానీయక మాంసాదులను వారే తీసుకొనుచుండిరి. రాక్షస కుటుంబములు రక్తపాతముచేత మదించి నృత్యము చేయుచు అనేకరీతులుగా విహరించుచు సంతోషముగా నుండిరి. కొంత సేపటికి పీనుగు లధికముగా నున్నందున రాక్షస కుటుంబముల కలకల ధ్వను లణగెను. జగత్తులను దహించిన కాలాగ్నులవలె అశ్వత్థామ పాండవ శిబిరములోని జనులందరిని నిశ్శేషముగా చంపివేసెను. అశ్వత్థామ రక్తప్రవాహముతో నిండిన పాండవ శిబిరములో తిరిగిన అతని చేతులు రెండును రక్తముచేత తడిసి చూచుటకు సుందరముగా నుండెను.

అశ్వత్థామ ఆరాత్రియందు పాండవ శిబిరములోనికి ప్రవేశించు నప్పుడు జనులందరును నిద్రించుచున్నందున శిబిరమప్పుడు నిశ్శబ్దముగా నుండెను. పిమ్మట అశ్వత్థామ శిబిరములోనుండి మరలి వచ్చునప్పుడు పాండవ శిబిరము పీనుగు పెంటలై జనులు చచ్చినందున ఆ నిశ్శబ్దత అట్లనే యుండెను. ధృతరాష్ట్ర మహారాజా! యిట్లు అశ్వత్థామ పాండవశిబిరములోని సకల జనులను. ఏనుగులను, గుఱ్ఱములను అన్నిటిని చంపి తెల్లవారునపుడు పాండవ శిబిరములోనుండి వెడలి వెలుపలకు వచ్చిరి. ఇట్లు అశ్వత్థామ దుర్యోధనునితో తాను చేసిన ప్రతిజ్ఞను చెల్లించుకొని పాండవ శిబిరములోనుంచి వెడలి వెలుపలకు వచ్చి కృపాచార్య. కృతవర్మలను చూచి యిట్లనెను.

## అశ్వత్థామ పాండవ శిబిరము వెడలి కృప కృతవర్మలను కూడుకొనుట

కృపాచార్య కృతవర్మలారా ! నేను పాండవశిబిరములోనికి వెళ్ళి ధృష్టద్యుమ్నుడు, శిఖండి మొదలగు సకల పాంచాలురను చం

పితిని. ద్రౌపదీ పుత్రులగు ప్రతివింధ్యుడు మొదలగు ఐదుగురిని చం పితిని. చేది దేశపు సైన్యములను, మత్స్య దేశపు బలములను, పాం చాల దేశపు బలములను, ప్రభద్రకాది బలములను, నిశ్శేషముగా చంపివేసితిని. విశేషముగా చెప్పుటవలన ప్రయోజనము లేదు. ముఖ్యమగు మాటను చెప్పెదను వినుము. ఈపాండవ శిబిరములో ఒకమనిషియైనను, ఒక గుఱ్ఱమైనను, ఒక ఏనుగైనను పేరులేకుండు నట్లు చంపివేసితిని. ధర్మరాజాది పాండవులైదుగురును కృష్ణసాత్యకు లిద్దరును పాండవశిబిరమందు లేరు. ఎక్కడికి పోయిరో తెలియదు. పాండవులు జయమునకు ధృతరాష్ట్ర దుర్యోధను లిద్దరును హీనత్వ మును పొందిరి. వారి హీనత్వమును పోగొట్టుట కొరకు యీ రాత్రి యందు పాండవశిబిరములో ప్రవేశించి అందరిని చంపివేసితిని. నే నందు ప్రవేశించునప్పుడు రుద్రుడు నాకు ప్రత్యక్షమై వర మిచ్చెను. మీయిద్దరును యీద్వారమందు నిలిచి నీకు గొప్ప అండగా నుం డిరి. మీసహాయమువలన నేను తలచినంత పనికి సమర్థుడనైతిని అని అశ్వత్థామ కృపాచార్య కృతవర్మలతో చెప్పెను.

కృపాచార్య కృతవర్మలిద్దరును రాక్షసావేశము గలవారై అశ్వత్థామకు కనబడక పారిపోవుటకువచ్చి తమను ప్రార్థించినరాజు లను, సైనికులను చంపియుండిరి. పిమ్మట వారు రాక్షసావేశమును తెలిసినవారై తాముచేసిన నీచపరాక్రమమునకు దుఃఖించుచుండిరి. అప్పుడు అశ్వత్థామ వచ్చి చెప్పిన మాటలను వినుచు నతనిని పొగడక ఊరకుండెను. కృపాచార్య కృతవర్మ లిద్దరును తమ మనో వికారమును అశ్వత్థామ యెరుంగక మునుపే తలలు వంచుకొని తగురీతిని అశ్వత్థామను పొగడిరి. అశ్వత్థామ కృపాచార్య కృత వర్మలతో యిట్లనెను.

కృపాచార్య కృతవర్మలారా! పాండవులను నేను పట్టుకొని వచ్చినను లేక ఆ పాండవులను నేను చంపినను కొంతవరకు నన్ను

మీరు పొగడదగును. ఆ పాండవులను తప్ప తక్కినవ్యర్థులగు వారి నందరిని చంపితిని. అందువలన నా పౌరుషమును మీరు పొగడ తగదు అని అశ్వత్థామ కృపాచార్య కృతవర్మలతో యిట్లనెను. ఆ మాటలను వారువిని అశ్వత్థామతో యిట్లనిరి. అశ్వత్థామా! నీవు యీ గడచిన రాత్రికాలమందు నిర్భయముగా పాండవశిబిరము లోనికి ప్రవేశించి ధృష్టద్యుమ్నుడు శిఖండి మొదలగు పాంచాలుర నందరిని చంపితివి. ప్రతి వింధ్యుడు మొదలగు ద్రౌపదీ పుత్రులను అయిదుగురిని చంపితివి. వారి వారి సకలబలములను చంపితివి. మత్స్యదేశము మొదలగు అనేక దేశముల పాండవబలముల నన్నిటిని చంపితివి. పాండవశిబిరములో ఒక్క ప్రాణియైనను బ్రతుకకుండునట్లు చంపివేసితివి. నీవు ఒక్కడవే పాండవశిబిరములో ప్రవేశించి రెండుజాముల కాలములో యింతకార్యమును చేసితివి. యీ కార్యము మిక్కిలి ఆశ్చర్యము కలిగింపుచున్నది. అని కృపాచార్య కృతవర్మ లిద్దరును అశ్వత్థామతో చెప్పి వానిని కౌగలించుకొనిరి. అని సంజయుడు ధృతరాష్ట్రునితో చెప్పగా ధృతరాష్ట్రు డిట్లనెను. సంజయా! అశ్వత్థామ దుర్యోధనునకు జయము కలుగవలెనని కోరుచుండును. ఆ దుర్యోధనుడు యుద్ధమందు పడిపోక మునుపు అశ్వత్థామ యిట్లు శత్రువులను చంపకుండుటకు కారణమేమో తెలియదు. అతడు పడిపోయిన పిమ్మట అశ్వత్థామ పరాక్రమించి శత్రువులను చంపివేసెను. దుర్యోధనుడు పడిపోయిన పిమ్మట అశ్వత్థామ తన బలశౌర్యములను చూపుటకు వేడుక గలవాడాయెను. అని ధృతరాష్ట్రుడడుగగా సంజయుడు యిట్లనెను.

ధృతరాష్ట్రమహారాజా! పాండవ భుజబలములకు అశ్వత్థామ ఓడిపోయి మనస్సులో కుందుచుండెను. గదాయుద్ధమందు భీముడు దుర్యోధనుని తొడలు విరుగగొట్టి తన యెడమ పాదముచేత

దుర్యోధనుని శిరస్సును తన్నెను. అందువలన అశ్వత్థామకు మిక్కిలి కోపము గలిగెను. ఆ దుఃఖ కోపములు రెండును అశ్వత్థామ మనస్సును పరితపింప జేయుచుండెను. అప్పుడు ద్రోణుని మరణ పద్ధతి యంతయు అశ్వత్థామ మనస్సునకు క్రొత్తదిగా తోచెను. అశ్వత్థామ అధికకోపమును దుఃఖమును గలవాడై దుర్యోధనునితో ప్రతిజ్ఞ చేసి సకలశత్రువులను చంపుటకు దుర్యోధనుని సమ్మతిని పొంది వచ్చెను. దుర్యోధనుడు పంపగా వచ్చిన అశ్వత్థామ రౌద్రాకారుడై ఆ ప్రకారము పాండవశిబిరములలో ప్రవేశించి అట్లు శత్రువులను చంపెనని తెలిసికొనుము.

ధృతరాష్ట్రమహారాజా! ఆ ప్రకారము అశ్వత్థామ శీఘ్రముగా పాండవశిబిరములోనికి ప్రవేశించునప్పుడు, పాండవు లచ్చట లేనందున అశ్వత్థామయొక్క శూరత్వము కొనసాగెను. ఆ పాండవులే అక్కడున్న యెడల అశ్వత్థామయొక్క పరాక్రమము చెడిపోవును. సకలదేవ సమూహముల్తైనను పాండవుల యెదుట గెలువజాలరని నిశ్చయముగా తెలిసికొనుము. పాంచాలాదులందరికిని ఆయుష్కాలము సమాప్తియైనందున పాండవులు శిబిరమందు లేక మరియొక చోట నివసించియుండిరి. ఇదియంతయు ఆ దైవము పోవు పోకలని తెలిసికొనుము. అని సంజయుడు ధృతరాష్ట్రునితో చెప్పెను. ధృతరాష్ట్రమహారా! కృపాచార్య కృతవర్మలచేత అశ్వత్థామ పొగడబడుచు వారితో అశ్వత్థామ యిట్లనెను. కృపాచార్య కృతవర్మలారా! మనమికను భయపడక దుర్యోధనుని దగ్గరకు వెళ్ళవలయును. మన పుణ్యావశమువలన మనము వెళ్ళు పర్యంతము దుర్యోధన మహారాజు ప్రాణములతో వున్న యెడల మనము శత్రువులను చంపిన విధమంతయు దుర్యోధనునకు తెలుప వలయును.

## అశ్వత్థామాది రథికత్రయము దుర్యోధనుని కనుగొనుట

అశ్వత్థామ, కృపాచార్య కృతవర్మలతో చెప్పెను. కృపాచార్య కృతవర్మ లిద్దరును సమ్మతించి అట్లు చేయుదమని పాండవ శిబిరద్వారములోనుండి బయలువెడలి వచ్చిరి. అశ్వత్థామాదులు ముగ్గురును దుర్యోధనునితో మాటలాడవలెనను అపేక్షచేత వేగముగా యుద్ధభూమికి వచ్చిరి. ఆ యుద్ధభూమియందు రక్తమయమైన ఒకచోట దుర్యోధనుడు తొడలువిరిగి పడియుండెను. దుర్యోధనుడు పడిపోయి దేహమందలి బాధవలన కలిగిన దుఃఖముచేత పొర్లాడుచు సందడిగ నూర్ధ్వశ్వాసను విడుచుచు ప్రాణములను విడుచుటకు సిద్ధపడియుండెను. ప్రాణములుపోవు స్థితియందున్నందున దుర్యోధనునకు అవయవ చేష్ట లొకటొకటి తగ్గుచుండెను. దుర్యోధనుని అశ్వత్థామాదులు ముగ్గురునుచూచి దుఃఖముచేత తమ దేహములు వ్రాలుచుండగా కన్నీరుకార్చుచు విచార విరోధములను గురించి చెప్పుకొనుచు దుర్యోధనుని జూచుచు దగ్గరకుపోయితమ దేహములను దుర్యోధనుని దేహముమీద వుంచుచు కౌగిలించుకొనిరి. దుర్యోధనుని కౌగిలించుకొని కృపాచార్య కృతవర్మ అశ్వత్థామలు ముగ్గురును వెక్కి వెక్కి యేడ్చుచు దుర్యోధనుని చుట్టును జేరి యిట్లని విచారించిరి. దుర్యోధనమహారాజా ! అయ్యో ! సకలభూమండలము నీయాజ్ఞకు లోబడియుండెను. మహారాజువైన నీవు యిట్లు తుదకు హీనస్థితిని పొందితివి. బ్రహ్మదేవునకు అసాధ్యమైన కార్యము ఎక్కడను కనబడదు. దుర్యోధన మహారాజా ! మమ్ము నీవు యెరుగుదువుకదా ! అని కృపాచార్యాదులు ముగ్గురును, దుర్యోధనునితో చెప్పిరి. ఆమాటలను దుర్యోధనుడు విని తిన్నగాకండ్లు తెరచెను. దుర్యోధనుని ముఖముచూచి అశ్వత్థామ గద్గద కంఠముతో యిట్లనెను,

దుర్యోధనమహారాజా ! నీవు మిక్కిలి భుజబలగర్వములును ధైర్యమును గలవాడవు. నీవు గదాయుద్ధమందు మిక్కిలి సమర్థుడవు. నిన్ను న్యాయయుద్ధమందు గెలువ జాలక కపటోపాయముచేత భీముడు నిన్ను గదాయుద్ధమందు పడగొట్టెను. ఆ దైవముకోపించిన యెడల యెంతటి మొనగాండ్రకైనను అపాయము కలుగగలదు. నీవు నీభుజబలధైర్యశౌర్యములచేత ప్రకాశించి యీశమంతపంచక సమీపమగు కురుక్షేత్రమందు గదాయుద్ధము చేసితివి. నీవు పుణ్యగతిని పొందెదవు. నీనిమిత్తమై మాకు దుఃఖము కలుగదు. నీ తండ్రియగు ధృతరాష్ట్ర మహారాజు, నీ బంధుజనులు, స్త్రీలు యిక దుఃఖింతురు. వారి హీనస్థితిని చూచి నేను సహింపజాలక దుఃఖించుదును. దుర్యోధనా ! బలరాముడు తన శిష్యులలో నీవు మిక్కిలి పరాక్రమవంతుడవని పొగడుచుండును. బలరాముని మాటను యెగతాళి చేసినట్లు భీముడు నిన్ను పడగొట్టెను. ఆ బ్రహ్మదేవుడు భీమునకు విజయముకలిగించెను. భీముని విజయము యెవ్వరికిని సమ్మతముగాదు. ఇటువంటి అన్యాయ విజయమువలన పాండవులకు అభివృద్ధి కలుగజాలదు.

దుర్యోధన మహారాజా! నీభుజబల శౌర్యధైర్య సాహస యుద్ధచమత్కార సమర్థత్వములు అపరిమితములై భీముని చంపుటకు సిద్ధమాయెను. భీముడు చచ్చునని అర్జునుడును కృష్ణుడును భయపడిరి. నీ భుజబల శౌర్యములు యీ ప్రకారము శత్రువులను భయపెట్టి ఆశత్రువులను అధర్మమునకు ప్రవేశించునట్లుగా జేసెను. ఈ విషయమంతయు దేవతలుజూచిరి. వేయి మాటలు చెప్పుట వలన ప్రయోజనమేమి? పాపాత్ముడైన భీముడు ధర్మము తప్పి గదచేత నీతొడలు విరుగ గొట్టెను. మరియు తన యెడమ కాలిచేత నీశిరస్సును తన్నెను. ధర్మరాజును చూచుచు భీమునకు శిక్షవిధింపలేదు.

ధర్మరాజు సర్వదా మనస్సునందు దుర్మార్గపు తలంపును కలిగి యుం డును. ఈవిజయము పాండవులను హీన స్థితిని అపజయమును కలుగ జేయును. దుర్యోధనా! నీవు చేసిన గదా యుద్ధమువలన సకలజనుల కును సంతోషమునునీకు గౌరవమునుకలిగించెను. గదాయుద్ధము నీకు నిర్మలమైన కీర్తిని కలిగించెను. అని అశ్వత్థామ దుర్యోధనునితో చెప్పి తన మానుషత్వమును ఊహించి యిట్లనెను.

దుర్యోధన మహారాజా! నీవు ఇదివరకు నాకు మిక్కిలి ఐశ్వర్యమును కలిగించితివి. నీవు నాకిచ్చిన ధనముచేత నేను చక్కగా భుజించితిని. మంచి వస్త్ర భూషణములను ధరించితిని నా బంధు జనులకు అనేక విధములుగా అన్నాదులుపెట్టి పోషించితిని. అనేక యజ్ఞాది పుణ్యకార్యములను చేసితిని. అనేక ధర్మ కార్యములచేత ప్రసిద్ధిని బొందితిని. అట్లు నీవు ఒక కొండగా నాయండనుండి నన్ను పోషించితివి. నీవు యిప్పుడు చనిపోవగా నాదేహమును యిట్లు పెంచి రక్షించుకొని యున్నాను. నేను నీకొక సేవకుడనని చెప్పుకొనరాదు. అని అశ్వత్థామ దుర్యోధనునితో చెప్పి తన్నునిందించుకొనుచు యిట్ల నెను. దుర్యోధన మహారాజా! నీవు న్యాయము తప్పక ధర్మయుద్ధ ముచేసి స్వర్గమును పొందుటకు పోవుచున్నావు. నీతోకూడ స్వర్గము నకు వచ్చునంత పుణ్యము నేను చేయలేదు. కాని నీమనస్సు తృప్తి బొందునట్లు మనశత్రు సమూహములను చంపి వచ్చి నీమనస్సునకు సంతోషము కలిగించు భాగ్యవంతుడనైతిని. ఆమాటలను చెప్పె దను వినుము. దుర్యోధన మహారాజా! నీవు స్వర్గమునకు వెళ్ళగానే నాతండ్రియగు ద్రోణుని చూడుము. నీకు ద్రోహము చేసిన దుర్మా ర్గుడైన ధృష్టద్యుమ్నుని నీకొడుకగు అశ్వత్థామ చంపెనని మొట్ట మొదట ద్రోణునితో చెప్పుము. నాబదులు నీవు ద్రోణునకు నమ స్కరించి కౌగలించుకొనుము. పిమ్మట నీబంధుజనులగు బాహ్లిక,

సోమదత్త, భూరిశ్రవులు మొదలగువారితో సంభాషింపుము. అది యటుండనిమ్ము. ఈ రాత్రియందు జరిగిన వృత్తాంతమును చెప్పెదను వినుము. నేను చెప్పు మాటలను అమృత బిందువులవలె నీ చెవుల యందుంచుము. నేను చెప్పుమాటలను వినుము. దుర్యోధనా! యీ గడచిన రాత్రియందు జనులందరు నిద్రింపుచుండగా పాండవ శిబిరములోనికి ప్రవేశించి పాపాత్ముడైన ధృష్టద్యుమ్నుని మొదట చంపితిని. పశువును చంపినట్లుగా వానిని, వాని బంధుజనుల నందరిని ద్రౌపదీపుత్రులను ఐదుగురను అవలీలగా చంపితిని. పాండవ శిబిరమంతయు రక్తమయ మగునట్లుగా సకల జనులను ఏనుగులను గుర్రములను నిశ్శేషముగా నరికివేసితిని. పాండవ శిబిరమందే జంతువుకూడ లేదు.

అంతయు పీనుగు పెంటలగునట్లుగా చేసితిని. పాండవులైదుగురును కృష్ణసాత్యకు లిద్దరును ఆ శిబిరములో లేనందున వారు నా యెదుట పడలేదు. మేము ముగ్గురము పాండవశిబిరమునకు వెళ్ళుదుమని ముందుగా కృష్ణుడు ఎరిగి పాండవులను దాచిపెట్టెనేమో తెలియలేదు. మరి ఏ కార్యము నిమిత్తమై ఎక్కడికిపోయిరో తెలియదు. అధర్మ మార్గముగా పాండవులకు జయముకలిగియు ఆ జయము పాండవులకు దక్కలేదు. ఆ పాండవులు ఏమైనను నాకేమియు బాధలేదు. ఈ కృపాచార్య కృతవర్మలను, నన్నును చూచి యీ ముగ్గురను జ్ఞాపకము తెచ్చుకొనుము. అని అశ్వత్థామ కృపాచార్య కృతవర్మలను కలసికొని దుర్యోధనునితో చెప్పి కృపాచార్య కృతవర్మల నిద్దరిని దుర్యోధనునకు చూపి యిట్లనెను.

దుర్యోధన మహారాజా! యీ కృపాచార్య కృతవర్మల నిద్దరిని నేను సహాయముచేసుకొని శత్రువులను చంపితిని. వీరి సహాయమువలన అనేకమంది శత్రువులను చంపుటకు సమర్థులమైతిమి. వీరి

సహాయమువలన శత్రువులను చంపుట ఆశ్చర్యముకాదు. అని అశ్వత్థామ దుర్యోధనునితో చెప్పెను. ఆమాటలను దుర్యోధనుడు విని సంతోషముగా ఆలకించుచు దుర్యోధనుడు అశ్వత్థామతో యిట్లనెను. అశ్వత్థామా! నీవును నీకృపాచార్య కృతవర్మలును నాశత్రువులను చంపినంత కార్యమును భీష్మ ద్రోణులైనను చేయలేదు. ఇది మిక్కిలి అసాధ్యమైనది. కర్ణుని మనము మిక్కిలి బల పరాక్రమవంతు డని మనము పొగడుచుంటిమి. ఆ కర్ణునికంటె శల్యుడు బలశౌర్యములయం దధికుడని పెద్దలు చెప్పుదురు. కర్ణ శల్యులైనను యీ యుద్ధమందు నాకు సంతోషమును యింతగా కలిగింపలేదు. అందరికంటె మీరు ముగ్గురు నాశత్రువులను చంపి నాకు మిక్కిలి సంతోషమును కలిగించితిరి. అని దుర్యోధనుడు అశ్వత్థామతో చెప్పి వారి ముగ్గురి ముఖములను కలియజూచి యిట్లనెను.

కృపాచార్య కృతవర్మ అశ్వత్థామలారా! మీరు ముగ్గురును కృతార్థులైరి. మీరు ముగ్గురును సుఖముగానుండుడు. మరల మిమ్ములను ఎప్పుడైనను స్వర్గమందే చూడగలను. మీరు దుఃఖములను విడిచిపొండు అని దుర్యోధనుడు కృపాచార్య, కృతవర్మ అశ్వత్థామలతో చెప్పి ప్రాణములను విడిచెను. కృపాచార్య కృతవర్మ అశ్వత్థామలు ముగ్గురును దుర్యోధనుని కౌగిలించుకొని అతని చుట్టును ప్రదక్షిణముగా తిరిగి మరల చూచుచు తమ రథములను ఎక్కి వెళ్ళిరి.

ధృతరాష్ట్ర మహారాజా! అంతట సూర్యోదయమాయెను. సంజయుడు ధృతరాష్ట్రునితో చెప్పెను. ధృతరాష్ట్రమహారాజా! యీ ప్రకారముగా దుర్యోధనుడు ప్రాణములను విడిచెను. యీ వృత్తాంతమును నీకు తెల్పుటకు నే నిక్కడకు వచ్చితిని.

మహారాజా! యీ భారతయుద్ధ ప్రకారమంతయు నీకు చెప్పుట కొరకు వేదవ్యాస మునీంద్రుడు నాకు దివ్యదృష్టియిచ్చి నన్ను పంపించెను. నీకొడు కగు దుర్యోధనుడు బ్రతికియుండు పర్యంతము నాకు దివ్యదృష్టి కలిగియుండెను. ఆ దుర్యోధనుడు ప్రాణములను విడిచినప్పుడు నాదివ్యదృష్టి నన్నువిడిచి వెళ్ళెను. ఇట్లు అశ్వత్థామ కృపాచార్య కృతవర్మల యుద్ధమును వినుచు దుర్యోధనుడు పరలోకమును పొందెనని సంజయుడు ధృతరాష్ట్రునితో చెప్పెను. యీ వృత్తాంతమును యిట్లు చెప్పెనని వైశంపాయనమునీంద్రుడు జనమేజయునితో చెప్పెను. జనమేజయ మహారాజు వైశంపాయన మునీంద్రునిజూచి యిట్లనెను. ఓ వైశంపాయన మునీంద్రా! పిమ్మట పాండవులు యేరీతిగా ప్రవర్తించిరో చెప్పుడు అని జనమేజయమహారాజు అడిగెను.

ఇది శ్రీమహాభారతమందలి సౌప్తికపర్వమునందు
ప్రథమాశ్వాసము

---

## ద్వి తీ యా శ్వా స ము

---

దేవా! హరిహరనాథా! వైశంపాయన మునీంద్రుడు జనమేజయమహారాజును జూచి యిట్లనెను. జనమేజయ మహారాజా! ఈ ప్రకారముగా భారతయుద్ధము పదునెనిమిది దినముల వరకు జరిగెను. పదునెనిమిదవ దినమున రాత్రికాలమందు అశ్వత్థామ కృపాచార్య కృతవర్మలు ముగ్గురును పాండవ శిబిరములోనికి ప్రవేశించి

అట్లందరిని చంపివేసిరి. పదునెనిమిదవనాటి వేకువకాలమందు పం దొమ్మిదవనాటి సూర్యోదయమునకు పూర్వమందును దుర్యోధనుడు ప్రాణములను విడిచెను. పం దొమ్మిదవనాడు సూర్యోదయకాల మందు భీమార్జున నకుల సహదేవులు కృష్ణసాత్యకులును ఓఘవతీ తీరమందు ధర్మరాజును చుట్టుకొని సేవింపు చుండిరి. ఆ సమయమున ధృష్టద్యుమ్నునియొక్క సారథి పాండవ శిబిరములోనుండి ధర్మరాజు వద్దకు వెళ్ళెను. ధృష్టద్యుమ్నునియొక్క సారథి ధర్మరాజునకు సాష్టాంగనమస్కారము చేసి రెండు చేతులును ముకుచుకొని ధర్మ రాజుతో యిట్లనెను.

మహారాజా! ధర్మరాజా! గడచిన రాత్రి యొక్క నడిమి జామునందు అశ్వత్థామ మన శిబిరములోనికి ప్రవేశించెను. అశ్వ త్థామకు కృపాచార్య కృతవర్మ లిద్దరును సహాయముగా వచ్చి మన శిబిరము యొక్క ముఖద్వారమందు నిలిచి యుండిరి. అప్పుడు మన శిబిరములో నుండు జనులందరును నిద్రింపుచుండిరి. అప్పుడశ్వత్థామ యొక్కడే మన శిబిరములో ప్రవేశించి మొట్టమొదట ధృష్టద్యుమ్నుని చంపెను. పిమ్మట 'ఆతని తమ్ములగు వుత్తమోజుని యుధామన్యుని చంపివేసెను. ధృష్టద్యుమ్నుని కుమారులగు పాం చాలుర నందరిని అన్యాయముగాచంపెను. దుర్మార్గుడగు అశ్వత్థామ మన చేదిదేశపు బలములను, మత్స్యదేశపు బలములను ప్రభద్రక బలములు మొదలగు మన సకల సైన్యములను నిశ్శేషముగా చం పెను. ద్రౌపదీపుత్రులు అయిదుగురును శిఖండి సహాయము చేసు కుని అశ్వత్థామను యెదిరించిరి. ఆ ద్రౌపదీ పుత్రులను శిఖండిని వారి బలములను అశ్వత్థామ క్రూరముగా చంపెను. మన శిబిర మందుగల జనులందరును తల్లడిల్లు చుండగా అశ్వత్థామ వారి నంద రిని చంపెను. అశ్వత్థామను రాక్షసుడని తలచితిమేగాని అశ్వత్థామ

యని యెరుగము. మన శిబిరమందుగల యేనుగులను గుఱ్ఱములను జనులను అన్నిటిని, అశ్వత్థామ నరికివేసెను. అడవిని దహించు కార్చిచ్చువలె అశ్వత్థామ తనశక్తిచేత మన శిబిరములోని సకల జనులను యేనుగులను గుఱ్ఱములను నరికివేసెను. అశ్వత్థామ ధృష్టద్యుమ్న ద్రౌపదీ పుత్రులు మొదలగు యోధులను జంపి యితర జనులను చంపుటకు ఆక్రమించునపుడు జనులందరును పక్షుల గుంపులవలె అరచుచుండిరి. ఆ ధ్వని వినగా కార్చిచ్చు అడవిని దహించునపుడు పక్షుల ధ్వనివలె నుండెను. జనులందరును భయపడి అరచినను, పారిపోయినను, ప్రార్థించినను, తొలగిపోయినను కొంచెమైనను దయలేక అశ్వత్థామ ఆ జనుల గుంపులలో దూకి తన కత్తిచేత అందరిని నరికివేసెను.

ఆ సమయమున కొందరు రాజులును సైనికులును జనులును అశ్వత్థామ యెదుట పడక మన శిబిర ద్వారములో నుండి వెళ్ళుచుండిరి. అట్లు వెళ్ళుచు ద్వారమందున్న కృపాచార్య కృతవర్మలను శరణు జొచ్చిరి. శరణు జొచ్చినను కృపాచార్య కృతవర్మలు దయతప్పి ఆ జనులనందరిని బాణములచేత చంపిరి. మన శిబిరములోవలెనే వారుండుచోట పీనుగు పెంటలాయెను. మన శిబిరమందును ద్వారమందు పీనుగుపెంటలైపడి యుండెను. అశ్వత్థామ కృపాచార్య కృతవర్మలు ముగ్గురును రౌద్రాకారములను దాల్చియున్నట్లు పరాక్రమించిరి. ఇట్లు అశ్వత్థామాదులగు ముగ్గురిచేతను, మన శిబిరములోనుండు సకల జనులును, యేనుగులును, గుఱ్ఱములును నిశ్శేషముగా నశించెను. నా కింకను కొంతవరకు ఆయుస్సు కలిగియున్నందున నేను కృతవర్మచేతిలో చిక్కియు, అతడు నన్ను విడిచి నందున బ్రతికి వచ్చితిని అని ధృష్టద్యుమ్నుని యొక్క సారథి ధర్మరాజుతో చెప్పెను. ఆ మాటలను ధర్మరాజు విని

మిక్కిలి దుఃఖముచేత పరితపింపబడి మూర్ఛిల్లి క్రిందకు వ్రాలెను. అప్పుడు అతిశీఘ్రముగా భీమ నకుల సహదేవ సాత్యకులు నలుగురును దుఃఖించుచు తమ అరచేతులచేత క్రిందపడకుండునట్లు ధర్మరాజును పట్టుకొన కొంతసేపునకు ధర్మరాజు మూర్ఛ తెలిసికొని గద్గద కంఠ ధ్వనితో యిట్లని దుఃఖించెను.

## ధర్మరాజు తనపుత్రులు అశ్వత్థామచే జచ్చుటవిని విలపించుట

అయ్యో! దైవమా! యెంతవారలకైనను కార్యములయందు గలుగు మేలు కీడులు తెలియవు. ఈ పదునెనిమిది దినములనుంచి కౌరవులతో ఘోరయుద్ధము చేసితిని. ఆ యుద్ధమందు శత్రువుల నందరిని చంపి నేను విజయమును పొందితిని. విజయమును పొంది అధిక వైభవముతో యిక్కడకువచ్చితిని. నా శిబిరములో నాబంధు మిత్ర పుత్రసేనలుండెను. వారందరును నిద్రించునపుడు కుత్సిత మార్గముగా అశ్వత్థామాదులు ముగ్గురును చంపిరి. నాకు విజయము కలిగినప్పుడు యిట్లే నాకు మరల అపజయము కలిగెను. అని జను లందరు చెప్పుకొందురు. అయ్యో! దైవమా! నా కొడుకులగు ద్రౌపదీ పుత్రులైదుగురును తమ బాణాగ్నులచేత శత్రుసైన్యములను అడవులను దహించిరి. ఈపదునెనిమిది దినములనుండి క్రీడించు విధ ముగా శత్రుసైన్యములతో పోరాడిరి. ద్రోణాచార్యుడను నగ్నిలో చిక్కుపడక తప్పించుకొని బ్రతికిరి. ఇట్టి ద్రౌపదీ పుత్రులైదుగురిని తుద కాదైవము యిట్లు చంపివేసెను. అయ్యో! దైవమా! కర్ణుడు పెద్దపులివంటివాడు. కర్ణుని బాణములు పులిగోరులవంటివి. కర్ణుడు తన బాణములచేత సైన్యములను చంపెను. అట్టికర్ణుని గెల్చితిని. బలహీనులగు అశ్వత్థామాదులచేత తుదకు ద్రౌపదీ పుత్రులందరును చచ్చిరి. ఇక నేనేమని చెప్పుదును? నామనస్సు ఆపదవలన కలిగిన

దుఃఖముచేత పరితపించుచున్నది. అయ్యో ! దైవమా ! భీష్ముడు మహాసముద్రమువలె నున్నాడు. అతని బాణసమూహములు అలల వంటివి. భీష్ముడు మిక్కిలి ఆశ్చర్యముగా సముద్రము పొంగివచ్చి నట్లు నామీదకువచ్చెను. అట్టి భీష్మునకు భయపడక ద్రౌపదీ పుత్రు లందరును కష్టపడి యుద్ధముచేసిరి. ఆ ద్రౌపదీపుత్రులు భీష్ముడను మహాసముద్రమును యీది తుదకు అశ్వత్థామ యను చిన్ననది యందుపడి చచ్చిరి. అయ్యో! కుమారులగు ద్రౌపదీ పుత్రులు నిద్రచేత బలహీనులైరి. అంతట ద్రౌపదీ పుత్రులను అశ్వత్థామ కృపాచార్య కృతవర్మలు ముగ్గురును అన్యాయముగా చంపిరి. అయ్యో ! దైవమా ! నాశిబిరములోనుండు నాపక్షపురాజులు అనేక బలవంతులగు అనేక శత్రురాజులను యుద్ధమందు గెలిచిరి. తుదకు బలహీనులగు అశ్వత్థామాదులచేత రాజులందరును చచ్చిరి.

అయ్యో ! సముద్రమునుదాటి చిన్న కాలువయందుపడి చచ్చి నట్లు నాపక్షపురాజులును, బలములును, ద్రౌపదీ పుత్రులును చచ్చి పోయిరి. అయ్యో ! దైవమా ! తన తండ్రియగు ద్రుపదుడు చచ్చి నందుకే ద్రౌపది మిక్కిలి దుఃఖించుచుండెను. ఇప్పుడా ద్రౌపది యొక్క కొడుకులును, అన్నదమ్ములును చచ్చిరి. ఈ వృత్తాంతమును ద్రౌపది విన్నయెడల గొప్పదుఃఖమువలన కలిగిన మూర్ఛయందు మునుగును. ఆ విచారముచేత ద్రౌపది చచ్చునేమో తెలియదు. అట్లుగాక మూర్ఛ తెలిసి లేచినను అపరిమితమైన విచారములో నుండును. అయ్యో ! యిట్టి మహాదుఃఖమును యిదివరకు ద్రౌపది అనుభవింపలేదుకదా ! యీ దినమందు ద్రౌపది యీ విచారముచే ఏమగునో తెలియదు. అని విచారించుచు ధర్మరాజు విచారముతో కూడిన మాటలను చెప్పుచు ద్రౌపదిని రప్పించుటకు తలచెను.

జనమేజయ మహారాజా ! ద్రుపదుడును, ద్రుపదుని కుమారు లగు ధృష్టద్యుమ్నాదులను యుద్ధభూమిలోనుండు పాండవశిబిరము

నకు వచ్చునప్పుడు వారివెంటనే ద్రౌపదియు ఆ పాండవ శిబిరమునకు వచ్చియుండెను. ఆమె వెంటనే ఆమెయొక్క కోడండ్రందరును పాండవశిబిరమునకు మొదటనే వచ్చియుండిరి. పిమ్మట కొన్ని దినములకు సుభద్రాదేవి పాండవశిబిరమునకు వచ్చి అందుండు ద్రౌపదిని ఆమె కోడండ్రనుచూచి అక్కడనేయుండెను. పిమ్మట ద్రుపదవిరాట రాజులిద్దరును యుద్ధమందుచచ్చిరి. వారు చచ్చిన మరునాడు వారియొక్క స్త్రీలకు దుఃఖశాంతిని కలిగించుటకై ధర్మరాజుయొక్క అనుమతిమీద ద్రౌపది మత్స్యపట్టణమునకు వెళ్లెను. ఆమె వెంటనే ఆమె కోడండ్రును ఆవిరాటరాజు పట్టణమగు మత్స్యపట్టణమునకు వెళ్ళిరి. అప్పుడే సుభద్రదేవియు అర్జునుని అనుమతినిపొంది ద్వారకా పట్టణమునకు బోయెను. ద్రౌపది పాంచాల పట్టణమునకుబోయి తన తల్లులు మొదలగు వారినాదరించి విరాటుని మత్స్యపట్టణమునకు జేరెను. సుభద్రాదేవి అచ్చటనుండి ద్వారకకు వెళ్ళెను. అందువలన ధర్మరాజు ద్రౌపది మత్స్యపట్టణమందుండునని తలచి నకులునిజూచి యిట్లనెను.

నకులుడా! యిప్పుడు ద్రౌపది విరాటరాజు పట్టణమగు ఉపప్లావ్యమందుండును. నీవు యిప్పుడు మంచి వడిగా నడుచు గుర్రములను రథమునకు పూన్పించి అతివేగముగా వెళ్ళుము. ద్రౌపదిని తక్కిన స్త్రీలను, ద్రుపద విరాట స్త్రీలను, వారి కోడండ్రను, అందర స్త్రీలను వెంట బెట్టుకొని మన శిబిరమునకు జేరుము. మేమందరము యిక్కడనుండి వెళ్ళి మన శిబిరములో ప్రవేశించి యుండెదము. నీవు వేగముగా వెళ్ళి ద్రౌపది మొదలగు స్త్రీలను మన శిబిరమునకు తీసికొనిరమ్ము. అని ధర్మరాజు నకులునితో జెప్పెను. నకులుడు ధర్మరాజు చెప్పిన ప్రకారము వడిగల గుర్రములనుపూన్చిన రథమెక్కి ఉపప్లావ్య పట్టణమునకు వెళ్లెను. నకులుడు అట్లు వెళ్ళిన

పిమ్మట ఆ ఓఘవతీ నదీతీరమునుండి ధర్మరాజు బయలు దేరెను. ధర్మరాజు వెంట భీమార్జున సహదేవులును, కృష్ణ సాత్యకులును, విచారించుచు బయలుదేరి ధర్మరాజు వెంబడి వచ్చుచుండిరి. అప్పుడు కౌరవ శిబిరమందున్న జనులు ధర్మరాజును సేవించుచు వారును ధర్మ రాజు వెంబడి వచ్చిరి. ఇట్లు ధర్మరాజు ఓఘవతీ నదీతీరమునుండి బయలుదేరి తన శిబిరమునకు వెళ్ళెను. ఆశిబిరమునందు అశ్వత్థామ కత్తిచేత నరుకబడి చచ్చిన రాజులను, సైనికులను, స్నేహితు లను, బంధువులను, పుత్రులను, అందరిని ధర్మరాజుచూచెను. అట్లు చచ్చిపడిన వారిని చూచి ధర్మరాజు విచారముచేత మూర్ఛిల్లి క్రిందపడెను. ధర్మరాజు మూర్ఛిల్లిన వెంటనే భీమార్జున సహదేవు లును, కృష్ణుడును విచారముచేత మూర్ఛిల్లి క్రిందపడిరి.

ఇట్లు ధర్మరాజాదులందరును మూర్ఛిల్లి క్రిందపడినప్పుడు సాత్యకియొక్క ప్రయత్నమువలన వారందరును తిరిగి లేచిరి. ధర్మ రాజు మూర్ఛ తెలిసినను మరల దుఃఖములో మునిగినవాడై నిశ్చే ష్టుడై తన కొడుకులగు ద్రౌపదీ పుత్రుల దేహములను తాకి చూచు చు కన్నీరుగార్చుచు పెద్దగా ఏడ్చుచు విచారముతో గూడిన మాట లను పలుకుచుండెను. ద్రౌపదీ పుత్రులను చూచి ఏడ్చుచున్న ధర్మ రాజును తగిన మాటలచేత అతనికి దుఃఖశాంతిని కలిగించిరి. కొంత సేపటికి ధర్మరాజు ఏడుపు చాలించి తన కొడుకులగు ద్రౌపదీపుత్రు లకును ధృష్టద్యుమ్నాది బంధుజనులకును, మిత్రులకును, అందరి దేహములకును అగ్నికార్యములు చేసి దుఃఖించుచుండెను. ఇట్లు ధర్మరాజు అగ్నిసంస్కారములుగావించి ఒకచోట కూర్చుండి ద్రౌపది కొరకై చూచుచుండెను. ఇక ద్రౌపదియొక్క సమాచార మును చెప్పెదను వినుము.

ఓజనమేజయ మహారాజా! ధర్మరాజుపంపున నకులుడు అతి వేగముగా ఉపప్లావ్యపట్టణమునకు వెళ్లెను. దృష్టద్యుమ్నుడు మొద

లగు పాంచాలురు చచ్చిన విధమంతయు నకులుడు ద్రౌపదితో జెప్పెను. ద్రౌపది తన కొడుకులు చచ్చినందుకు మిక్కిలి దుఃఖించుచు నోరు ఎండునట్లు ఏడ్చుచు బొటబొట కన్నీరు కార్చుచు మూర్ఛిల్లి రథముమీద వ్రాలుచు మరల మూర్ఛ తెలియుచు వచ్చెను. ద్రౌపది దుఃఖించు పద్ధతి జూచి నకులుడు విచారించుచు వచ్చెను. ద్రౌపది వెంబడి తక్కిన స్త్రీలును, పాంచాల స్త్రీలును, విరాటుని స్త్రీలును, వారివారి బంధువుల స్త్రీలును తగినవాహనముల మీద నెక్కి పాండవ శిబిరములకు వచ్చిరి. ద్రౌపది దూరముగానే యుండి మిక్కిలి విచారముతో ధర్మరాజునుజూచి యేడ్చుచుండెను. నకులుడు వేగముగా ద్రౌపదిని రథముమీదనుండి క్రిందకు దించెను. ద్రౌపది వెంబడి వచ్చిన మత్స్యపాంచాలాది రాజస్త్రీలందరును వారివారి వాహనములమీద నుండి దిగిరి. ఆ వనితా జనసంఘము లన్నియు ద్రౌపది చుట్టురు గూర్చుండి యేడ్చుచుండిరి. ద్రౌపది ముఖమందు కన్నీరు కారుచుండగా ఆమె ముఖము మంచుగమ్మిన తామర కమలమువలె నుండెను. ద్రౌపది తన కొడుకులను తలంచుకొని యేడ్చుచు కాళ్ళు తొట్రుగిలబడ దైన్యముతో కొన్ని యడుగులు నడచి మూర్ఛిల్లి క్రింద వ్రాలెను. అంత భీముడు శీఘ్రముగా ద్రౌపదినిపట్టి యెత్తి ధర్మరాజు దగ్గరకు తీసికొనివచ్చెను. ద్రౌపది మరల క్రిందపడి ధర్మరాజు ముఖముజూచి గద్గద కంఠముతో యిట్లనెను.

ధర్మరాజా! నీకు దైవ మానుష బలములు రెండును కలిగి యున్నందున నీకు రాజ్యసామ్రాజ్యము లభించెను. నీవు రాజ్యలక్ష్మిని అనుభవించునపుడు నీదగ్గర నాకొడుకులుండగా నేను చూచుటకు తగిన పుణ్యము చేయలేదు. సుభద్రకొడుకగు అభిమన్యుడు అపరిమితమైన బలవంతుడగును. వాడును యిదివరకే యుద్ధమందు చచ్చి

పోయెను. నీకు రాజ్యసుఖము కలిగినను కుమారులను మరచుటకు శక్యముకాదు. అని ద్రౌపది ధర్మరాజుతో చెప్పెను. అప్పుడశ్వత్థామ చేసిన క్రూర పాపకార్యము ద్రౌపది మనస్సును పరితపింప జేసెను. ద్రౌపది పరితాపముచేత మిక్కిలి కోపముగలదై, మరల శాంతిగలదై లేచి కూర్చుండి ధర్మరాజుతో యిట్లనెను.

ధర్మరాజా. పాపాత్ముడగు అశ్వత్థామ నా కుమారులు గాఢనిద్రను పొందియుండగా అక్రమముగా చంపెను. ఆ దుఃఖాగ్ని చల్లారకుండా నామనస్సు దహించుటకు ప్రారంభించినది. నా మనో పరితాపము పోవుటకు ఒక్కఉపాయము కలదు. వేరొక వుపాయము వలన కానేరదు. అది యెట్లనగా చెప్పెదను వినుము. పాపాత్ముడైన అశ్వత్థామను చంపుటయే నా దుఃఖము నివర్తించుటకు తగు వుపాయము. నేను భీముని పంపించి యీ దినమందు అశ్వత్థామను చంపించెదను. అట్లు నేను అశ్వత్థామను చంపించనియెడల ప్రాయోపవేశముచేత నా ప్రాణములను వదలెదనుసుమా! అని ద్రౌపదీదేవి ధర్మరాజుతో చెప్పెను. ఆ మాటను ధర్మరాజు విని ద్రౌపదీదేవితో యిట్లనెను.

ద్రౌపదీ! రాజపుత్రులగువారు యుద్ధమందు చచ్చుట మంచిదేగదా! నీ పుత్రులగు ప్రతివింద్యాదులు అయిదుగురును, నీ సోదరులగు ధృష్టద్యుమ్నాది పాంచాలురను యుద్ధమందు చచ్చి పుణ్యాత్ములు పొందు పుణ్యగతులను పొందిరి. వారిని గురించి మనసున అధికముగ దుఃఖింపరాదు. నీవు బుద్ధిశాలివి. నీవు శాంతమును పొందవలయును. దుఃఖమును విడువుము. అశ్వత్థామ చేసిన అవమానమువలన కలిగిన కోపముచేత అశ్వత్థామను చంపవలెననియు, వానిం చంపనియెడల యీ దుఃఖము నివర్తింప దనియును జెప్పితివి. నా అభిప్రాయముకూడా ఆప్రకారమే కలిగియున్నది. అశ్వత్థామ

అడవియందు కలసిపోయినట్లు నాకు తోచుచున్నది. అతని నెట్లు చంపనగునో నీవే చెప్పుము. అని ధర్మరాజు చెప్పగా ఆ మాటలను ద్రౌపది విని ధర్మరాజుతో యిట్లనెను. ధర్మరాజా! పాపాత్ముడైన అశ్వత్థామకు సహజమైన శిరోరత్నము గలదు. అశ్వత్థామ శిరస్సు యందు సహజముగా పుట్టియున్న రత్నమును తెచ్చి నా కిచ్చిన యెడల ఆ రత్నమును చూచి నేను బ్రతికెదను. అని నేను తలచి తిని. అని కఠినాక్షరములతో ద్రౌపది ధర్మరాజునకు చెప్పి తన అర చేతిచేత భీముని తాకి భీమునితో యిట్లనెను.

## ద్రౌపది అశ్వత్థామను పరిభవింప భీముని నియోగించుట

భీమా! రాజధర్మమును మనస్సునందు తలచి నీవు వేగ ముగా వెళ్ళి పాపాత్ముడైన అశ్వత్థామను యెదిరించి చంపుము. అప్పుడు నా మనస్సునగల కోప దుఃఖములు నివర్తింపగలవు. నా కోపదుఃఖములను పోగొట్టి నన్ను రక్షింపుము. భీమా! లక్కయిండ్లు కాలినపుడు నీవు చూపిన పౌరుషముతో కూడిన యెదిరింపును యిప్పు డశ్వత్థామమీద చూపుము. పూర్వము నీవు హిడింబాసురుని జంపునపుడు చూపిన క్రూరత్వముతో నిప్పు డశ్వత్థామమీదికి వెళ్ళుము. పూర్వము నిన్ను యక్షులు బంధించినపుడు నీవు చూపిన భుజాబలదర్పము లీ యశ్వత్థామపై జూపుము పూర్వము కీచకుడు నిన్ను యెదిరించినప్పుడు నీకుగల పరాక్రమముతో యిప్పు డశ్వ త్థామమీదకు వెళ్ళుము. ఇప్పుడు నీవు చూపబోవు బలపరాక్రమ శౌర్య ధైర్యములను జూచి జనులందరు ఆశ్చర్యపడునట్లు అశ్వ త్థామమీదకు వెళ్ళుము. అశ్వత్థామను చంపుము. పాపాత్ముడైన అశ్వత్థామ తాను ఘనులను గెలిచితినని గర్వముతో నుండును. ఎట్లయినను, అశ్వత్థామను నీవు అవమానింపవలయును. అని

ద్రౌపదీదేవి భీమునితో చెప్పెను. ద్రౌపదీదేవి మాటలను వినిన వెంటనే భీమున కమికమైన కోపము అశ్వత్థామమీద కలిగెను. కోపమువలన దేహ ముప్పొంగెను. అంతకుముందు ద్రౌపదితో ధర్మరాజు చెప్పిన మాటలు తనకు ఆజ్ఞగా దలంచి భీము డశ్వత్థామమీదికి వెళ్లుటకు ప్రయత్నించెను. అంత నకులునితో యిట్లనెను.

నకులుడా! బంగారముచేతను, రత్నములచేతను, దేదీప్యమానముగా ప్రకాశించు రథమునకు గుర్రములను పూన్చుము. నీవు రథమునకు సారథ్యముచేయుము. అని భీముడు నకులునితో చెప్పెను. నకులుడు అధికోత్సాహముచేత ప్రకాశింపుచు గొప్ప బలవేగముగల గుర్రముల నొకరథమునకు పూన్పించి తాను సారథియాయెను. ఇట్లు భీముడు తనకు సారథిగా నకులుడుండగా, ధనుర్బాణ గదాదండాది నానావిధ ఆయుధసహితముగా నున్న రథముమీద యెక్కెను. భీము డతివేగముగా రథమును తోలించి తమ శిబిరములోనుండి వేగముగా వెడలెను. భీముడు కృపాచార్య కృతవర్మ అశ్వత్థామల రథములు పోయిన మార్గపు గురుతులను కనిపెట్టి రథము తోలించుచు వెళ్ళెను. ఆ మార్గము వెంబడి భీముడు రథమును తోలించి కురుక్షేత్రమునకు పోయి అచ్చట సంచరించు జనులతో యిట్లనెను. జనులారా! అశ్వత్థామ యెక్కడనుండునో మీరు యెరిగిన చెప్పుడు. అని అడుగగా ఆ జనులు భీమునితో యిట్లనిరి.

మహాత్మా! భీమా! అశ్వత్థామ కృపాచార్య కృతవర్మలు ముగ్గురును హస్తినాపురమువైపు ఆమార్గముగా కొంతవరకు వెళ్ళిరి. అక్కడనుండి మరలి కొంతదూరమువరకు అశ్వత్థామాదులు ముగ్గురును పోయిరి. కృపాచార్య కృతవర్మ లిద్దరును అశ్వత్థామతో పోక మరియొకస్థలమునకు యెక్కడకో పోయిరి. అశ్వత్థామ ఒకడు

మాత్రము వేదవ్యాసమునీంద్రుని ఆశ్రమమునకు వెళ్ళి అక్కడున్నాడు. అని కురుక్షేత్రమందు సంచరించు జనులు భీమునితో చెప్పిరి. ఆమాటలను భీముడు స్పష్టముగా విని వేదవ్యాసమునీంద్రుని ఆశ్రమవైపు రథమును తోలునట్లు నకులునకు చెప్పెను. నకులుడు వ్యాసమునీంద్రుని ఆశ్రమమువైపు రథమును అతివేగముగా తోలుచుండెను. భీముడు పాండవశిబిరములోనుంచి అశ్వత్థామ మీాదకు వెళ్ళిన పిమ్మట కృష్ణుడు ధర్మరాజుతో యిట్లనెను.

ధర్మరాజా! భీముడు అధికకోపముగలవాడై విచారముతో అశ్వత్థామను యెదిరించుటకు మిక్కిలి వేగముగా వెళ్ళుచున్నాడు. భీముడు ఒంటరిగా అశ్వత్థామ మీాదకు పోయిన యెడల కార్యము తప్పిపోవును. నీ తమ్ములలో అందరికంటె భీమునియందు నీవు అధికమైన ప్రేమను కలిగియుందువు గనుక మీారందరును అశ్వత్థామ మీాదికి యుద్ధమునకు పోవుటవలన మేలు కలుగును. అదియెట్లనగా చెప్పెదను వినుము. ధర్మరాజా! సకల భూమిని భస్మమగునట్లుచేయు బ్రహ్మశిరమను దివ్యాస్త్రమును ద్రోణుడు అశ్వత్థామకు యిచ్చెను. పిమ్మట ఆ ద్రోణుడే ప్రేమాధిక్యతచేత ఆ బ్రహ్మశిరమను దివ్యాస్త్రమును అర్జునునకు యిచ్చెను. అశ్వత్థామ అర్జునునియందు మాత్సర్యముగలవాడై అర్జునుని బలయుద్ధసమర్థత్వములకు అసహ్యపడుచుండెను. అశ్వత్థామకు అర్జునునియందు మాత్సర్యము కలదని ద్రోణుడు యెరిగి పాండవులమీాద బ్రహ్మశిర దివ్యాస్త్రమును అశ్వత్థామ ప్రయోగింప కుండవలెనని తలచెను. బ్రహ్మశిరమను పేరుగల దివ్యాస్త్రము మనుష్యులమీాద ప్రయోగింపరాదని ఒక నియమముగలదు. ధర్మవేత్తయగు ద్రోణుడు అటులాలోచించి ఒకనాడు అస్త్రవిద్యా సంభాషణ విషయములో అశ్వత్థామతో యిట్లనెను. కుమారా! నీవు బ్రహ్మశిరమను దివ్యాస్త్రమును మనుష్యుల

మీాద ప్రయోగించితివేని అశుభము కలుగును. అట్లు నీవు ప్రయోగింపకుము. నీకు యెన్ని గొప్ప ఆపదలు వచ్చినను, వాటిని యితర సాధనలచేత నివారింపుము. అని ద్రోణుడు తనపుత్రుడగు అశ్వత్థామతో చెప్పెను. ఆ మాటలను అశ్వత్థాను విని తనమనస్సున మీాయందుగల మాత్సర్యము అవశ్యముగా తలంపున బెట్టెను. నాతడు మనస్సునగల అభిప్రాయమును ద్రోణుడు యెరిగి అతండు వినుచుండగా అక్కడున్న వారితో యిట్లనెను.

జనులారా! అశ్వత్థామ ఎన్నివిధములుగా జూచినను సత్పురుషులు ప్రవర్తించు ధర్మమార్గమున ప్రవర్తింపబడు. ఇట్టి చెడుబుద్ధి గలవాడు నాకడుపున పుట్టెను. అని ద్రోణుడు తనపుత్రుడు వినుచుండగా అక్కడున్న జనులతో చెప్పెను. ఆద్రోణుని మాటలకు నాతడు విచారమును బొందెను. గాని ద్రోణుడు చెప్పినట్లు ప్రవర్తించుటకు సమర్థుడుగాడు. ధర్మరాజా! ద్రోణసుతునకు మరియొక దురహంకారముగలదు. ఆ విషయమును చెప్పెదను వినుము. ధర్మరాజా! అశ్వత్థామ తాను చిరంజీవిననియు, శివుని వరప్రసాదమువలన పుట్టితిననియు యీా దురహంకారము అశ్వత్థామకు మెండుగాగలదు. దివ్యాస్త్రశస్త్రవిద్యా రహస్యమునకు అగస్త్య మహాముని మూలకారణుడు. అగస్త్యునిచేత ద్రోణుడు బ్రహ్మశిరమను దివ్యాస్త్రమును పొందెను. ఆ దివ్యాస్త్రము తనకు కలదని అతడు మిక్కిలి దురహంకారమును గలిగియున్నాడు. ఆ బ్రహ్మశిరమను దివ్యాస్త్రము సకల దేవ రాక్షస మనుష్య లోకములను భస్మమగునట్లు చేయగలదని అశ్వత్థామ తలచుచుండును. ఇట్టి మహాదురహంకారము అతకిని కలదు.

ధర్మరాజా! అందువలననే మీారు అరణ్యావాసముచేయుచు అడవియందున్నప్పుడు అశ్వత్థామ మా పట్టణమగు ద్వారకకు

వచ్చెను. అశ్వత్థామ యాదవ కుమారునితో వినోదములను జేయుచు ఒకనాడు నేను ఒంటరిగా నున్నప్పుడు నాదగ్గరకువచ్చి నవ్వుచు నాతో యిట్లనెను. కృష్ణా! నాతండ్రియగు ద్రోణుడు అగస్త్య మహాముని గురించి గొప్పతపస్సుచేసెను ఆ తపస్సునకు అగస్త్యుడు సంతోషించి బ్రహ్మశిరమను దివ్యాస్త్ర రత్నమును మాతండ్రి కిచ్చెను. ద్రోణుడు బ్రహ్మశిర దివ్యాస్త్రమును ప్రీతిపూర్వకముగా నాకు యిచ్చెను. ఆ బ్రహ్మశిర దివ్యాస్త్రమును నేను నీకు యిచ్చెదను. నీ చక్రాయుధమును నీవు నాకు యివ్వవలయును. అని నాయందు మిక్కిలి మాత్సర్యము గలవాడై యడిగెను. అతని మాత్సర్యబుద్ధి నేను యెరుగుదును. అందువలన వాడడిగిన చక్రా యుధమునేగాక నాచక్ర గదాఖడ్గాయుధములనుజూపి ద్రౌణితో యిట్లంటిని.

అశ్వత్థామా! యీ ఆయుధములలో నీవు ధరించుటకు శక్య మైన ఆయుధములను ధరింపుము. నీ బ్రహ్మశిర దివ్యాస్త్రమును నాకు యివ్వవద్దు. నీవు నాకు స్నేహితుడవు. స్నేహితునకు ఒక వస్తువునిచ్చి మారుగా మరియొక పదార్థమును గ్రహించుటయును పురుషార్థముకాదు. బ్రహ్మశిర దివ్యాస్త్రమును నాను యివ్వక ఈ ఆయుధములలో నీకు కావలసినవి తీసికొనుము. అని నేను అత తనితో చెప్పితిని. అశ్వత్థామ నా సుదర్శనమనుపేరుగల చక్రా యుధమును కావలెనని కోరెను. దానిని నేను తీసికొమ్మని అశ్వత్థా మతో చెప్పితిని. అందుకు మూఢుడగు అశ్వత్థామ సంతోషించుచు తనయెడమచేత నా చక్రాధమును పట్టుకొని యెత్తగా ఆ చక్రా యుధము కదలలేదు. అప్పుడతడు తనకుడిచేత పట్టుకొని యెత్తినను ఆ చక్రాయుధము కదలలేదు. అంతట అశ్వత్థామ తన రెండుచేతుల చేతను పట్టుకొని తన యావచ్ఛక్తిని జూపి యెత్తినను చక్రాయు

ధము కదలలేదు. అట్లు చక్రాయుధమును యెత్తజాలక అశ్వత్థామ డస్సెను. ఆయశ్వత్థామతో అప్పుడు నేనిట్లంటిని.

అశ్వత్థామా! పూర్వము నేను రుక్మిణీదేవి సహితముగా వెళ్ళి హిమవత్పర్వతముమీద పండ్రెండు సంవత్సరములవరకు మిక్కిలి గొప్పదైన బ్రహ్మచర్య వ్రతమునుబూని గొప్పతపస్సును చేసితిని. ఆ తపోబలమువలన యీ చక్రాయుధమును పొందితిని. సకల దేవరాక్షస గంధర్వాది సకల భూతములును నన్ను గెలువ జాలకుండునట్టి గొప్పభుజబలమును కలిగియున్నాను. ఈ చక్రాయుధము యింత మహాత్మ్యముగలది. బలరాముడును ప్రద్యుమ్నుడును. సాంబుడు మొదలగు యాదవ శ్రేష్ఠులందరును యింతకు ముందు యీ చక్రాయుధము నిమ్మని నన్ను అడుగలేదు. అర్జునుడు తన తపోబలమువలన గాండీవమను దివ్యధనుస్సును. దివ్యములగు తెల్లని గుర్రములును దివ్యరథమును, దివ్యకపిధ్వజమును యివియన్నియు పొందియున్నాడు. దివ్యసాధనములను పొందిన అర్జునుడు రుద్రునితో మహాయుద్ధముచేసి రుద్రుని మెప్పించి ఆ రుద్రునివలన పాశుపతాస్త్ర మను దివ్యాస్త్రమును పొందెను. నా ప్రాణములకంటె అర్జునుడు నాకు అధికస్నేహితుడు. ఆతడు దేవసముడు. అర్జునునకు నేనివ్వ కూడని వస్తువులేదు. అట్టి అర్జునుడెన్నడును తనకు నీ చక్రాయుధ మిమ్మని యడుగలేదు. నీ తండ్రియగు ద్రోణుడు భరతవంశస్థులకు ఆచార్యుడు. నీవు ఆద్రోణాచార్యుని పుత్రుడవు. సకలజనులచేతను పూజింపదగినవాడవు. అంతగొప్పవాడవైయుండి యెరుగక యీ చక్రాయుధమును యిమ్మని యడిగితివి. ఎవ్వరితోయుద్ధము చేయ దలచి యీ చక్రాయుధమును అడిగితివో. చెప్పుము అని నేను అశ్వత్థామను అడిగితిని. అప్పుడు అతడు నాతో యిట్లనెను.

కృష్ణా! నీ చక్రాయుధము సర్వజన ప్రసిద్ధమైనది యగును. ఆ చక్రాయుధము నీవలన నేను తీసికొని పిమ్మట నీపాదసేవచేసి

మైనను నిన్ను యుద్ధమునకు రప్పింపవలచితిని. నన్ను యుద్ధమునకు రప్పించి ప్రీతిపూర్వకముగా నీతో యుద్ధముచేసి నీకు ఓడిపోక సకల జనులచేతను స్తుతింపబడగలను. ఇందుకొరకై నీ చక్రాయుధ మును కోరితిని. నావద్దనున్న అటువంటి ఈ చక్రాయుధమును నీవే ధరింపుము. నాకిది లేకున్నను లోపములేదు. ఎట్లయినను నీతో యుద్ధముచేసెదను. అదితప్పదు. అని అశ్వత్థామ నాతో చెప్పెను. అతని మాటలకు నవ్వుచు నేను నీయిష్టప్రకారము చేయమని చెప్పి తిని. అంత ద్రోణాచార్యుని పుత్రుడను గౌరవముచేత అతనికి గొప్ప గుర్రములను, గొప్ప వెలగల రత్న ఆభరణములు వస్త్రములు మొద లగునవి బహుమానముగా యిచ్చి పంపితిని. నేనిచ్చిన బహుమాన వస్తువులను తీసికొని అశ్వత్థామ వెళ్లెను. అట్టి మహామదహం కారము అశ్వత్థామకు కలిగియున్నది. మహామదహంకారమునకు కారణము బ్రహ్మశిరమను దివ్యాస్త్రము. అది కలిగియున్నందున అశ్వత్థామ మిక్కిలి గర్వియై క్రూరదృష్టికలిగి యున్నందున అట్టి వానిచేత భీముడు బాధింపబడకుండ నుండవలయును. అని కృష్ణుడు ధర్మరాజుతో చెప్పి సాత్యకి సహదేవులను చూచి, యిట్లనెను. సాత్యకి సహదేవులారా! మీరిద్దరు యీ శిబిరములో నిలిచి యుం డుడు. మేము అశ్వత్థామ మీదికి యుద్ధమునకు వెళ్లెదము. అని కృష్ణుడు సాత్యకి సహదేవులతో చెప్పి వారిద్దరిని శిబిరమందు నిలిపెను.

## ధర్మరాజార్జున కృష్ణులు అశ్వత్థామమీదికి పోవుట

ఓజనమేజయమహారాజా ! ఇట్లు కృష్ణుడు సాత్యకి సహ దేవుల నిద్దరను పాండవ శిబిరమందు నిలిపి తమ రథమును యుద్ధ సన్నాహ సహితముగనట్లు చేయించెను. ఆ కృష్ణుని రథమునకు

సైబ్య సుగ్రీవ మేఘపుష్ప వలాహకములను కృష్ణుని గుఱ్ఱములను పూన్పించెను. గరుడధ్వజము నెత్తించి ఆ రథమును ప్రకాశించునట్లు జేసెను. అందు సకల ఆయుధము లుండెను. అట్టి రథముయొక్క నొగలమీద కృష్ణుడు కూర్చుండెను. వెంటనే అర్జునుడు తన గాండీవ మును ధరించి తన రెండు అంబుల పొదులను తీసికొని యుద్ధసన్నాహము చేత ప్రకాశించుచు కృష్ణునియొక్క రథముమీద యెక్కెను. ధర్మరాజు కృష్ణుని రథముమీదయెక్కి కూర్చుండెను. ఇట్లు కృష్ణుని రథముమీద కృష్ణ ధర్మరాజార్జునులు ముగ్గురును యెక్కి దేవేంద్ర అశ్వినీ దేవతలవలె ప్రకాశింపుచుండిరి. కృష్ణుడు చురుకుబెత్తమును తీసికొని గుఱ్ఱములను తోలుచు సారథ్యము చేసెను. గుఱ్ఱముల వేగాతిశయముచేత రథము కొంతసేపటిలోనే భీముని రథముతో కలిసికొనెను. వేదవ్యాసమునీంద్రుని ఆశ్రమము గంగానదీతీరమందు కలదు. ఆ గంగానదీతీరమందు అశ్వత్థామ వుండునని తలచి భీముడు మిక్కిలి కోపముచేత రోయుచు తన రథమును ముందుగా నడిపించుచుండెను.

కృష్ణ ధర్మరాజ అర్జునులు ముగ్గురును నీవు ముందు వెళ్ళవద్దని భీమునితో చెప్పిరి. భీముడు ముందుగా తన రథమును నడిపించి గంగానదీతీరమునకు బోయి చూచెను. ఆగంగానదీ జలసమీపమందు మునులచేత సేవింపబడుచు వేదవ్యాసమునీంద్రు డుండెను. ఆ వేదవ్యాసుడు చుక్కలనడుమ ప్రకాశించు పూర్ణచంద్రునివలె ప్రకాశింపుచుండెను. ఆ వ్యాసమునీంద్రుని భీముడు చూచి అతని దగ్గరకు పోక అతని పాదములకు తన మనస్సులోనే నమస్కరించెను. భీముడు వ్యాసమునీంద్రుని చుట్టుప్రక్కలయందు చూచెను. అంతట ఒకచోట ద్రోణపుత్రుడు కనబడెను. అతడు తన దేహమందు విభూతి పూసికొని గొప్ప తపస్సుచేయువానివలె నుండెను.

ద్రోణసుతుని భీముడు చూచి తన ధనుస్సునకు నారెని సవరించుకొని గొప్పబాణమునుసంధించి కోపముచేత కనుబొమలు రెంటిని ముడుచు కొని యాతనితో పెద్దగా యిట్లనెను.

పాపాత్ముడా! అశ్వత్థామా! నీవు బ్రాహ్మణులలో నీచు డవు. క్రూరకర్ముడవు. కపటధర్మము గలవాడవు. నీవు మిక్కిలి పాపబుద్ధిచేత గడచిన రాత్రియందు మా శిబిరములో ప్రవేశించి నిద్రించువారి నందరిని చంపివచ్చితివి. ఇంత మహాపాపకర్మము చేసివచ్చి వెంటనే తపస్వివైతివి. ఇట్లు దాగియుండినను నీకు చావు తప్పదు. లే లెమ్ము. తపస్సుచేయుట చాలును. యుద్ధమునకు లేచి రమ్ము. అని భీముడు పండ్లుకొరుకుచు కఠినముగా నానితతో చెప్పెను. అశ్వత్థామ భీముని జూచి వాని వెనుకవచ్చు కృష్ణార్జున ధర్మరాజులను ముగ్గురిని చూచి విచారముగల మనస్సుతో యిట్లని తలచెను.

కృష్ణార్జునులు సకల దివ్యాస్త్రములను యెరిగినవారు. గడ చినరాత్రి నేను వీరిశిబిరములో ప్రవేశించి వీరి బంధుమిత్ర పుత్రులు మొదలగు వారినందరిని చంపితిని. ఆకోపముచేత నన్ను వీరు చంపు టకు వచ్చినారు అని అశ్వత్థామ తనమనస్సులోతలచి భయపడి ఒక గడ్డిపరకను తీసికొని బ్రహ్మశిరమను దివ్యాస్త్రమును తలచెను. ఆగడ్డిపరకయందు ఆ దివ్యాస్త్రమును ఆవహించి పాండవవంశము నశించుగాకయని క్రూరముగా చెప్పుచు రోషముచేత ప్రయోగిం చెను. అట్లు ప్రయోగించగా బ్రహ్మశిరమను దివ్యాస్త్రమునందు భయంకరమైన అగ్నిహోత్రము కలిగెను. ఆ యగ్నిహోత్రము యొక్క మంటల గుంపులు యేదిక్కుయందు చూచినను భయంక రముగా వ్యాపించియుండెను. బ్రహ్మశిర దివ్యాస్త్రమువలన కలిగిన ఘోరాగ్ని సకలలోకములను భస్మముచేయునట్టుగా అభివృద్ధియా

యెను. కృష్ణు డర్జునుని దివ్యాస్త్రమహిమ నెరిగియున్నందున అశ్వ త్థామయొక్క బ్రహ్మశిర దివ్యాస్త్రమునకు భయపడక అర్జునునితో యిట్లనెను.

అర్జునా! ఇది బ్రహ్మశిరమను దివ్యాస్త్రము. ఈదివ్యాస్త్ర మును మరియొక దివ్యాస్త్రముచేత నశింపజేయుటకు శక్యముగాదు. నీవును బ్రహ్మశిరదివ్యాస్త్రమును ప్రయోగించి యీతనియొక్క దివ్యాస్త్రశక్తినిమాన్పి నిన్నును నీసహోదరులను రక్షించుకొనుము. వేగమును వహింపుము. అని కృష్ణు డర్జునునితో చెప్పెను. అర్జునుడతి శీఘ్రముగా రథముదిగి నియమముచేత ద్రోణాచార్యుని స్మరించి ధనుస్సు తీసికొని మంత్రపూర్వకముగా బాణమును సంధించెను.

## అశ్వత్థామా అర్జునుల బ్రహ్మశిరోనామ కాస్త్రంబు లొండొంటిం దాకుట

జనమేజయ మహారాజా! అట్లు అర్జునుడు బాణమును సం ధించి యాద్రోణికి కీడుకలుగకుండ నుండవలెననియు, నాకును, నా అన్నదమ్ములకును శుభము కలుగవలెననియు పలికెను. అర్జునుడు పలికి, బ్రహ్మశిర దివ్యాస్త్రముయొక్క అధిదేవతకు నమస్కరించి నాబ్రహ్మశిర దివ్యాస్త్రమువలన అశ్వత్థామ ప్రయోగించిన బ్రహ్మ శిర దివ్యాస్త్రము ఉపశాంతిని పొందుగాక యనిచెప్పి బ్రహ్మశిర దివ్యాస్త్రమును ప్రయోగించెను. ఆ బ్రహ్మశిర దివ్యాస్త్రము ప్రళయకాలమందుగల భయంకరమైన అగ్నిహోత్రమువంటి జ్వాలా సమూహములను కలిగించి ఆకాశమంతయు తనమయముగా వ్యాపిం చెను. అట్లు వృద్ధిబొందిన అర్జునుని బ్రహ్మశిర దివ్యాస్త్రము. ద్రోణ సుతుని అస్త్రమును మరలించుటకు ఉత్సహించెను.

కాని యాతనియొక్క బ్రహ్మశిరదివ్యాస్త్రము మరలక అతి భయంకరముగా ఆకాశమందు అర్జునుని దివ్యాస్త్రముతో పోరుచుం

చుండెను. ఆ రెండు బ్రహ్మశిర దివ్యాస్త్రములును ఆకాశమందు వ్యాపించి అతి భయంకరముగా పోచుచుండెను. ఆ దివ్యాస్త్రముల ఆటోపమువలన సకలభూతములును భయభ్రాంతములాయెను. సముద్రములు ఘూర్ణిల్లెను. అనేక శతముల తోకచుక్కలు ఆకాశములో నుంచి క్రిందపడెను. సూర్యుడు కాంతిహీనుడై మాసెను. కులపర్వతములన్నియు గడగడ వడకెను. ఆకాశము మెరుపుల సహితముగా రాళ్ళవర్షము కురిసెను. భూచక్రమంతయు గిర్గిర దిరిగెను. పిడుగుల ధ్వనులు వినిపించుచుండెను. సకల జనులును ఆశ్చర్య భయములను పొంది నిశ్చేష్టితులైరి. ధర్మాత్ముడైన నారదమహాముని వేదవ్యాసుని దగ్గరకువచ్చి నిలిచెను. నారద వ్యాసమహాముని లిద్దరును అర్జున అశ్వత్థామల నిద్దరును శాంతచిత్తులను చేయదలచి నడుమ నిలిచియుండి వారిద్దరు వినునట్లుగా యిట్లనిరి.

అర్జున అశ్వత్థామలారా! యీ బ్రహ్మశిర దివ్యాస్త్రము సకలలోకములను దహింపజేయును. ఈ దివ్యాస్త్రమును మనుష్యుల మీద ప్రయోగింపరాదు. ఇదివరకు లోకమందు అనేక దివ్యాస్త్ర సంపన్నులు గతించిరి. మహాభుజబల శౌర్యవంతులు గతించిరి. వారెవ్వరును యీదివ్యాస్త్రమును మనుష్యులమీదప్రయోగింపలేదు. అని నారద వ్యాసమును లిద్దరును దివ్యాస్త్రములవలన గలిగిన అగ్నిజ్వాలాసమూహముల నడుమ నిర్భయముగానుండి అర్జున అశ్వత్థామలతో చెప్పిరి. నారద వ్యాసమును లిద్దరును సర్వధర్మములను రక్షించుచు సర్వలోక హితకార్యములను చేయుచుందురు. ఆ మహామునులు చెప్పిన మాటలను అర్జునుడు విని ఆకాలమునకు చేయదగిన అనుష్ఠానమును వూహించి మహామునులతో యిట్లనెను.

మహాత్ములగు నారద వ్యాసమునీంద్రులారా! ఈ పాపాత్ముడగు అశ్వత్థామ మొదట మామీద ఈ బ్రహ్మశిర దివ్యాస్త్రమును

ప్రయోగించెను. దానిని ఉపశాంతి జేయుటకై నేనును బ్రహ్మశిర దివ్యాస్త్రమును ప్రయోగింపవలసి వచ్చెనుగాని మరియొక తలంపు చేతకాదు. నాదివ్యాస్త్రమును నుపసంహరింప వలసినయెడ ఉపసంహరించెదను. నా అస్త్రమును నేను ఉపసంహరించిన యెడల యీ పాపాత్ముడగు అశ్వత్థామ తన అస్త్ర సంబంధమైన అగ్నిజ్వాలల యందు మమ్ములనందరిని హోమముజేయును గనుక మాక్షేమమును మీదివ్య చిత్తమందు తలంపవలయును. అని అర్జునుడు నారద వ్యాస మునులతో చెప్పి తన బ్రహ్మశిర దివ్యాస్త్రమును శీఘ్రముగా ఉపసంహరించెను. అర్జునుని మంత్రతపోబలములకు ఆ మునులు మెచ్చుకొని తల్లడిల్లిరి.

జనమేజయమహారాజా! బ్రహ్మశిర దివ్యాస్త్రమును ప్రయోగించి ఉపసంహరింపరాదు. అట్లు ఉపసంహరింపుటకు రాజులును దేవతలును సమర్థులుగారు. అర్జును డొక్కడే సమర్థుడగును గాని మరియొక డెంతవాడైనను సమర్థుడు కాడు. అర్జునుడు గొప్ప తపస్సంపన్నుడు. గొప్ప బ్రహ్మచర్య వ్రతనియమములు గలవాడు. దానశీలుడు. సత్యధర్మవంతుడు మహాత్ముడైనఅర్జునుడు బ్రహ్మశిరాస్త్రమును ప్రయోగించి ఉపసంహరింపుటకు సమర్థుడాయెనేగాని మరియొకడు సమర్థుడు కాడు. జనమేజయమహారాజా! ఆ బ్రహ్మశిర మను పేరుగల దివ్యాస్త్రము బ్రహ్మతేజోమయము. అట్లు బ్రహ్మశిర దివ్యాస్త్రమును ప్రయోగించి మరల ఉపసంహరించిన యెడల అట్లు చేసినవారినే ఆ దివ్యాస్త్రము చంపివేయును. అర్జునునకు గురుభక్తియు, వ్రతభక్తియు, అధికముగా నున్నందున ఆ బ్రహ్మశిర దివ్యాస్త్రమును మరలించుటకు అర్జునుడు సమర్థుడు కాగలిగెను. ఇట్లర్జును డసాధ్యమగు బ్రహ్మశిరాస్త్రమును మరలింపగా నారద వ్యాసమహామునులు అర్జునుని మహాత్మ్యము ఇంత గొప్పదిగదా

యని వ్యూహించిరి. అశ్వత్థామ తనదివ్యాస్త్రమును మరలించుటకు ప్రయత్నించి చూచెను. ఆ యస్త్రమును మరలించుటకు శక్యము గాక దీనమనస్సుగలవాడై వ్యాసమునీంద్రునితో యిట్లనెను.

మహాత్మా ! వ్యాసమునీంద్రా ! భీము డధర్మ యుద్ధమందు దుర్యోధనుని చంపి నాకు సిగ్గుగలుగునట్లు దుర్యోధనుని అవమానించెను. అంతట నిలువక భీము డిప్పుడు నామీాదకు వచ్చి నన్ను చంపుటకు ప్రయత్నించెను. నాకు అవమానమువలన కలిగిన రోషము చేతను ప్రాణభయముచేతను వివేకములేక బ్రహ్మశిర దివ్యాస్త్రమును ప్రయోగించితిని. ఈదివ్యాస్త్రమును మరలించుట పాండవులెరుగుదు రేగాని నాకు తెలియదు. నేను ప్రయోగించిన దివ్యాస్త్రమును పాండవులు మరలించుటచేత నాకు యెంతపాపము కలిగినను అందుకు నేను సమ్మతించితిని. అని చెప్పగా ఆమాటలను వేదవ్యాసమునీంద్రుడు విని యాతని ముఖమందు చూపునిలిపి యిట్లనెను.

ద్రోణాత్మజా ! నీ తండ్రియగు ద్రోణుడు వాత్సల్యముచేత బ్రహ్మశిర దివ్యాస్త్రమును అర్జునున కిచ్చెను. ఈ అర్జునుడును నీకు కీడుకలుగవలెనని తలచలేదు. నీవు ప్రయోగించిన బ్రహ్మశిరాస్త్రమును ఉపశమింపజేయుటకై యీ అర్జునుడు తన బ్రహ్మశిరాస్త్రమును ప్రయోగించెను. మేము కూడదనిచెప్పగా అర్జును డతని దివ్యాస్త్రమును ఉపసంహరించెను. ఇట్టి గొప్ప అస్త్రవిద్యామహాత్మ్యముగల అర్జునుని చంపుటకు నీకు సాధ్యముకాదు. నీ బ్రహ్మశిర దివ్యాస్త్రము అర్జునుని బ్రహ్మశిరాస్త్రముచేత నివారింపబడగలదు. ఆవిషయ మటుండనిమ్ము. మరియొక విషయమును చెప్పెద వినుము. బ్రహ్మశిర దివ్యాస్త్రమును మనుష్యులమీాద ప్రయోగించరాదు. మనుష్యులమీాద ప్రయోగించువానికి అశుభము కలుగును. బ్రహ్మశిరాస్త్రము ఒకనిచేత ప్రయోగింపబడి మరియొకని అస్త్రముచేత

ఉపశమించినయెడల ఆ దేశమునకు పండ్రెండు సంవత్సరములవరకు వర్షము కురియక కరువువచ్చును. పాండవులను నిన్నును ఈ దేశమును రక్షించుటకు చెప్పితిని. ఏవిధముచేతనైనను నీ బ్రహ్మశిర దివ్యాస్త్రమును ఉపసహరింపవలయును. తపస్సుచేయుటకు సిద్ధముగా వచ్చియున్నావు. రోషమును విడిచి సుఖవంతుడవుగమ్ము. అర్జునుడు ధర్మమార్గముచేత జయము పొందుటకు అపేక్షించియున్నాడు. అర్జునుడు సంతోషముగా వెళ్ళవలయును. నీకు సహజమైన నీ శిరస్సుయందుండు మణిని యీ యర్జునునకు యిమ్ము. అట్లిచ్చితివేని అర్జునుడును ధర్మరాజాదు లందరును నీ ప్రాణములను తీసికొన్నంత సంతోషమును పొంది వెళ్ళుదురు. ఈపద్ధతి మంచి సంధిప్రకారమగును. ఇట్లు చేయుట మంచిది. అని వేదవ్యాస మునీంద్రు డశ్వత్థామతో చెప్పెను. ఆమాటలను అశ్వత్థామ విని దుఃఖమనస్సుగలవాడై వ్యాసమునీంద్రునితో యిట్లనెను.

వ్యాసమునీంద్రా! పాండవులు దుర్యోధనుని బొక్కసమును తీసికొనిరి. ఆ బొక్కసమందు గొప్ప గొప్ప రత్నశ్రేష్ఠము లున్నవి. నా శిరస్సునందు నాకు సహజముగానుండు రత్నమువలన నాకు సర్పభయములేదు. దొంగలభయములేదు. దేవరాక్షసులవలన భయము కలుగదు. అగ్నిభయములేదు. ఈ రత్నములవలన నాకు యేబాధ కలుగదు. అట్టి మాహాత్మ్యముగల యీ రత్నమును పాండవులకు యిచ్చుటకు సమ్మతింపను. నీమాటలను అతిక్రమింపరాదు. అందువలన నా శిరోరత్నమును నీకు సమర్పించితిని. నా బ్రహ్మశిర దివ్యాస్త్రము పాండవులయొక్క స్త్రీల గర్భములయందుగల శిశువులను చంపి తృప్తిని బొంది ఉపశమింపుగాక. అని అశ్వత్థామ వేదవ్యాస మునీంద్రునితో చెప్పెను. ఆ మాటలను విని వ్యాసుడు యాతనితో యిట్లనెను.

అశ్వత్థామా ! నీ యిష్టప్రకారము నీ అస్త్రమువలన పాండవులయొక్క స్త్రీలగర్భముల యందుగల శిశువులనన్నిటిని నశింపజేయుము. ఒకస్త్రీ గర్భమందలి శిశువునకుమాత్రము ఆశపడకుము. అని వేదవ్యాస మునీంద్రుడు అశ్వత్థామకు చెప్పెను. ఆ మాటను అశ్వత్థామవిని వ్యాసునిమాటవలన తనమాటను తప్పుగా మనస్సునందు తలచెను. అని తన మనస్సులో అశ్వత్థామ యిట్లనుకొనెను. పాండవేయుల భార్యల గర్భములు నశింపవలెనని నేను అస్త్రమును ప్రయోగించితిని. ఇట్లు చెప్పుటచేత పాండవులభార్యల గర్భములును వారిపుత్రులయొక్క భార్యల గర్భములును అన్నిటినిచేర్చి పలికినవాడవైతివి. ఈ వ్యాసమునీంద్రుడు పాండవేయుల భార్యలయొక్క గర్భములలో ఒక్క గర్భమునకు మాత్రము ఆశపడవద్దని నాతో చెప్పెను. ఇట్లనుటచేత పాండవుల భార్యలలో ఒక్కస్త్రీ గర్భమందుగల శిశువును మాత్రము విడువుమని చెప్పినట్లాయెను. ఈ అర్థభేదమును నేను యెరుగవలసిన పనిలేదు. వ్యాసుడుచెప్పిన మాటకు నేను యిప్పుడు సమ్మతించునట్టుగా నటించి పాండవుల సకలభార్యలగర్భములను నా అస్త్రమువలన నశింపజేసెదను. అని అశ్వత్థామ తన మనస్సులో తలచి పాండవులయొక్కయు వారి పుత్రులయొక్కయు సకలభార్యల గర్భములందలి శిశువులను నశింపజేయుటకు నిశ్చయించెను. అట్లశ్వత్థామ మనస్సులో నిశ్చయించి మీరు చెప్పినట్లే చేసెదనని పైకి వ్యాసమునీంద్రునితో జెప్పెను. అశ్వత్థామ, వ్యాసుల సంభాషణ ప్రకారమంతయు కృష్ణుడు తెలిసికొని తనమనస్సులో యిట్లని యోచించెను.

ఈ దుర్వ్యారుడగు అశ్వత్థామ వ్యాసుడుచెప్పినమాట నుపేక్షించి తన యిష్టప్రకారము సకల గర్భములను నశింపజేయుటకు నిశ్చయించెను. పాపాత్ముడైన అశ్వత్థామయొక్క చెడుతలంపునకు అడ్డుపడ చూచెదను. నామాటను వీడు విననియెడల తుదకు నేను

జేయు పద్ధతి ఉన్న దేకదా! అని కృష్ణుడు తన మనస్సులో యోచించెను. ఆ సమయమున అశ్వత్థామ యొక్క మనస్సున గల చెడు తలంపును వ్యాసమునీంద్రుడు కూడ యెరిగెను. వ్యాసుడు తన మనస్సులో యిట్లని తలచెను. ఈ దుర్మార్గుడగు అశ్వత్థామయొక్క మనస్సులోనున్న చెడుతలంపును కృష్ణుడును యెరిగియున్నాడు. అట్లు కృష్ణుడు యెరిగి అశ్వత్థామతో సంభాషించతలచి యున్నాడు. అని వేదవ్యాసుడు తన మనస్సులో తలచి అశ్వత్థామతో మాటలాడక యూరకుండెను.

## శ్రీ కృష్ణుడు ఉత్తరగర్భము దగ్ధముగాకుండా జేయ నిశ్చయించుట

ఓ జనమేజయమహారాజా! అప్పుడు కృష్ణుడు అశ్వత్థామతో యిట్లనెను. అశ్వత్థామా! గడచినరాత్రి పాండవ కుమారులగు ద్రౌపదీపుత్రులైదుగురుని నీవు చంపితివి. నిద్రించిన జనులనందరిని చంపి మహాపాపమును బొందితివి. ఇప్పుడు పాండవుల భార్యల యొక్కయు, వారిపుత్రుల భార్యలయొక్కయు సకల గర్భముల యందుగల శిశువులనందరిని నీ అస్త్రముచేత చంపదలచియున్నావు. వారిలో ఒక్క స్త్రీయొక్క గర్భమందలి శిశువునైనను చంపక విడువుము. ఇట్లు చేయుటమంచిది. పాండవవంశము నిల్చునట్లుగా ఒక్క స్త్రీ గర్భమునందు గల శిశువును నేను బ్రతికించెదను. నేను యిచ్చెడి బాలుడు ధర్మముచేతను, దానముచేతను, యజ్ఞముల చేతను ప్రసిద్ధుడై జనులచేత స్తుతింపబడుచుండును. అట్టిబాలునొకని రక్షించి పాండవవంశమును నేను నిల్పెదను. గనుక నీవును అట్టి ఒక శిశువును మాత్రము విడిచి తక్కిన స్త్రీ గర్భమునందుండు శిశువులను నీ యిష్టప్రకారము నీ బ్రహ్మశిరాస్త్రముచేత దహింపుము. ఒక స్త్రీ గర్భమందుండు శిశువునకు మాత్రము నీ వాశపడకుము.

అని కృష్ణుఁ డశ్వత్థామతోఁ జెప్పెను. ఆమాటలను అశ్వత్థామ విని తీవ్రరోష కోపములు కలవాడై కృష్ణునితో యిట్లనెను.

కృష్ణా! నీవు పాండవపక్షపాతముచేత యిట్లు చెప్పుచున్నావు. నీవు చెప్పినట్లు నేను చేయను. నాబ్రహ్మశిరాస్త్రముచేత పాండవుల సకలభార్యల గర్భములును వారిపుత్రుల సకలభార్యల గర్భములును అన్నియు నశింపగలవు. నా అస్త్రముచేత దహింపబడని గర్భ మొకటియు కన్పింపదు. ఆ విషయమటుండనిమ్ము. నీ మేనల్లుడగు అభిమన్యునియొక్క తేజస్సు విరాటరాజు కూతురగు ఉత్తరగర్భమందున్నది. ఈ ఉత్తరగర్భమందలి శిశువును నీవు రక్షింపవలెనని జూచుచున్నావు. ఆపనికి నీవు పూనినయెడల నాఅస్త్రముచేత ఆఉత్తర గర్భమును గూడ అవశ్యముగా దహింపజేయుదును. అని అశ్వత్థామ కృష్ణునితో జెప్పెను. ఆ మాటలను కృష్ణుడు విని అశ్వత్థామతో నిట్లనెను.

అశ్వత్థామా ! పుణ్యాత్ముడైన అభిమన్యునియొక్క తేజస్సు ఉత్తరగర్భమందు ప్రకాశింపుచున్నది. ఆ ఉత్తరగర్భమందుండు శిశువును నీవు నీ అస్త్రముచేత చంపినను ఆ శిశువునకు నేను దీర్ఘాయుష్యము కలిగించెదనని కృష్ణుడు అశ్వత్థామతో జెప్పెను. కృష్ణుడు చెప్పిన మాటలను అశ్వత్థామవిని నవ్వుచు కృష్ణునితో మరల యిట్లనెను. కృష్ణా! నా అస్త్రముచేత దహింపబడిన శిశువును నీవు రక్షించెదనని చెప్పితివి. అస్త్రముచేత దహింపబడిన వానిని రక్షించుట మంచిదే. దీనివలన నీశక్తి తెలియబడును. అని అశ్వత్థామ కృష్ణునితో జెప్పెను. వ్యాసకృష్ణులు చెప్పినమాటలు ఆదరింపదగిన వైనను అశ్వత్థామ వారిమాటల నాదరింపక పాండవులయొక్కయు, వారి పుత్రులయొక్కయు సకల భార్యల గర్భములందలి శిశువులు నశించునట్లుగా తన బ్రహ్మశిరాస్త్రమును విడిచెను. అశ్వత్థామ

విడిచిన బ్రహ్మశిర దివ్యాస్త్రమును కృష్ణుడు చూచి వానితో యిట్లనెను.

ద్రోణపుత్రా! పూర్వము త్రికాలవేదియగు బ్రాహ్మణుడొకడు విరాటరాజుయొక్క పట్టణమగు ఉపప్లావ్యమునకు వచ్చెను. ఆ బ్రాహ్మణుడు అభిమన్యుని భార్యయగు ఉత్తరను జూచి యిట్లనెను. ఉత్తరా! నీపుణ్యమువలన ప్రాణములు క్షీణించిన పుత్రుడు నీగర్భమందు పుట్టగలడు. అందువలన నీగర్భమందుగల పుత్రునకు పరీక్షిత్తను పేరుకలుగును. అని సర్వజ్ఞుడైన బ్రాహ్మణుడు ఉత్తరతో జెప్పెను. ఆ మహాత్మునిమాట అసత్యము కానేరదు. నీవు ప్రయత్నించి నశింపజేయ దలచిన యేర్పాటు ఆ ఉత్తరగర్భమందుగల శిశువును బొందదు. ఉత్తరగర్భమందుండు బాలుడే పాండవవంశకరుడు—అని కృష్ణుడు నాతనితో చెప్పుచు మనస్సున రోషమతిశయింపగా మరల నాతనితో వెంటనే యిట్లనెను. ఓరీ! గురుపుత్రా! నీవు బాలురను చంపితివి. అందుచేత నీవుదుర్లభమైన ఆహారము గలవాడవై యితరుల సహవాససహాయములు లేనివాడవై మూడువేల సంవత్సరములవరకు తిరుగుచుండుము. నీదేహమందుగల గాయములయొక్క మురికికంపుగల రక్తము దేహమంతటను కారుచు ఆ మూడువేల సంవత్సరములవరకు వ్యాపించి యుండగలదు. ఇట్లు నీవు కష్టపడుచు నీమూడువేల సంవత్సరముల పర్యంతము భూమియందుతిరుగుచుండుము. నాచేత రక్షింపబడిన పరీక్షిత్తను అభిమన్యుని పుత్రుడు కృపాచార్యునివలన ధనుర్వేదమును తెలుసుకొని సకల శస్త్రాస్త్రములను బొంది అనేకసంవత్సరములు రాజ్యమును పాలింపగలడు. ఆ పరిక్షిత్తునకు జనమేజయుడనుమహారాజుపుట్టి నీవుచూచుచుండగా మిక్కిలి తేజస్సుచేత ప్రకాశింపుచు ప్రవర్తింప గలడు. నాతపస్సత్యములయొక్క గొప్ప ప్రభావములను చూడుము. నేను

చెప్పినప్రకారము తప్పక జరుగగలదు. అని కృష్ణుడు రోషముగల వాడై అశ్వత్థామను శపించి అశ్వత్థామతో చెప్పెను. అప్పుడు వేద వ్యాసమునీంద్రుడు అశ్వత్థామతో యిట్లనెను. ఓరీ! అశ్వత్థామా! నీవు బ్రాహ్మణకులమందు పుట్టియు, క్రూరకర్మమును చేయుటకు సమ్మతించి నామాటలను నిర్లక్ష్యము చేసితివి. నీయస్త్రముచేత స్త్రీలగర్భములయందుండు బాలురనుచంపి పాపమును కట్టుకొంటివి. గనుక కృష్ణుడు చెప్పినప్రకారము మూడువేలసంవత్సరముల పర్యం తము కృష్ణుని శాపఫలము అనుభవింపుము. అని వేదవ్యాసమునీం ద్రుడు అశ్వత్థామను శపించి నీచకర్ముడా! పో! పొమ్మని అశ్వత్థా మతో చెప్పెను. ఆవ్యాసమునీంద్రుడు శపించిన వాక్యములను అశ్వ త్థామవిని వ్యాసుని ముఖమునుజూచి యిట్లనెను.

వ్యాసమునీంద్రా! నీవు మనుష్యులలోనే సంచరింపు చుం డుము. అని యిట్లు అశ్వత్థామ వ్యాసునకు ప్రతిశాపమిచ్చి మరల యిట్లనెను. వ్యాసమునీంద్రా! నీవద్దరనే నేను ప్రవర్తింపు చుండె దను. నీవును కృష్ణుడును సత్యవాదులు యగుదురుగాక అని అశ్వ త్థామ వేదవ్యాసమునీంద్రునితో చెప్పెను. అని చెప్పి అశ్వత్థామ తనకు సహజముగానుండు శిరోమణిని పాండవులకిచ్చి తానుతపో వనమునకు వెళ్ళెను. అశ్వత్థామ తపోవనమునకు వెళ్ళినపిమ్మట ధర్మ రాజ భీమార్జున నకుల కృష్ణులు అయిదుగురును, ఆ వేదవ్యాసమునీం ద్రునకు నమస్కరించి అతనియొక్క అనుమతిపొంది అతి శీఘ్ర ముగా తమశిబిరమునకు వచ్చిరి. జనమేజయ మహారాజా! ధర్మరా జాదులందరును రథములుదిగి దుఃఖించుచు యేడ్చుచున్న ద్రౌపదిని జూచిరి. ఆద్రౌపది దుఃఖమును చూడగా ధర్మరాజాదుల కందరికిని మరల క్రొత్తదుఃఖములు కలిగెను. ధర్మరాజాదు లందరును ద్రౌపది చుట్టును కూర్చుండిరి.

## భీముడు అశ్వత్థామ శిరోరత్నమును ద్రౌపదికిచ్చుట

జనమేజయ మహారాజా! ఇట్లు కూర్చున్న పిమ్మట ధర్మ రాజు పంపగా భీముడు అశ్వత్థామ శిరోరత్నమును ద్రౌపదికి సమ

ర్పించి యిట్లనెను. ద్రౌపదీ! అశ్వత్థామయొక్క పొగరణగెను. ఇక దుఃఖమును విడువుము. రాజధర్మమును నీవుచక్కగా యోచింపుము. నీశాంతగుణము ధర్మరాజుయొక్క దుఃఖమును పోగొట్టును. ద్రౌపదీ! పూర్వము సంధిచేయుటకు ధర్మరాజు కృష్ణునిపంపినప్పుడు కృష్ణునితో నీవు చెప్పిన గర్వ రాజస కఠినవాక్యములనన్నిటిని యిప్పుడు తలంపుము. అప్పుడు నీవు సంధిచేయవద్దనియు. అవశ్యముగా యుద్ధము చేయవలెననియు కృష్ణునితో చెప్పితివి. నీయిష్టప్రకారమే సంధికుదరక, యుద్ధమే జరిగెను. యుద్ధమందు శత్రువులు క్రూరముగా జంపక పూలదండలతో కొట్టరుగదా! గనుక నీకొడుకులగు ప్రతివింధ్యాదులైదుగురును చచ్చినందుకు నీవు దుఃఖింపకుము. అని భీముడు ద్రౌపదీదేవితో చెప్పెను. ద్రౌపదీ! ధృతరాష్ట్రుని వంశమునకు మగదిక్కు లేకుండునట్లు అందరిని చంపివేసితిని. కృష్ణుని కృపవలన అర్జునునియొక్క గొప్ప అండవలన ధృతరాష్ట్రుని వంశమును బొత్తుగా నశింప జేసితిని. దుశ్శాసనుని రొమ్ముచీల్చి వానిరక్తమును త్రాగితిని. దుర్యోధనుని తొడలను విరుగగొట్టి నాయెడమ పాదముచేత దుర్యోధనుని శిరస్సును తన్నితిని. రాజులందరునుచూచి అందుకు సంతోషించిరి. మనమిప్పుడు మిక్కిలి సంతోషింప వలసిన కాలమై యున్నది. ఇంతసంతోషకాలమందు నీవు దుఃఖింపరాదు. అశ్వత్థామ ద్రోణాచార్యుని పుత్రుడవుటవలన అశ్వత్థామను చంపుటకు అర్జునుడు సమ్మతింపలేదు. అర్జును డందులకు సమ్మతింపక గురుసుతుని అవమానించి వానిశిరోరత్న దివ్యాస్త్రములను రెంటిని తెచ్చినాడు. గురుసుతునియొక్క శిరోరత్నమును మనకుయిచ్చినందున అతనికీర్తి యను శరీరము నశించెను. గురుసుతుని శరీరము మురికిని గలిగి యున్నది. మరియొక విశేషముగలదు. వేరేమియు అతనిశరీరమందగుపించదు. వైరమను విషయము లేకుండునట్లు మనశత్రువులందరును నశించిరి. ఇట్లుచేయుటకు మనము సమర్థులమైతిమి. ధర్మరాజు నిర్మలమైన కీర్తికిఆధారుడైయున్నాడు. నీవు దుఃఖమును విడువుము.

అని భీముడు ద్రౌపదితో చెప్పెను. ఆమాటలను ద్రౌపది విని కొంత దుఃఖము విడిచి కొంత తెలివి దెచ్చుకొని లేచెను. ద్రౌపది యా గురుసుతుని శిరోరత్నమగు పద్మరాగమని తనచేతితో తీసికొనెను. ఆపద్మరాగమణి దేదీప్యమానముగా ప్రకాశించుచుండెను. ఆపద్మ రాగమణిని ద్రౌపది తీసికొని భీమునితో నిట్లనెను.

భీమా! గురుసుతుని శిరస్సునందు సహజముగానుండు యీ శిరోమణిని చూచినతోడనే నాదుఃఖము నశించి నాకు సంతోషము కలిగెను. ఇంతమాత్రము నాకు చాలును. ఈ గొప్పరత్నమును ధరించుటకు యీ ధర్మరాజే యోగ్యుడు. అని ద్రౌపది భీమునితో చెప్పుచు ఆ రత్నమును ధర్మరాజుయొక్క చేతిలో వుంచెను. గురు సుతునియొక్క శిరోరత్నమును భక్తి ప్రీతిపూర్వకముగా ధర్మరాజు తన శిరస్సునందు ధరించెను. అట్లు ధరించి ప్రకాశించు ధర్మరాజు చంద్రోదయకాలమందు ప్రకాశించు తూర్పుపర్వతమువలె నుండెను. ఇట్లు ధర్మరాజు సంతోషమును ద్రోపదికి కలిగించి అక్కడుండు స్త్రీజనులును, సాత్యకి సహదేవుడు మొదలగు పురుషులును అందరు వినునట్లుగా ద్రోణజునకు తమకు కలిగిన కలహము, రోషము వివాదము విషయకములైన విశేషములను స్పష్టముగా విశదీకరించెను. అంతట ధర్మరాజు మొదలగు వారందరును తమకు సంతాన హాని కలిగించిన బ్రహ్మశిర దివ్యాస్త్రముయొక్క మహాత్మ్యమును వూహించి దుఃఖంచి గురుసుతునితో కృష్ణుడు చెప్పిన మాటలను తలచుకొని సంతోషించిరి. అట్లు కృష్ణుని మాటలవలన ఉత్తరకు పుత్రుడుకలుగునని సంతోషించుచు అదియెట్లగునోయని సందేహించుచుండిరి. ఆసమయమున వుత్తరకు తప్ప తక్కిన పాండవ స్త్రీల కందరకును గర్భములు నశించెను. బ్రహ్మశిర దివ్యాస్త్రమును గురుసుతుడు ప్రయోగించినప్పుడా యస్త్రప్రభావమువలన పాండవుల స్త్రీల గర్భమందలి శిశువులన్నియు దహింపబడెను. ఆ బ్రహ్మ

శిరాస్త్రము ఉత్తర గర్భమందలి శిశువునుకూడ నశింపజేయుటకు ప్రయత్నించెను. కృష్ణుడా ద్రౌణితో మాటలాడుచునే, తన దివ్య చిత్త సంకల్పముచేత ఉత్తరగర్భము దహింపకుండు నట్లు రక్షించెను. అందువలన అశ్వత్థామయొక్క బ్రహ్మశిరదివ్యాస్త్రమువలన కలుగు పుపద్రవము ఉత్తరాగర్భమును సోకలేదు. ఆ విశేషమును కృష్ణుడును ఉత్తరయు తప్ప యితరులెరుగరు. జనమేజయమహారాజా! ఆవిషయ మటుండనిమ్ము. ఆసమయమున ధర్మరాజు పుత్రదుఃఖమును విడువక కృష్ణునితో యిట్లనెను.

మహాత్మా! కృష్ణా! ద్రౌపదీపుత్రు లైదుగురును అఖండమైన బలపరాక్రమ శౌర్యవంతులు. అశ్వత్థామ ఒక్కడే యీ శిబిరములో బ్రవేశించి బలహీనులను చంపినట్లుగా ద్రౌపదీపుత్రులను యెట్లుచంపెనో తెలియదు. అట్లు చంపుటకు నాతం డెట్లు సమర్థుడో తెలియదు. ఆద్రౌణి కత్తిచేత అందరిని నరికినట్లు తోచుచున్నదిగాని బాణములచేతనైనను చంపినట్లులేదు. ధృష్టద్యుమ్నుడు సకల యుద్ధవిశేషముల నెరిగినవాడు. అమితమైన భుజబలవంతుడు. అగ్నిహోత్రునివంటి తేజోవంతుడు. దేవేంద్రుడు మెచ్చుకొనదగిన ధనుర్విద్యాసమర్థుడు. అట్టి ధృష్టద్యుమ్నుడు డశ్వత్థామయొక్క గర్వమును. మాన్పలేక గురుసుతునిచేత చచ్చెను. ఆతం డొక్కడే యీ శిబిరములో ప్రవేశించి వుత్తమోజుడు శిఖండి మొదలగు తక్కిన పాంచాలుర నందరిని చంపివేసెను. ఆద్రోణపుత్రు డొక్కడే యింతమందిని చంపడము నాకు మిక్కిలి ఆశ్చర్యము కలుగుచున్నది. ఏకారణముచేత ద్రోణజునకు యింత బలశక్తి కలిగెనో ఆ కారణమును నాకు చెప్పుము అని ధర్మరాజు అడుగగా కృష్ణు డిట్లు అనెను.

## ధర్మరాజు కృష్ణునివలన శివప్రభావము నెరుంగుట

ధర్మరాజా! శివదేవుడు పరమేశ్వరుడు. అధికమైన కృపగలవాడు. భక్తులకు కృపబూని శుభములను కలిగించువాడు. అట్టి

రుద్రదేవుని గురునందనుం డాశ్రయించి గడచిన రాత్రియందు మిక్కిలి బలశౌర్యములు గలవాడై అధికుడాయెను. ఆతండు శివుని వరము వలన మిక్కిలి బలవంతుడై మీా శిబిరములో ప్రవేశించి. యిట్లందరిని చంపెను. పగ తీర్చుకొనెను. ధర్మరాజా ! ఆ శివదేవు డనుగ్రహించినయెడల అన్నికోరికలను ఫలింపజేయగలడు. దేవేంద్రుని గెలుచునంత గర్వబల లక్ష్మి తేజోదేహ భావములను సమగ్రముగా యివ్వగలడు. ఆ శివదేవుడు శత్రువులను చంపుటకు సమర్థమైన బలశౌర్యములను ఒక్క అశ్వత్థామ కిచ్చుట మిక్కిలి ఆశ్చర్యము గాదు. ధర్మరాజా ! ఆ శివదేవుని నేను స్పష్టముగా యెరుగుదును. సకలలోకములను ఆ శివదేవుడు పుట్టించుచు రక్షించుచు సంహరింపుచుండును. ఆ శివుడు తన మనస్సునందు సంకల్పించిన మాత్రము చేతనే సకల ప్రపంచము సృష్టియగుచుండును. శివదేవుడు భక్త స్వాధీనుడు. శివుని యింత పరిమితిగలవాడని చెప్పుటకు సాధ్యము కాదు ఆ పరమేశ్వరుడగు శివునియొక్క దివ్యలీలలను చెప్పెదను వినుము.

ధర్మరాజా ! పూర్వము సృష్ట్యాదియందు బ్రహ్మదేవుడు సకల భూతములను సృష్టింపవలచి శివునిదర్శనమునకు వెళ్ళెను. బ్రహ్మదేవుడప్పుడు ప్రజాసృష్టిని చేయవలెనని శివునకు తెలిపెను. శివుడు బ్రహ్మదేవునియొక్క యిష్టమును ఫలింపజేయబూని తనమనస్సులో యిట్లని తలచెను: తపస్సు సకలకార్యములను సాధించుటకు ముఖ్యమైన సాధనముగానున్నది. గనుక నేను తపస్సుచేసి ప్రజలనుసృష్టించెదను. అని యిట్లు రుద్రుడు తనమనస్సులోనూహించి నీటిలోమునిగి తపోనిష్ఠయందుండెను. అంతటబ్రహ్మదేవుడు అనేకసహస్ర సంవత్సరముల పర్యంతము భక్తిపూర్వకముగా శివునిరాకకు యెదురు చూచుచుండెను. బ్రహ్మదేవుడు తనతపఃప్రభావమువలన దక్షప్రజాపతిని సృష్టించి దక్షునితో నిట్లనెను.

దక్షుడా! నీవు వెళ్ళి ప్రజలను సృష్టింపుము. ప్రజలను సృష్టించుకొరకు నిన్ను నేను సృష్టించితి నని బ్రహ్మదేవుడు దక్షునితో చెప్పెను. అప్పుడు దక్షుడు బ్రహ్మదేవునితో నిట్లనెను. మహాత్మా! బ్రహ్మదేవా! నాకంటె పెద్దవారు యితరులెవ్వరును లేనియెడల నీవు చెప్పినట్లు నేను ప్రజలను సృష్టించెదను. అని దక్షుడు చెప్పగా అతనితో మరల బ్రహ్మదేవుడిట్లనెను. దక్షుడా! నీకంటె పెద్దవాడు రుద్రదేవుడుకలడు. అతడు జలములయందు మునిగియున్నాడు. ప్రజా సృష్టి జేయుటకు నిన్ను నేను నియమించెదను. ఇక ప్రజాసృష్టిజేయుటకు నీకంటె పెద్దవారెవ్వరును లేరు. నీవే ప్రజలను సృష్టింపుము. అని బ్రహ్మదేవుడు దక్షప్రజాపతితో చెప్పెను. దక్షప్రజాపతి దేవ రాక్షస మనుష్య పశ్వాదిజాతి భూతములను సృష్టించెను. ఆభూతములన్నియు ఆకలిగలవై దక్షప్రజాపతిని భక్షించుటకు ప్రయత్నించెను. దక్షుడు శీఘ్రముగా బ్రహ్మదేవుని దగ్గరకు పోయి యిట్లని ప్రార్థించెను.

మహాత్మా! బ్రహ్మదేవా! దేవాది సకల భూతములును ఆకలిగలవై నన్ను భక్షించునిమిత్తమై నామీదికి వచ్చుచున్నవి. ఆ సకల భూతములకును తగిన ఆహారములను యేర్పరచి నన్ను రక్షింపుమని దక్షప్రజాపతి బ్రహ్మదేవుని ప్రార్థింపగా ఆ మాటలను బ్రహ్మదేవుడు విని ఓషధులును వృక్షములవలన గలుగు ఫలములును, కందమూలాదులును, భక్ష్యాదులును, యివియన్నియు భూతములకు నాహారమగునట్లు యేర్పరచి నియమించెను. బలవంతమగు భూతములకు బలహీనములగు భూతములు ఆహారములుగా ఆజ్ఞాపించెను. అని బ్రహ్మదేవుడు సకల భూతములకు నాహారములను యేర్పరపగా నా భూతములన్నియు సంతోషించి పోయి బ్రహ్మదేవుడు నియమించిన ప్రకారము ఆహారములను భక్షించుచుండెను. ఆ భూతము లన్నియు నట్లు వృద్ధిపొంది సంతానములను కలిగించుకొని సమృద్ధిని పొందు

చుండెను. బహుకాలమట్లు జరిగినపిమ్మట రుద్రుడుజలములోనుండి లేచివచ్చి దేవ మనుష్యాది భూతకోట్లను జూచి కోపించుకొని తన లింగము నూడపెరికి క్రిందపడవేసెను. (లింగమనగా శిశ్నమని యెరుంగదగును) లింగమును పెరికి క్రిందపడవేయుట చూచి బ్రహ్మదేవుడు శాంతవాక్యములచేత రుద్రుని కోపమును అణచుచు దగ్గరకు పోయి యిట్లనెను.

మహాత్మా! రుద్రమూర్తి! నీ లింగమును యిట్లు పెరికి వేయుటకు కారణమేమో చెప్పుము. కోపించుకొనకు మని బ్రహ్మదేవుడు చెప్పగా రుద్రదేవుడిట్లనెను. మహాత్మా! బహ్మదేవా! నేను భూతములను సృష్టించుటకొరకు జలములయందు ఘోరమైన తపస్సుచేసి వచ్చితిని. నేను రాకమునుపే ఇతరునిచేత భూతములు సృష్టింపబడెను. అందుచేత నా లింగమును పెరికి క్రిందవేసితిని. భూతములను సృష్టించుటకు లింగము వుపయోగించునేగాని మరియొక కార్యమునకు లింగము వుపయోగించదు. ఆ కారణమువలన నిక యీ లింగముతో నాకు ప్రయోజనము లేదని పెరికివేసితిని. అని రుద్రదేవుడు బ్రహ్మదేవునితో చెప్పి మిక్కిలి రోషముచేత విజృంభించి హిమవంత పర్వతమునకు పోయి మహాతపస్సును చేయుచుండెను. అంతట రుద్రుని లింగము మిక్కిలి తేజోరూపమై ప్రకాశించుచుండెను. ఆ లింగమును బ్రహ్మ దేవేంద్రాదులు చూచి బ్రహ్మనులును సకల దేవతలు, నా లింగమును పూజించిరి.

ధర్మరాజా! బహుకాలమునకు దేవత లందరును గొప్ప యజ్ఞమును జేయదలచి కావలసిన పదార్థములను సమగ్రముగా సంపాదించిరి. హవిర్భాగముల నిచ్చుటకు తగిన దేవతలను యేర్పరచుకొని మిక్కిలి శాంతచిత్తముగలవారై యుండిరి. శాంత చిత్తులైన దేవత లందరును యజ్ఞము చేయుటకు ప్రారంభించిరి గాని రుద్రుని మాహాత్మ్యమును యెరుగక రుద్రమూర్తికి హవిర్భాగము కల్పన జేయలేదు.

## రుద్రుడు దేవతలుజేయు యజ్ఞమును పాడుచేయుట

ఆ యోగమూర్తియగు రుద్రదేవుడు తనకు హావిర్భాగకల్పనను దేవతలు చేయలేదని యెరిగి తపోబలమువలన ధనుస్సును సృష్టించెను. ఆ ధనుస్సు మిక్కిలి పొడవుకలదై మిక్కిలి ఆశ్చర్యమును కలిగించుచు బాలసూర్యుని కాంతివంటి కాంతిచేత ప్రకాశించుచుండెను. యజ్ఞసాధన పదార్థములును నారి మొదలగు సాధనములుగా యేర్పరచి ధనుస్సునకు అవయవము లగునట్లు చేసెను. అట్టి భయంకర ధనుస్సును అధిక కోపాగ్నిచేత ధరించి ఆ రుద్రుడు దేవతలు చేసెడి యజ్ఞభూమికి వచ్చెను. రుద్రుడట్లు అతివేగ భయంకరముగా వచ్చినప్పుడు భూచక్రమంతయు దిర్దిర తిరిగెను. పాతాళలోకము ఘూర్ణిల్లెను. కులపర్వతము లన్నియు పెల్లగిల్లెను. దిక్కులన్నియు గడగడ వణకెను. సూర్య చంద్ర అగ్నిహోత్రులకు కాంతి మాసెను. దేవలోకమంతయు వ్యాకులత్వమును పొందెను. ఇట్లు రుద్రుడు దేవతల యజ్ఞమును చెరచుటకు వచ్చినప్పు డిటువంటి లోకనాశ నిమిత్తములు కలిగెను. దేవత లందరును భయముచేత నిశ్చేష్టితులై యజ్ఞమునుజరుపుటకు నేర్పులేక చిత్రపు బొమ్మలవలె నూరకుండిరి. అంతట రుద్రు డొక బాణమును వేసెను. ఆ బాణము యజ్ఞరూప విగ్రహముయొక్క రొమ్మునందు దూరిపోయెను.

ఆ యజ్ఞమొక మృగరూపమునుదాల్చి అగ్నిహోత్ర సహితముగా పారిపోయెను. ఇట్లు జరిగినపిమ్మట దేవతలు నిశ్చేష్టితులై యూరకుండిరి. రుద్రుడు తన ధనస్సుయొక్క కొనచేత సవితృడను దేవునియొక్క రెండుచేతులను నరికెను. పూషుడను దేవునియొక్క పండ్లు రాలగొట్టెను. భగుడను వారియొక్క నేత్రములను పొడిచి నశింప జేసెను. దేవతలందరును భయపడి యజ్ఞముతో కూడా నలు